ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 29.07.2026 | సంపుటి : 13 సంచిక : 09 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# పేపర్ల లీకేజీ వెనుక మాఫియా

## విద్యార్థులపై దమనకాండకు సమాధానం ఇవ్వండి



- వారిపై దాడి చేయమని ఎవరు ఆదేశించారో చెప్పాలి
- యువత ఆలోచనలను, ఆకాంక్షలను పట్టించుకోని ప్రధాని మోడీ
- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చలో ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రియాంక
- మోదీకి ఇన్‌స్టా రీల్స్‌పై ఉన్న శ్రద్ధ సమస్యలపై లేదు :గౌరవ్ గొగోయ్
- ప్రధాన్‌ను తొలగించి.. మోదీని కాపాడారు: అఖిలేశ్ యాదవ్

న్యూఢిల్లీ,జూలై28(జనంసాక్షి): నీట్ ప్రశ్నపత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన దమనకాండకు సమాధానం చెప్పాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై దాడి చేయాలని ఎవరు ఆదేశించారని ఆమె సూటిగా ప్రశ్నించారు. వారిపై టియర్ గ్యాస్ ఎందుకు ప్రయోగించారు.. అలాగే విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందంటూ కేంద్రానికి ప్రియాంక గాంధీ వరుసగా ప్రశ్నలు సంధించారు. అలాగే ప్రభుత్వ తీరును గట్టిగా తూర్పారా బట్టారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంగళవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ..

మిగతా 2లో..

"విద్యార్థులపై టియర్ గ్యాస్, లాఠీఛార్జ్, వాటర్ క్యానన్లు ప్రయోగించాల్సిన అవసరం ఏమొచ్చింది? యువతులను అవమానిస్తూ, వారి బట్టలు చించి, దారుణంగా కొట్టించాల్సిన అవసరం ఏముంది? దేశ యువతపై పెల్లెట్ గన్స్, ఏకే-47 ప్రయోగించాల్సిన అవసరం ఏమొచ్చింది? వారేమైనా తీవ్రవాదులా? పెల్లెట్ గన్స్ కాల్చాలని ఆదేశాలు ఇచ్చింది ఎవరు? ప్రధానమంత్రా? లేక హోంమంత్రా? దీనికి మీరు సమాధానం చెబుతారా? కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే కాదు దేశమంతా అడుగుతోంది. దేశప్రజలకు సమాధానం చెప్పాల్సిన పూర్తి బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దేశ యువత అంటే మీకు ఎందుకంత భయం. ప్రజల గొంతును అణిచివేసే హక్కు మీకు ఎవరు ఇచ్చారు?"

– కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ

## ఇకపై లీకులకు పాల్పడితే దోషులకు పదేళ్ల జైలు.. రూ. పది కోట్ల జరిమానా

- భవిష్యత్‌లో పేపర్ లీకులకు అడ్డుకట్ట
- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మంత్రి జితేంద్ర సింగ్
- గతంలో లీకులు జరిగినా చర్యలు తీసుకోని ప్రభుత్వాలు



న్యూఢిల్లీ,జూలై28(జనంసాక్షి): భవిష్యత్‌లో పేపర్ లీక్‌లు అరికట్టేందుకే యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకువస్తున్నట్లు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చలో మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఈ చట్టం ఒక మైలురాయిగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్ కోసం మోదీ కృషి చేస్తున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా

మిగతా 2లో..

## ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు

- ఆయనకు విద్యాశాఖ బాధ్యతలు కట్టబెట్టడం దారుణం
- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను వెనకేసుకొచ్చారు
- రాహుల్ మండిపాటు

2లో..

# భవిష్యత్‌లోనూ హైడ్రా కొనసాగుతుంది

## కబ్జాలు చేస్తే ఎంతటి బడా బాబులైనా వదలం

- కబ్జాకోర్లు మాత్రమే హైడ్రా వద్దంటున్నారు
- కావాలనే సోషల్ మీడియాతో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు
- గండిపేట,బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా?
- హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ ప్రభుత్వానికి ఉంది
- హైకోర్టు ఆదేశాలపై సమీక్షిస్తాం
- ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ,జూలై28(జనంసాక్షి): హైడ్రా పనులు కొనసాగించి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కబ్జాకోర్లు మాత్రమే హైడ్రా వద్దంటున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. కబ్జాలు చేస్తే బడా బాబులైనా, పేదలైనా ఊరుకోమని స్పష్టం చేశారు. గండిపేట,బతుకమ్మ కుంటలను ఆక్రమించింది పేదలా? పెద్దలా? అని విపక్షాలను ఆయన ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా? పెద్దలదా? అని వారిని నిలదీశారు. హైడ్రా తాము తీసుకొచ్చిన అతిపెద్ద

మిగతా 2లో..

## గ్లోబరీనా అక్రమాలు సీబీఎస్ఈకీ విస్తరించాయి

- మొదట్లోనే చర్యలు తీసుకోకపోవడంతోనే సమస్య పెద్దదైంది
- ప్రశ్నపత్రాల లీకేజీలకు కారకులను కఠినంగా శిక్షించాలి
- కేసీఆర్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు
- ఇకనుంచి సకాలంలో ఫీజుల చెల్లింపునకు చర్యలు : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

2లో..

## తెలంగాణకు 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి

- స్థానిక అవసరాలకు తగినట్లు వీబీ జీ రామ్ జీలో పనులు చేర్చండి
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

ఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (ఖఓంజ-ఉ) కింద 11,56,915 ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివ రాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కృషి భవన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వివరించారు. గత ప్రభుత్వం ఖఓంజ-ఉ ను వినియోగించుకోకపోవడంతో రాష్ట్రంలో గత పదేళ్లు పేదలు సొంత ఇళ్లు నిర్మించుకోకపోవడంతో, ఇప్పుడు తీవ్ర డిమాండ్ నెలకొందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కేంద్ర

మిగతా 2లో..

## సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా తెలంగాణ

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులకు అభినందనలు

12లో..

# మైనర్లను, నేరచరిత్ర లేనివారిని వదిలేయండి



- రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించిన సుప్రీం
- విద్యార్థులపై లాఠీఛార్జి అమానుషం
- పోలీసుల తీరును తప్పుపట్టిన అత్యున్నత న్యాయస్థానం
- ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలుపడం దేశ పౌరుల ప్రాథమిక హక్కు
- దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ఊరుకోదు
- ఘటనలపై 'స్వతంత్ర విచారణ' జరగాల్సిన అవసరం ఉందని వ్యాఖ్య

న్యూఢిల్లీ,జూలై28(జనంసాక్షి):పరీక్ష పేపర్ లీకేజీలపై దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో అరెస్టయిన విద్యార్థుల విషయంలో సుప్రీంకోర్టు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. 18 ఏళ్లలోపు మైనర్లు, అలాగే ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి, వారిపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని అత్యున్నత న్యాయస్థానం తన తాత్కాలిక ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది నీట్ పరీక్ష పేపర్ లీక్ అంశంపై దేశవ్యాప్తంగా సాగిన నిరసనల సమయంలో, విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీ ఛార్జ్, దౌర్జన్యాలపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటనలకు సంబంధించిన పిటిషన్లపై విచారణ సందర్భంగా, అత్యున్నత

మిగతా 2లో..

## నిరసనకారులకు అండగా ఉంటాం

- ఏ ఒక్కరినీ ఒంటరిని చేయబోం
- కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ ప్రకటన

2లో..

## అధికారంలోకి వచ్చాక హైడ్రాను బంగాళాఖాతంలో విసిరేస్తాం

- ముఖ్యమంత్రి చేతిలో బ్లాక్ మెయిలింగ్ సాధనంగా మారింది
- బడా బాబులను వదిలి పేదల ఇళ్ల జోలికే ఎందుకు వెళ్తున్నారు?
- ఒక్క ఇల్లు కట్టకపోయినా.. వేల ఇళ్లు కూల్చివేశారు: కేటీఆర్



న్యూఢిల్లీ(జనంసాక్షి): అధికార పార్టీ నేతల అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైడ్రాపై హైకోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. "హైడ్రా తొమ్మిది

మిగతా 2లో..

## తెలంగాణ పెండింగ్ రైల్వేప్రాజెక్టులను త్వరగా పూర్తిచేయండి

- టైర్ -2 ఐటీ నగరాలకు కేంద్ర సహకారం అందించాలి
- కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన కేటీఆర్

2లో..

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్ట్

అత్తాపూర్ స్టేషన్‌కు తరలింపు

హైదరాబాద్,జూలై28(జనంసాక్షి): సహచర ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కేసు నమోదు నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తరలించారు. శంకరపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు

మిగతా 9లో..


## డేటా గోప్యతపై వివరణ ఇవ్వండి

ఇన్‌స్టా, ఫేస్‌బుక్, గూగుల్, ఎక్స్‌కు కేంద్రం నోటీసులు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇన్‌స్టాగ్రామ్ ఫేస్‌బుక్ గూగుల్ వంటి పలు సామాజిక మాధ్యమాలకు కేంద్రం సమన్లు జారీ చేసింది. డేటా గోప్యత, ఇతర నిబంధనలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఆగస్టు 3న సోషల్ మీడియా ప్రతినిధులతో పార్లమెంటరీ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు కమిటీ ఛైర్మన్, భాజపా ఎంపీ నిశికాంత్ దూబే ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

మిగతా 9లో..

## హైదరాబాద్‌లో భారీ వర్షం



- పలుచోట్ల ట్రాఫిక్‌జామ్
- రోడ్లపై చేరిన వరద నీరు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది మియాపూర్, కూకట్‌పల్లి, రాయదుర్గం, మణికొండ, హైటెక్‌సిటీ, మాదాపూర్, యూసుఫ్‌గూడ, ఖైరతాబాద్, కోఠి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, నాచారం, కాప్రా తదితర ప్రాంతాల్లో భారీ వర్షంతో రహదారులు జలమ యమయ్యాయి. హైటెక్‌సిటీ, మాదాపూర్, మియపూర్, చందానగర్‌తో పాటు మలక్‌పేట, చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ అయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు మరికొన్ని ప్రాంతాల్లో రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి – హైదరాబాద్(జనంసాక్షి):

# భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం

- ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ గ్రామసభలు
- రీసర్వేకు కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- నిర్దేశించిన గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి : మంత్రి పొంగులేటి



హైదరాబాద్,జూలై28(జనంసాక్షి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు భూదార్ గుర్తింపు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతి, ప్రజల స్పందన, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, సర్వే అధికారులతో మీక్షించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసిన 2,240 గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ రీసర్వేపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించాలని, రీ-సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు, భూ యజమానులకు

మిగతా 2లో..

## మైనర్లను, నేరచరిత్ర లేనివారిని
# వదిలేయండి

న్యా యస్థానం పోలీసుల తీరును తప్పుబట్టింది. శాం తియుతంగా నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని గుర్తుచేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 'నిర్దోషులపై అతిక్రమణలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టం ఊరుకోదు, తన పని తాను చేసుకుపోతుంది' అని ధర్మాసనం హెచ్చరించింది. ఈ ఘటనలపై 'స్వతంత్ర విచారణ' జరగాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. 'బాధ్యులను తేల్చనప్పుడు, విచారణకు అర్థమే లేదు' అని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలుపడం పౌరుల ప్రాథమిక హక్కు అని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. నీట్ పరీక్షలో అక్రమాలపై న్యాయం కోరుతూ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న తరుణంలో, వారిపై బలాన్ని ప్రయోగించడం సరికాదని కోర్టు భావించింది. ఈ ఆందోళనల సమయంలో విద్యార్థులపై జరిగిన దాడి మాత్రమే కాకుండా, గాయపడిన పోలీసుల రక్షణ, వారి భద్రతా పరికరాల గురించి కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కోర్టు పేర్కొంది. శాంతిభద్రతల నిర్వహణ అనేది ద్వితీయ ప్రాధాన్యం కాకూడదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా వివిధ సందర్భాల్లో జరుగుతున్న నిరసనల సమయంలో శాంతిభద్రతల నిర్వహణకు, అల్లర్లను అదుపు చేయడానికి సంబంధించి ఒకే విధమైన ప్రొటోకాల్ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు వేర్వేరుగా ప్రవర్తించడం సరికాదని, నిర్దిష్ట నియమావళి ఉండాలని సూచించింది.

## భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణంలో రీ-సర్వే కీలక ఘట్టం

వివరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని తెలిపారు. రీ-సర్వే జరుగుతున్న ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని, ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని మంత్రి గారు ఆదేశించారు. భూముల హద్దుల నిర్ధారణలో పారదర్శకత పాటిస్తూ ప్రతి దశలో ప్రజలను భాగస్వాములుగా చేయాలని సూచించారు. రీ-సర్వే పనులను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, వారానికోసారి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది కుటుంబ జీవనాధారమని పేర్కొన్న మంత్రి, దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ-సర్వే చేపట్టిందన్నారు. డీజీపీఎస్, రోవర్స్, జీఐఎస్ వంటి ఆధునిక సాంకేతికత తో శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించడం వల్ల ప్రతి కమతానికి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించబడతాయని తెలిపారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించి, భూ భారతి పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా భూముల యాజమాన్యంపై శాశ్వత స్పష్టత ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల భూ రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా కాకుండా ప్రజల జీవితాలను ప్రభావితం చేసే కీలక బాధ్యతగా భావించి అంకితభావంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు రీ-సర్వేను విజయవంతంగా పూర్తి చేసి, భూ వివాదాల్లేని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. నక్షా లేని 373 గ్రామాల్లో కూడా రీసర్వే చురుకుగా సాగుతోందని వీలైనంత త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సర్వేకు వెళ్లినప్పుడు ముందుగానే పట్టాదారులకు విధిగా నోటీసులు ఇవ్వాలని అదేవిధంగా ఆ గ్రామంలో ప్రభుత్వ భూములకు మార్కింగ్ చేయాలని గ్రామకంఠం హద్దులను నిర్ణయించిన తర్వాతే సర్వే చేపట్టాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు సంతృప్తి చెందేలా సర్వే చేపట్టాలని ఏది చేసినా ప్రజా కోణంలోనే చేయాలని అన్నారు.

# పేపర్ల లీకేజీ వెనుక మాఫియా..

కేంద్ర ప్రభుత్వ వైఖరిపై యువత ఆగ్రహంతో ఉందని అన్నారు. దేశ యువతను చూసి కేంద్రం భయపడుతోందని విమర్శించారు. విద్యావ్యవస్థను ఆర్ఎస్ఎస్ కబ్జా చేసిందని ఆరోపించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ కారణంగా చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరగాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల బాధను ఎవరు తీరుస్తారని కేంద్రాన్ని ఆమె ప్రశ్నించారు. ఆ తల్లిదండ్రులు ఎంతో ఆవేదనతో ఉన్నారని పేర్కొన్నారు. ఆందోళన చేసిన విద్యార్థులు తీవ్రవాదులు కాదు కదా? అంటూ కేంద్రంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయాల్సిన అవసరం ఏమిటని కేంద్రాన్ని నిలదీశారు. ప్రశ్నపత్రాల లీక్‌తో పిల్లల జీవితాలతో ఆడుకుంటున్నారని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీక్ ఘటనలకు కారణమైన మాఫియాను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పేపర్ల లీక్‌ల వల్ల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ల లీక్‌లతో వేల మంది విద్యార్థుల ఆత్మస్థైర్యం దెబ్బతిందని ప్రియాంక గాంధీ ఆందోళన చెందారు. 152 సార్లు పేపర్ లీక్స్ జరిగాయని.. అయినా ఒక్కరిపైనా కూడా చర్యల్లేవని కాంగ్రెస్ ఎంపీ పెదవి విరిచారు. ప్రతి ఏటా బడ్జెట్‌లో విద్యాశాఖ కేటాయింపులను తగ్గిస్తున్నారని విమర్శించారు. పదవికి రాజీనామా చేసిన మంత్రికి ఘనస్వాగతం పలకడం.. సిగ్గుపడేలా ఉందని అన్నారు. దేశంలో యువత ఏం కోరుకుంటోందో అర్థం కావట్లేదని ప్రధాని మోదీకి ప్రియాంక గాంధీ చురకలంటిం చారు. మహిళలను అవమానించిన ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ కేటాయించారని ఆరోపించారు. దేశంలో పరీక్షా విధానం ఘోరంగా విఫలమైందని అన్నారు. మార్చుకో వాల్సింది కెమెరా యాంగిల్స్ కాదంటూ మోదీకి సూచించారు. తన మనసులోని యాంగిల్స్‌ను మార్చుకోవాలని మోదీకి స్పష్టం చేశారు. తన సలహాదారులను మార్చుకోవాలని ప్రధాని మోదీకి కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ హితవు పలికారు.

**మోదీకి ఇన్‌స్టా రీల్స్‌పై ఉన్న శ్రద్ధ సమస్యలపై లేదు :గౌరవ్ గొగోయ్**



లోక్‌సభలో యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై జరుగుతోన్న చర్చలో కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడారు. పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటం చేస్తుంటే.. మోదీ మాత్రం రీల్స్ చేస్తూ కూర్చున్నారని విమర్శించారు. సమస్యపై కాకుండా ఇన్‌స్టాగ్రామ్‌పైనే ఆయన ఎక్కువ దృష్టి పెట్టారన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టేందుకు ప్రభుత్వం 2024లో ప్రవేశపెట్టిన చట్టం కఠినంగా ఉంటే.. పేపర్‌లీక్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. లీకేజీ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ బిల్లుకు ప్రతిపాదించిన సవరణలను పరిశీలిస్తే.. అర్థవంతమైన మార్పును తీసుకురావాలని ప్రభుత్వం అనుకోవట్లేదని తెలుస్తోందన్నారు. ఈ పరీక్షా సంస్కరణలు కేవలం కంటితుడుపు చర్యలే అని.. గతంలో కూడా ప్రభుత్వం ఇలాంటి హామీలే ఇచ్చిందని పేర్కొన్నారు. 2024 నీట్ ప్రశ్నపత్రం లీకేజీని ప్రస్తావిస్తూ.. ఆ లీకేజీ జరిగినప్పుడు ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా ఉన్నారని గొగోయ్ గుర్తు చేశారు. అప్పుడు కూడా ఎలాంటి లీకేజీ జరగలేదని కప్పిపుచ్చడానికి ఆయన ప్రయత్నించారని దుయ్యబట్టారు. సోమవారం భాజపా నేతలు ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టారు. తప్పును ఎదిరించి.. పోరాట స్ఫూర్తిని చాటిన విద్యార్థులకు గొగోయ్ ధన్యవాదాలు తెలిపారు. నిరసనకారులపై ప్రభుత్వం అమానవీయంగా ప్రవర్తించిందని విమర్శించారు. నిరసనకారుల తలలపై పోలీసులు కొట్టారని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. అలా కొట్టాలని వారిని ఎవరు ఆదేశించారని ప్రశ్నించారు.

**ప్రధాన్‌ను తొలగించి..**
**మోదీని కాపాడారు: అఖిలేశ్ యాదవ్**

ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి దించి.. ప్రధాని మోదీని భాజపా కాపాడిందని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, ఎంపీ అఖిలేశ్ యాదవ్ అన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించేలా ఒత్తిడి తెచ్చిన యువత నిరసనలను ప్రశంసించారు. దేవాలయాల విరాళాలను దొంగిలించిన వారు.. ప్రశ్నపత్రాల లీకేజీని ఆపలేరన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని వెనకబడిన వర్గాల విద్యా హక్కులను దోచుకుంటోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారు దేశంలోని లక్షకు పైగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని ఆరోపించారు. కాగా ప్రతిపక్ష నేతల ప్రశ్నలను భాజపా ఎంపీ బన్సూరీ స్వరాజ్ తిప్పికొట్టారు. యూపీఏ హయాంలో 2014కు ముందు ఏకంగా 22 సార్లు ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని అన్నారు. ఇప్పుడు ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేతలు.. అప్పుడు రాజీనామా చేశారా? అని ప్రశ్నించారు.

## లీకులకు పాల్పడితే పదేళ్ల జైలు.. రూ. పది కోట్ల జరిమానా

పేపర్ లీకులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనూ ఆర్ఆర్‌బీ పేపర్ లీక్ అయ్యిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నోసార్లు పరీక్షా పత్రాలు లీకయ్యాయని మండిపడ్డారు. అయితే పరీక్షల నిర్వహణలో సంస్కరణలను కాంగ్రెస్ వ్యతిరేకించిందని తెలిపారు. 2010లో ఎన్‌టిఏ ఏర్పాటు విజ్ఞప్తిని కాంగ్రెస్ పట్టించుకోలేదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నీట్ పరీక్షా పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలు తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ల లీకులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. అందుకోసం 2024 నాటి ప్రవేశ పరీక్షల చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో విద్యార్థులు, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి పేపర్ లీక్ నిరోధక బిల్లు నిదర్శనమని జితేంద్రసింగ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇవి క్రమంగా వ్యవస్థాగత నేరాలుగా మారాయని, వీటిని అరికట్టేందుకే చట్టంలో మార్పులు చేస్తున్నామని సభకు వివరించారు. 2009, 2011లో ఎన్నో పేపర్‌లు లీకయ్యాయి. 2012లో ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యింది. యూపీ, తమిళనాడుల్లోనూ ఈ ఘటనలు చోటుచేసు కున్నాయి. ఎన్నో ప్రవేశ, ఉద్యోగ నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లోనూ ప్రయత్నాలు జరిగాయి. అయితే, అవి ఎందుకు పూర్తి కాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి. క్రమంగా ఇవి వ్యవస్థాగత నేరాలుగా మారాయి. ఇటీవల నీట్ పేపర్ లీక్ విషయం తెలియగానే ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇటువంటి నేరాలను అరికట్టేందుకు ప్రస్తుతం తీసుకొచ్చిన బిల్లు ఎంతో ఉపయోగకరం. నిందితులను కఠినంగా శిక్షించేందుకు బిల్లులో నిబంధనలు రూపొందించాం. దోషులకు శిక్షలను పదేళ్లకు పెంచాం. లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచాం. కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశాం అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.



## ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు అని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అలాంటి వ్యక్తికి విద్యాశాఖ మంత్రి బాధ్యతలు కట్టబెట్టడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను ప్రహ్లాద్ జోషి వెనకేసుకొచ్చారని రాహుల్ తెలిపారు. అత్యాచార దోషులను సమర్థించే వ్యక్తి విద్యా శాఖ మంత్రిగా ఉండేందుకు ఎంత మాత్రం అర్హుడు కాదన్నారు. ఇదిలా ఉండగా, పేపర్ లీక్, ఇతర అక్రమాలకు వ్యతిరేకంగా పరీక్షా విధానంలో తీసుకొచ్చిన కఠినమైన చట్టాలపై కాంగ్రెస్? ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళల హక్కులు, మహిళా రిజర్వేషన్లు, మహిళా సాధికారత గురించి మాట్లాడుతుంటే, మరోవైపు ఇలాంటి వారిని మంత్రిని చేయడం సమాజంలో మహిళల భద్రతకు చాలా తప్పుడు సంకేతాలను పంపుతుందని ఆమె ఆరోపించారు. అయితే, లోక్?సభలో ప్రియాంక చేసిన వ్యాఖ్యలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ప్రహ్లాద్ జోషికి సంబంధించిన వీడియో తమ వద్ద ఉందని, తాను మాట్లాడిన ప్రతి మాటకూ కచ్చితమైన ఆధారాలు సమర్పిస్తానని ప్రియాంక స్పష్టం చేశారు.

## రాజకీయ నైతికతకు ప్రతీక జైపాల్ రెడ్డి: సీఎం

న్యూఢిల్లీ,జూలై28(జనంసాక్షి): రాజకీయాల్లో నైతికతకు ప్రతీక కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి అనిముఖ్య మంత్రిరేవంత్ రెడ్డి కొనియాడారు. కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డివర్ధంతిని పురస్కరించుకొని సీఎం రేవంత్ రెడ్డి ఆయనచిత్రపటానికిపూలమాల వేసి నివాళు లర్పించారు. విద్యార్థి నాయకునిగాప్రస్థానం ప్రారంభించిన జైపాల్ రెడ్డి తన తుది శ్వాస వరకువిలువలు, సిద్దాంతాలకు కట్టుబడి ఉన్నారని సీఎం పేర్కొన్నారు. తనవిషయపరిజ్ఞానం, వాగ్దాటితో అటు ప్రజలు, ఇటు పార్లమెంట్‌లోతనదైన ముద్ర వేసిన ఘనత జైపాల్ రెడ్డిదని సీఎం తెలిపారు.

## తెలంగాణ పెండింగ్ రైల్వేప్రాజెక్టులను త్వరగా పూర్తిచేయండి

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావు, పార్టీ సీనియర్ నేత జాన్సన్ నాయక్ తదితరులు కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రం అందజేశారు.అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్... తమకు రాజకీయాల కంటే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని, అందుకే రాష్ట్ర ప్రజల తరపున రైల్వే, ఐటీ రంగాలకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.కాజీపేటను కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని ప్రధానంగా విజ్ఞప్తి చేసినట్లు కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం సౌత్ సెంట్రల్ రైల్వే పునర్విభజన ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. ప్రతిపాదిత కాజీపేట డివిజన్‌లో కాజీపేట?బల్లార్షా, పెద్దపల్లి-నిజామాబాద్, కాజీపేట-ఎర్రుపాలెం, డోర్నకల్-మణుగూరు, మోతమర్రి-విష్ణుపురం, కాజీపేట-వంగపల్లి రైల్వే సెక్షన్లను చేర్చాలని సూచించినట్లు చెప్పారు. ఈ డివిజన్ పరిధి సుమారు 2,000 ట్రాక్ కిలోమీటర్ల వరకు ఉంటుందని వివరించారు.రైల్వే ఉద్యోగులు కూడా కాజీపేట డివిజన్ ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని కేటీఆర్ తెలిపారు. కేవలం 900 కిలోమీటర్లతో గుంటూరు డివిజన్, సుమారు 2,200 కిలోమీటర్లతో విజయవాడ, గుంతకల్ డివిజన్లు కొనసాగుతున్న నేపథ్యంలో కాజీపేట కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేయడం పరిపాలనా పరంగా, అభివృద్ధి పరంగా ఎంతో ప్రయోజనకరమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.మనోహరాబాద్ సిద్దిపేట సిరిసిల్ల-వేములవాడ-కొత్తపల్లి రైల్వే లైన్‌ను మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలిసిరిసిల్ల నియోజకవర్గానికి అత్యంత కీలకమైన 151 కిలోమీటర్ల మనోహరాబాద్-సిద్దిపేట-సిరిసిల్ల- వేములవాడ-కొత్తపల్లి న్యూ బ్రాడ్ గేజ్ రైల్వే ప్రాజెక్టును అత్యవసరంగా పూర్తి చేయాలని కోరినట్లు కేటీఆర్ తెలిపారు.కేసీఆర్ కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందని, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిలిచిపోయిందని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కిందన్నారు.ఉచిత భూసేకరణ, రైట్ ఆఫ్ వే కల్పించడం, నిర్మాణ వ్యయంలో మూడో వంతు రాష్ట్ర ప్రభుత్వం భరించేలా ప్రత్యేక ఒప్పందం చేసుకోవడం వంటి చర్యలతో బీఆర్ఎస్ ప్రభుత్వం పనులను వేగవంతం చేసిందన్నారు. దాని ఫలితంగా మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు 76 కిలోమీటర్ల రైల్వే లైన్ పూర్తై, 2023 అక్టోబర్ 3న ప్రారంభమైందని తెలిపారు.అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిద్దిపేట?సిరిసిల్ల?వేములవాడ?కొత్తపల్లి మధ్య మిగిలిన 75 కిలోమీటర్ల పనులు పూర్తిగా మందగించాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతలను నిర్వర్తించకపోవడమే ఇందుకు కారణమన్నారు.తెలంగాణ ప్రభుత్వం విడుదల చేయాల్సిన సుమారు రూ.416 కోట్లతో పాటు మరో రూ.511 కోట్ల నిధులు విడుదల చేయకపోవడం, ఇంకా 96 హెక్టార్ల భూసేకరణ పూర్తి చేయకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయని, ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో రాజ్యసభకు అధికారికంగా తెలిపిందని కేటీఆర్ అన్నారు.ప్రాజెక్టు ఆలస్యం కారణంగా మొదట రూ.1,160 కోట్లుగా ఉన్న అంచనా వ్యయం ప్రస్తుతం రూ.2,780 కోట్లకు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.సిరిసిల్ల టెక్స్‌టైల్ పరిశ్రమకు, దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ఈ రైల్వే లైన్ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు దర్శనానికి వస్తున్న నేపథ్యంలో ఈ రైల్వే లైన్ పూర్తయితే తెలంగాణకు భారీ ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.సిరిసిల్ల, వేములవాడ రైల్వే స్టేషన్లను 'అమృత్ భారత్ స్టేషన్' పథకంలో చేర్చి ఆధునీకీకరించాలని, మిడ్ మానేరు రిజర్వాయర్‌పై రైల్వే కమ్ రోడ్ బ్రిడ్జికి ఆమోదం తెలపాలని, కొత్తపల్లి?మనోహరాబాద్ రైల్వే లైన్ మొత్తాన్ని విద్యుదీకరించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు.అదేవిధంగా సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు, తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులతో కలిసి ప్రత్యేక హై-లెవల్ కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టును నిరంతరం సమీక్షించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించి కేంద్రం ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ప్రకటించిన 'పీఎం గతి శక్తి' లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును మిషన్ మోడ్‌లో పూర్తి చేయాలని కోరినట్లు చెప్పారు.తెలంగాణ వద్ద ఇప్పటికే అవసరమైన మౌలిక సదుపాయాలు, విధానాలు సిద్ధంగా ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే తెలంగాణ టియర్-2 నగరాలు మరోసారి ఉపాధి, ఆవిష్కరణల కేంద్రాలుగా ఎదగడమే కాకుండా దేశవ్యాప్తంగా సమతుల్య డిజిటల్ అభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తాయని కేటీఆర్ పేర్కొన్నారు.

## అధికారంలోకి వచ్చాక హైడ్రాను బంగాళాఖాతంలో విసిరేస్తాం

తలల విష సర్పమని హైకోర్టు చెప్పింది. సీఎం చేతిలో హైడ్రా బ్లాక్ మెయిలింగ్ సాధనంగా మారింది. మంత్రులు పొంగులేటి, వివేక్‌తో పాటు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఇళ్లు ఎందుకు కూల్చట్లేదు?బడా బాబులను వదిలి పేదల ఇళ్ల జోలికే ఎందుకు వెళ్తున్నారు? ఒక్క ఇల్లు కట్టకపోయినా.. వేల ఇళ్లు కూల్చివేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక హైకోర్టు సూచనలతో హైడ్రాను రద్దు చేసి బంగాళాఖాతంలో విసిరేస్తాం" అని వ్యాఖ్యా నించారు.

# భవిష్యత్‌లోనూ హైడ్రా కొనసాగుతుంది

సంస్కరణగా సీఎం అభివర్ణించారు. హైడ్రాకు ఉన్నతాధికారిగా ఎవరిని నియమించాలనే విచక్షణ తమ ప్రభుత్వానికి ఉందని కుండబద్దలు కొట్టారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్‌పైన 400 పైగా కోర్టు ధిక్కరణ కేసులున్నాయని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దురుద్దేశంతోనే కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించారంటూ బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. కోర్టు తీర్పుని పరిశీలించి.. ఆ తర్వాత తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. హైడ్రా కార్యాచరణ పైన తమకు పూర్తి స్పష్టత ఉందని అన్నారు. కబ్జాకోరులకు సహకరించొద్దంటూ మీడియాకు సూచించారు. డబ్బులు పెట్టి సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతుకుంట భూముల కేసు విచారణ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని అభిప్రాయపడింది. ఆయన్ని తొలగించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ పైవిధంగా స్పందించారు.ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై సమీక్షిస్తామని చెప్పారు. కబ్జాకోరులు ఫేక్ పత్రాలతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. చెరువులు, కుంటలు, నాలాలను కాపాడటమే హైడ్రా సిబ్బంది విధి. బతుకమ్మకుంటను కబ్జా చేస్తే రక్షించారు.. దానిపై కోర్టుకెళ్లారు. బతుకమ్మకుంటలో బీఆర్ఎస్ నేత 10 ఎకరాలు కబ్జా చేశాడు. కేసీఆర్ పర్యటన సందర్భంగా ఆ నేత పూల వర్షం కురిపించాడు. కబ్జాదారులను కాపాడేందుకు డబ్బు ఖర్చు చేసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత ఉంది. ఒక అధికారిని ఎక్కడ నియమించాలనే విచక్షణాధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## గ్లోబరీనా అక్రమాలు సీబీఎస్ఈకీ విస్తరించాయి

న్యూఢిల్లీ,జూలై28(జనంసాక్షి): ప్రశ్నపత్రాలలీకేజీలకు కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి .రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించినప్పుడు పెద్దగా సమస్యలు లేవని, ఆఫ్‌లైన్‌లో నిర్వహించినప్పుడే సమస్యలు వస్తున్నాయన్నారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండానే దేశంలో కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అవి ప్రశ్నాపత్రాలు లీక్ అవ్వడానికి వేదికలుగా మారుతు న్నాయని సీఎం విమర్శించారు. ఈ విషయంలోజాతీయస్థాయిలో ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరమున్నదని సీఎం అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీల మీద ఆధిపత్యం చెలాయించాలనే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీఎం సూచించారు. విద్యను వీలైనంతవరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని, ఈ అంశంపై పార్లమెంట్ చర్చ జరగాల్సి ఉందన్నారు. సభలో చర్చ జరిగితే రాహుల్ గాంధీ అన్ని అంశాలపైమాట్లాడతారని సీఎం తెలిపారు. ప్రశ్నాపత్రాలలీకేజీల నివారణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాన్ని చూసి తర్వాత రాష్ట్రంలో ఏం చేయాలనేదిచూస్తామని సీఎం ఒక ప్రశ్నకుబదులిచ్చారు. యూపీఎస్సీ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతోనే తాము పారదర్శకంగా పరీక్షలను నిర్వహించామని సీఎం తెలిపారు. విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా, వారికి నమ్మకం, విశ్వాసం కలిగించేలా పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. గ్లోబరీనావటి సంస్థలు నాడు అక్రమాలకు పాల్పడినా గత ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో వాళ్లు సీబీఎస్ఈ పరీక్షలవరకు విస్తరించి, వాటిని గందరగోళంచేశారని సీఎం విమర్శించారు. ఇలాంటి సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి పనులవిషయంలో సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలోపరిస్థితుల పరి శీలనకు క్షేత్రస్థాయి పర్యటనకు రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించినట్లు సీఎం తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ కు సంబంధించి కేసీఆర్ ప్రభుత్వం రూ.8వేల కోట్లను బకాయిలను పెట్టి పోయిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఎలాంటి వసతులు లేకుండా, దొంగ లెక్కలు చూపించి ఫీజు రీయింబర్స్‌మెంట్ కొట్టేయాలనుకునే సంస్థలమీద విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని సీఎం తెలిపారు. సక్రమంగా ఉన్న వాళ్లకు బకాయిలుచెల్లిస్తామని ఓ ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. కేసీఆర్ పెట్టిన బకాయిలే తమకు భారంగా మారాయన్నారు. తాము ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నట్లుగా, మా ప్రభుత్వం కారణమన్నట్లుగా బీఆర్ఎస్ భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తోందని, దానికి బీజేపీవంతపాడుతోందని సీఎం మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు బకాయిలపై బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఎందుకు మాట్లాడడం లేదని సీఎం ప్రశ్నించారు. కూటమిప్రభుత్వం ఉన్న ఏపీలో 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయించిన తర్వాత తెలంగాణలో డిమాండ్ చేస్తే బాగుంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్యలకు సూచిస్తున్ ట్లు సీఎం తెలిపారు. గత ప్రభుత్వం బకాయిలే తమకు భారంగా మారాయని, అయినా అన్ని సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని సీఎం అన్నారు. భవిష్యత్తులో ఏ సంవత్సరానికి సంబంధించిన ఫీజుల మొత్తం అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లిస్తామని, అడ్వాన్స్‌డ్‌గా బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 నుంచి రూ.2,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమవుతాయని సీఎం అన్నారు. క్రమంతప్పకుండా వాటిని చెల్లించేందుకు తమప్రభుత్వం ప్రణాళికలు రచించుకుందని, భవిష్యత్తులో ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య రాష్ట్రంలో ఉండదని సీఎం స్పష్టం చేశారు.

## తెలంగాణకు 11.56 లక్షల ఇండ్లు కేటాయించండి



గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు సీఎం తెలిపారు. సాధ్యమైనంత త్వరగా తెలంగాణకు ఇళ్లు కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు.ఎల్‌నినో నేపథ్యంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ)లో (వీబీ జీ రామ్ జీ) అదనపు పనులు చేర్చాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వర్షాభావంతో పనులు లేనందున ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీలకు జీవనోపాధులు మెరుగుపర్చేందుకు, పంటల వైవిధ్యీకరణ ప్రోత్సాహానికి అదనపు పనులను చట్టంలో చేర్చాలని సీఎం కోరారు.రైతులు తమ భూముల్లో కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల అభివృద్ధి, మల్బరీ తోటల సాగు, పట్టు పురుగుల పెంపకం షెడ్లు, ఇళ్ల సమీపంలో ఆకు కూరలు, కూరగాయల తోటలు, వెదురు వనాలు పెంచుకునే పనులను వీబీ జీ రామ్ జీలో చేర్చాలని కేంద్ర మంత్రి చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కొండ ప్రాంతాలతో పాటు కొండ వాలుల్లో నీటి నిల్వ చేసుకునే కందకాలు, ఇప్పటికే ఉన్న ప్లాంటేషన్లు, పండ్ల తోటల్లో తేమ రక్షణకు కందకాల నిర్మాణం, వరదలు, ఇసుక మేటలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణకు అవసరమైన పనులు వీబీ జీ రామ్ జీలో చేపట్టాలని కేంద్ర మంత్రిని కోరారు. ఉపాధి హామీ పథకం కింద ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ సమయంలో 90 రోజుల వరకు పనులు చేసే అవకాశం ఉండేదని సీఎం తెలిపారు.

## తాడిచర్లలో పాము కాటుతో విద్యార్థి మృతి



మల్హార్, జూలై 28 (జనంసాక్షి) : మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. పాము కాటుతో ఎండి రిజ్వాన్ (15) అనే విద్యార్థి మృతి చెందాడు. గ్రామస్థులు, బంధువుల కథనం ప్రకారం.. రిజ్వాన్ తండ్రి అనారోగ్యానికి గురికావడంతో భూపాలపల్లిలోని 100 పడకల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరూ ఆసుపత్రిలోనే ఉండటంతో, రిజ్వాన్ రాత్రి ఇంటి వద్ద ఒంటరిగా నిద్రించాడు.అయితే తెల్లవారుజామున ఏదో గుర్తు తెలియని కీటకం కాటు వేసినట్లు అనిపించడంతో, ఆ బాలుడు భూపాలపల్లి ఆసుపత్రిలో ఉన్న తన తల్లికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే గ్రామంలోని తమ సమీప బంధువులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. బంధువులు ఇంటికి వెళ్లి చూసే సరికే బాలుడి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా మారింది. దీంతో రిజ్వాన్‌ను తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, బాలుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి 100 పడకల ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిక్షించి మృతి చెందినట్లు తెలిపారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియలిసి ఉంది.రిజ్వాన్ స్థానిక జెడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు రిజ్వాన్ మృతి తో కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతం అయ్యారు.

## ఈరవెన్నులో కత్తి పోట్ల కలకలం

- భయంధోళనలో పాలకుర్తి మండలం
- విచారణ చేపట్టిన పోలీసులు



పాలకుర్తి, జూలై 28(జనంసాక్షి) : కత్తులతో పరస్పరం దాడులు చేసుకోవడంతో ఆరుగురికి తీవ్ర గాయాలైన సంఘటన జనగామ జిల్లా, పాలకుర్తి మండలంలోని ఈరవెన్ను గ్రామంలో సోమవారం అర్థరాత్రి జరిగింది. స్థానిక ఎస్సై దూలం పవన్ కుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈరవెన్ను గ్రామానికి చెందిన కొడిశాల అజయ్ (26) అనే వ్యక్తి గ్రామానికి చెందిన ఓ వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. గతంలో పలు మార్లు ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో సదరు మహిళ భర్తతో పాటు గ్రామానికి చెం దిన గాదరి హరికృష్ణ, మాచర్ల క్రాంతి. జఫర్గడ్ మండలంలోని తిమ్మంపేటకు గ్రామానికి చెందిన పులి వర్ధన్. చందూ, వరుణ్, లింగాలఘన్పూర్ మండలంలోని నెల్లుట్ల గ్రామానికి చెందిన ఆనంద్ తో కలిసి సోమవారం అర్థరాత్రి కొడిశాల అజయ్ ఇంటికి వెళ్లారు. దీంతో అజయ్ మాట్లాడు తుండగా ఒకరు అజయ్ పై కత్తితో దాడి చేయగా, అదే కత్తిని గుంజుకొని అజయ్ ఆరుగురిపై కత్తితో దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. దాడిలో పులి వర్ధన్, చందూలకు తీవ్రగాయాలు కాగా, గాదరి హరికృష్ణ, మాచెర్ల కాంత్రి, వరుణ్, ఆనంద్ లకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన క్షతగాత్రులను వెంటనే హన్మకొండలోని ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. నిందితుడు ఆజయ్ ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు గాదరి హరికృష్ణ తండ్రి గాదరి సోమయ్య ఫిర్యాదు మేరకు అజయ్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. అజయ్ ఫిర్యాదు మేరకు అరుగురిపై పరస్పరం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అర్థరాత్రి జరిగిన కత్తుల కలకలంతో పాలకుర్తి, ఈరవెన్ను ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మండలంలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## బాలికతో అసభ్య ప్రవర్తన కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష

సంగారెడ్డి బ్యూరో, జూలై 28(జనం సాక్షి): మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి సంగారెడ్డి ప్రత్యేక పోక్సో (ఫాస్ట్ ట్రాక్ స్పెషల్) కోర్టు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. నిందితుడికి రూ.1,000 జరిమానా కూడా విధించగా, జరిమానా చెల్లించని పక్షంలో మరో నెల సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి ఆర్. శ్రీలేఖ తీర్పు వెలువరించారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో 2021లో నమోదైన క్రైం నెం.104/2021 కేసులో నిందితుడు వడ్డె వీరమల్లయ్యపై ఐపీసీ సెక్షన్లు 376, 511తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్లు 7, 8 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించి ఆమె గౌరవాన్ని అవమానించాలనే ఉద్దేశంతో దాడి చేసినట్లు ఐపీసీ సెక్షన్ 354 కింద నేరం రుజువవడంతో కోర్టు శిక్ష విధించింది. ఈ కేసులో సమర్థవంతంగా వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. సురేడ్డి, బాధితురాలికి న్యాయ సహాయం అందించిన భరోసా లీగల్ కౌన్సిలర్ ఎస్. అపర్ణ, భరోసా బృందం, కేసును దర్యాప్తు చేసిన అప్పటి ఎస్సై ప్రసాద్‌రావు, ప్రస్తుతం పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ ఎం. రవీందర్, కోర్టు డ్యూటీ అధికారి టి. ప్రసన్న లక్ష్మి, ప్రత్యేక పోక్సో కోర్టు లైజనింగ్ అధికారి హెడ్ కానిస్టేబుల్ బి. శంకర్, జిల్లా లైజనింగ్ అధికారి కె. సత్యనారాయణ తదితరులను అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రజావాణిని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, జూలై28 (జనంసాక్షి) : ప్రజా సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ప్రజావాణికి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, 2ఃఱఐ గృహాలు, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమం తదితర వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించి, అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల వినతులను కూడా మంత్రి పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి ప్రతిరోజూ అందుతున్న వినతులు, వాటి పరిష్కార స్థితి, శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి మాట్లాడి ప్రజావాణి నిర్వహణ, సమస్యల పరిష్కార ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి వినతికి పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ముడుమాల్ నిలువురాళ్ల పార్కు అభివృద్ధి

- శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి



నారాయణపేట, జూలై28 (జనంసాక్షి) : చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని స్పష్టం చేశారు రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని ముడుమాల్ గ్రామంలో ఉన్న చారిత్రక నిలువురాళ్ల పార్కు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ... చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నిలువురాళ్ల పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ముడుమాల్ నిలువురాళ్ల పార్కుకు మరింత గుర్తింపు లభించడంతో పాటు పర్యాటకుల సంఖ్య పెరిగి స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు . ఈ సందర్భంగా దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ మాట్లాడుతూ... ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణం అని,యూనెస్కో శాశ్వత గుర్తింపు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది వరకు ఇక్కడ ఉన్న కలెక్టర్లు నిలువు రాళ్ళ పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. యునెస్కో శాశ్వత గుర్తింపు కొరకు కొన్ని సూచనలు ఇచ్చారని వాటిని పాటించి గుర్తింపు పొందేలా కృషి చేయాలన్నారు. ఇదివరకే మంత్రి వాకిటి శ్రీహరి గారి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఇందుకు తగిన వసతులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని 400 పాఠశాలల హెడ్మాస్టర్లకు శిక్షణ ఇచ్చి దాదాపు 60 వేల మంది విద్యార్థులు మూడుమాల్ నిలువు రాళ్ళను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే 20 మంది టూరిస్ట్ గైడ్లను ఏర్పాటు చేసి చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఇందుకు తగిన మ్యాప్ తయారు చేయాలన్నారు. ప్రజలు భాగస్వాములై ఇక్కడి విశిష్టతను ప్రపంచానికి తెలియజేసేలా అవగాహన కల్పించుకోవాలన్నారు. శాస్త్ర విజ్ఞానం రాకముందే 3 వేల సంవత్సరాల క్రితం నిలువురాళ్ల రూపంలో నక్షత్ర మండలాన్ని ఆనాడే రూపొందించారని తెలిపారు. మనకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో విశిష్టతను చాటేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

# తెలంగాణను దోచుకున్న ఇద్దరూ ఢిల్లీలో మకాం

- రేవంత్, కెటిఆర్‌లపై నిజామాబాద్ ఎంపీ అర్వింద్ సెటైర్లు



న్యూఢిల్లీ, జూలై28 (జనంసాక్షి) : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీ పర్యటనపై నిజామాబాద్ బిజెపి ఎంపీ ధర్మపురి అరవింద్ స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణను దోచుకున్న ఇద్దరూ ఈరోజు ఢిల్లీలో ఉన్నారంటూ వ్యాఖ్యానించారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడంలో విజయవంతమయ్యారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడంలో విఫలమవడం వల్ల, తెలంగాణలో ప్రతి సంవత్సరం దాదాపు 20 లక్షల మంది విద్యార్థులు తమ విద్యా భవిష్యత్తుపై అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెరుగుతున్న ఆర్థిక భారం కారణంగా వందలాది కళాశాలలు కూడా మూసివేతకి సిద్ధంగా ఉన్నాయని ఎంపీ అన్నారు. కాంగ్రెస్‌కు ముందు, బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. అవినీతిలో కూరుకుపోయిన కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి రుణభార ప్రాజెక్టులలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని కుమ్మరించిందని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా కే-కుటుంబం అపారమైన సంపదను కూడబెట్టిందని ఆరోపించారు. ఇప్పుడు జెన్ జెడ్‌కు మద్దతుగా రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ మొసలి కన్నీళ్లు కార్చుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో అత్యధిక నిరుద్యోగ రేటు ఉన్న రెండు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని ఎంపీ అన్నారు. దాదాపు 13 ఏళ్లుగా ఉద్యోగాల క్యాలెండర్‌ను నిలిపివేసినందుకు రేవంత్ రెడ్డి, కేటీఆర్‌కు అవార్డులు ఇవ్వాలంటూ సెటైర్ విసిరారు. తెలంగాణకు ఇప్పుడు ఆర్థిక క్రమశిక్షణ, స్వచ్ఛమైన పాలన ఉన్న ప్రభుత్వం కావాలన్నారు. అందుకే తెలంగాణ.. బీజేపీకి సిద్ధంగా ఉందని గట్టిగా నమ్ముతున్నట్లు ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.

## ఉర్దూ అకాడమీ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం తగదు

- మైనారిటీ శాఖ జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.20ను తక్షణమే రద్దు చేయాలి
- రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా డిమాండ్
- ముఖ్యమంత్రి, మైనారిటీ శాఖ మంత్రి, ప్రధాన కార్యదర్శికి లేఖలు



హైదరాబాద్: తెలంగాణ ఉర్దూ అకాడమీకి చెందిన కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థకు 30 సంవత్సరాలపాటు లీజుకు అప్పగించేందుకు మైనారిటీ సంక్షేమ శాఖ జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.20ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ మహమ్మద్ యాకూబ్ పాషా డిమాండ్ చేశారు.రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం దర్గా హుస్సేన్ షా వలీ గ్రామంలోని సర్వే నెం.29లో ఉన్న 1.04 ఎకరాల (5,220 చదరపు గజాలు) తెలంగాణ ఉర్దూ అకాడమీ భూమిని హైదరాబాద్‌కు చెందిన ఎన్.ఎన్. ఇన్‌ఫ్రా అండ్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు 30 సంవత్సరాల లీజుకు అప్పగించేందుకు మైనారిటీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు.ఈ భూమిలో ఉర్దూ ఘర్, షాదీఖానా, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నప్పటికీ, కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం వార్షిక లీజు రుసుము రూ.5,220కే ప్రైవేట్ సంస్థకు కేటాయించడం పలు అనుమానాలకు తావిస్తోందని యాకూబ్ పాషా పేర్కొన్నారు. ప్రజా ప్రకటన జారీ చేయకుండా, పోటీ టెండర్లు లేదా బిడ్లను ఆహ్వానించకుండా లీజు మంజూరు చేయడం పారదర్శకతకు విరుద్ధమని ఆరోపించారు.తెలంగాణ ఉర్దూ అకాడమీ విద్య, సాంస్కృతిక రంగం, ఉర్దూ భాష, సాహిత్య అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సంస్థ అని, అలాంటి సంస్థ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు దీర్ఘకాలిక లీజుకు ఇవ్వడం అకాడమీ అసలు లక్ష్యాలకు, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన అన్నారు.అందువల్ల జీఓ ఎంఎస్ నెం.20ను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి, ఉర్దూ అకాడమీ ఆస్తులను పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని యాకూబ్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖలు పంపినట్లు తెలిపారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి జీఓను ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని జీఓను వెంటనే రద్దు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## ప్రభుత్వ భూమిని కాపాడిన రెవెన్యూ అధికారులు

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 28 (జనం సాక్షి) : చిల్పూర్ గ్రామంలోని సర్వే నంబర్ 229లో 36 ఎకరాల పైన సీలింగ్ భూములు(ప్రభుత్వభూము లు) ఉన్నాయని, గత రెవెన్యూ అధికారుల నిర్ల క్ష్యం వల్ల మూడు ఎకరాల 12 గుంటల ప్రభుత్వ భూమిని భూమి కన్స్ట్రక్షన్స్ రెడ్ మిక్స్ ప్లాంట్ 2019 నుంచి ఈ ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకుని ప్లాంట్ ను నిర్వహిస్తున్నారని మూడున్నర కోట్ల పైనే విలువ గల భూమిని రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని కాపాడి నారు.ఈ భూమి ప్రభుత్వ భూమి అని నిర్ధారించు కున్న తర్వాత ప్రస్తుత జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు, ఈ భూమిని ఈ నెల 20వ తేదీన ప్రభుత్వానికి స్వాధీనం చేసుకో మని ఉత్తర్వులు జారీ చేశారని తాహసిల్దార్ విజయ్ కుమార్ తెలిపారు ఈ భూమి తరిగొప్పు ల, చిన్న పెండ్యాల ప్రధాన రహదారిపై ఉన్నందున మార్కెట్ విలువ రూ. మూడున్నర కోట్లపైనే ఉంద ని ఈ విషయంపై చిల్పూర్ మండల ప్రజలందరూ కూడా హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

న్యూఢిల్లీ, జూలై28 (జనంసాక్షి) : అంతర్జాతీయ, భౌగోళిక, రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. మంగళవారం పసిడి ధరలు భారీ తగ్గుదల నమోదు చేశాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,44,170గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ.1690 మేర తగ్గింది.. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,32,150గా ఉంది.

# లండన్‌లో అట్టహాసంగా 'టాక్ బోనాల జాతర' వేడుకలు

- ప్రత్యేక ఆకర్షణగా లండన్ వీధుల్లో తొట్టెల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు





లండన్ (జనంసాక్షి) : తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్డమ్ (టాక్) ఆధ్వర్యంలో లండన్లో బోనాల జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు యుకే నలుమూలల నుండి సుమారు 2500 కి పైగా ప్రవాస కుటుంబ సభ్యులు హాజరయ్యారు. టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, ఉపాధ్యక్షులు శ్రీమతి శుష్మణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుప్రజ పులుసు నాయకత్వంలో ప్రారంభమైన వేడుకలకు, వ్యాఖ్యాతలుగా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ జెల్లా, కమ్యూనిటీ అఫైర్స్ ఛైర్పర్సన్ గణేష్ కుప్పాల వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా ఎంపీ సీమా మల్హోత్రా, భారత హై కమీషన్ ప్రతినిధి వివేక్ కుమార్, మాజీ ఎంపీ వీరేంద్ర శర్మ, హౌన్స్లో నగర మేయర్ రంజిత్ గిల్, ఇతర అతిదులు పాల్గొన్నారు. టాక్ కన్వీనర్లు అశోక్ గౌడ్ దూసరి, నవీన్ రెడ్డి మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రవాస తెలంగాణ సంఘాలు ఏర్పడి తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తం అయ్యేలా కృషి జరుగుతుందంటే దానికి కారణం మన ప్రత్యేక రాష్ట్రం మనకు ఏర్పాటు అవడమేనని, కాబట్టి అన్ని సందర్భాల్లో రాష్ట్ర ఏర్పాటు కొరకై ముందుండి నాయకత్వం వహించిన ఉద్యమశిఖరం రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి శ్రీ. కెసిఆర్ గారిని మనం అన్ని సందర్భాల్లో గుర్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే బోనాలు శుభాకాంక్షలు తెలిపి, టాక్ సంస్థ చేస్తున్న కార్యక్రమాలు గొప్పగా ఉన్నాయని కార్యవర్గాన్ని అభినందించారు. మన రాష్ట్ర పండగని మరింత వైభవంగా తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టాక్ సంస్థ అద్యక్షులు రత్నాకర్ కడుదుల మాట్లాడుతూ ప్రవాస తెలంగాణ ప్రజలందిరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. టాక్ సంస్థ ,తెలంగాణా ప్రజల కోసం, ప్రపంచం లో ఉన్నతెలంగాణా బిడ్డల కోసం చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించి, అందరు ఇందులో బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంస్థ ఉపాధ్యక్షురాలు శుషమన రెడ్డి మాట్లాడుతూ టాక్ సంస్థ ద్వారా జరుపుతున్న బోనాల వేడుకలకు విచ్చేసిన అతిథులకు, స్థానిక ప్రవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆడబిడ్డలందరు బోనాలతో మన సంస్కృతిని విశ్వవ్యాప్తం చేస్తున్న తీరు నూతన ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. టాక్ చేస్తున్న కార్యక్రమాల గురించి అలాగే భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాల గురించి సభకు వివరించారు. ప్రధాన కార్యదర్శి సుప్రజ పులుసు మాట్లాడుతూ బోనాల జాతర ఇంతటి విజయం సాదించడం సంతోషంగా ఉందని తెలిపారు. టాక్ వ్యవస్థాపకులు అనిల్ కూర్మాచలం అన్న తన సహకారం, సూచనలు, స్ఫూర్తి వల్లే ఇంత ఘనంగా సంబరాలు నిర్వహించుకున్నాం అని తెలిపారు. టాక్ ఉపాధ్యక్షుడు సురేష్ బుడగం మాట్లాడుతూ ప్రవాస తెలంగాణ సంఘాలు ఏర్పడ్డాక బోనాలు - బతుకమ్మ వేడుకల్ని ప్రపంచవ్యాప్తంగా ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. టాక్ అడ్వైసరి చైర్మన్ మట్టా రెడ్డి మాటాడుతూ బోనాల జాతర వేడుకల విజయానికి కృషి చేసిన సహకరించిన స్థానిక ప్రభుత్వ యంత్రంగానికి, టాక్ కార్యవర్గానికి, స్థానికి సంస్థలకు మరియు అతిథులకు, అలాగే హాజరై ప్రోత్సహించిన ఎన్నారై మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

టాక్ కార్యదర్శి క్రాంతి రేతినేని వందన సమర్పణతో కార్యక్రమం ముగించారు. ఈ ఈవెంట్ లో పాల్గొన్న అతిథుల్ని ఇతర సంస్థల్ని ప్రతినిధులని, స్పాన్సర్స్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లను, సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని సంస్థ ఎగ్జిక్యూటివ్ టీం జ్ఞాపిక లతో ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో టాక్ అద్యక్షులు రత్నాకర్ కడుదుల, శుష్మన రెడ్డి, సుప్రజ పులుసు, అశోక్ దూసరి, నవీన్ రెడ్డి, గణేష్ కుప్పాల, పవిత్ర, సురేష్ బుడగం, రాకేష్ పటేల్, సత్యం కంది, సత్యపాల్ రెడ్డి పింగిళి, సత్య చిలుముల, మట్టా రెడ్డి, రవి రేతినేని, రవి ప్రదీప్ పులుసు, మల్లా రెడ్డి, గణేష్ పాస్తాం, శ్రీకాంత్ జెల్ల, నాగరాజు తౌటం, శ్రీధర్ రావు, శైలజ జెల్ల, స్నేహ, విజయ లక్ష్మి, శ్వేతా మహేందర్, స్వాతి, క్రాంతి, శ్రీ విద్య, దివ్య, ప్రవీణ్ వీర, మని తేజ, నిఖిల్ రెడ్డి, హరి గౌడ్, రంజిత్, రాజేష్ వాక, మాధవ రెడ్డి, అంజన్, తరుణ్ లూణావత్, సందీప్, ఆనంద్, లత, పావని, కార్తీక్ ,స్నేహ, అమరేశ్వరి, సాయి రావు, జస్వంత్, ప్రశాంత్, వినోద్ నవ్య, ఉమా, తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
29 జూలై 2026

# నైతికత చచ్చిపోయిందా?

## సిగ్గుపడాల్సిన చోట సత్కారాలా?

సంపాదకీయం

ఒక పరీక్ష. కోట్ల మంది కలలు. లక్షలాది కుటుంబాల నిరీక్షణ. కానీ ఆ పరీక్షే అబద్ధమైంది. ప్రశ్నాపత్రం లీక్ అయింది, పరీక్ష వ్యవస్థపై నమ్మకం కుప్పకూలింది, కొందరు విద్యార్థులు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఇంతటి విషాదం తర్వాత కూడా, బాధ్యులుగా భావించాల్సినవారు తలవంచుకోకపోవడం ఈ దేశపు పాలనా సంస్కృతిలో నైతికత ఎంత బలహీనంగా మిగిలిపోయిందో చెప్పకనే చెబుతుంది.

ఒక మంత్రి పదవి కేవలం అధికారం కాదు, అది బాధ్యత. ఆ బాధ్యత విఫలమైనప్పుడు, పదవి నుంచి తప్పుకోవడం శిక్ష కాదు, కనీస మర్యాద. కానీ ఇక్కడ జరిగింది వేరు. తప్పు జరిగిందని ఒప్పుకోవడానికి బదులు, రాజీనామాను త్యాగంగా చిత్రించే ప్రయత్నం జరిగింది. లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఒక వైఫల్యాన్ని, ఆత్మపరిశీలనకు బదులు ఆత్మస్తుతిగా మార్చుకునే ప్రయత్నం ఇది. సిగ్గుపడాల్సిన సందర్భాన్ని గర్వంగా ప్రదర్శించడం కంటే బాధాకరమైనది మరొకటి ఉండదు.

మరింత బాధాకరమైన విషయం ఏమిటంటే, ఈ వైఫల్యానికి బాధ్యుడైన వ్యక్తిని తిరిగి సభలోకి తీసుకువచ్చినప్పుడు లభించిన స్వాగతం. తప్పు చేసినవారిని ప్రశ్నించాల్సిన వేదిక, వారిని సత్కరించే వేదికగా మారడం రాజకీయ వ్యవస్థ విలువలను ఎంత దిగజార్చిందో సూచిస్తుంది. అధికారంలో ఉన్నవారికి జవాబుదారీతనం లేకుండా పోతే, ప్రజాస్వామ్యం అనేది ఒక ప్రదర్శనగా మిగిలిపోతుంది.

ఇప్పుడు పార్లమెంటులో లీకుల వెనుక మాఫియాలు ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. ఇది వ్యవస్థాగత వైఫల్యానికి మరో కోణాన్ని బయటపెడుతుంది. వ్యక్తిగత బాధ్యతను దాటి, పరీక్షల పవిత్రతను కాపాడాల్సిన యంత్రాంగం మొత్తం భ్రష్టుపట్టిందా అన్న ప్రశ్న తలెత్తుతోంది. దీనికి సమాధానం వెతకాల్సింది కేవలం ఒక మంత్రి రాజీనామాతో కాదు, లోతైన దర్యాప్తుతో, పారదర్శకమైన విచారణతో.

నష్టపరిహారం చర్చ ఇప్పుడు జరుగుతూ ఉండవచ్చు. కానీ డబ్బుతో తీరనిది నమ్మకం. ఒక తరం విద్యార్థుల్లో వ్యవస్థపై కలిగిన అపనమ్మకాన్ని, కోల్పోయిన ప్రాణాలను ఏ పరిహారమూ తిరిగి ఇవ్వలేదు. అధికారంలో ఉన్నవారు ఈ విషాదాన్ని ఒక రాజకీయ ఘటనగా కాకుండా, తమ వైఫల్యంగా అంగీకరించినప్పుడే, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి. అంతవరకూ, సిగ్గు లేని పాలన మీద ప్రజలు ప్రశ్నలు అడుగుతూనే ఉండాలి.

# మోడీకి నిద్ర పట్టలేదా? నిద్ర పోలేదా?




అధికారానికి రెండు రకాల రాత్రులు ఉంటాయి. ఒకటి విజయాల తర్వాత వచ్చే నిశ్చింత రాత్రి. మరొకటి ప్రజల మనసులో ఏదో మారుతుంది అనే సంకేతం మొదటిసారి వినిపించిన తర్వాత వచ్చే రాత్రి. మొదటి రాత్రిలో శరీరం విశ్రాంతి తీసుకుంటుంది. రెండో రాత్రిలో కళ్ళు మూసుకున్నా ఆలోచనలు మేల్కొని ఉంటాయి. ఎందుకంటే అధికారాన్ని నిజంగా మేల్కొలిపేది ప్రతిపక్షం కాదు. ఎన్నికలు కాదు. మీడియా కాదు. ప్రజలు నిశ్శబ్దంగా తమ అభిప్రాయాన్ని మార్చుకోవడం ప్రారంభించిన క్షణమే. సింహం గర్జించడం ఆపిన రోజు అడవి మారదు. జింక భయపడడం మానేసిన రోజు అడవి మారుతుంది. రాజకీయాల్లో కూడా అంతే. అధికారాన్ని కదిలించేది ప్రతిపక్షం కాదు. ప్రజల మనసులో మారిపోయిన లెక్క. చరిత్రలో ఎన్నో ప్రభుత్వాలు ఎన్నికల్లో ఓడిపోయిన రోజున బలహీన పడలేదు. తమ గురించి రాసుకున్న కథను మార్చడం ప్రారంభించిన రోజే వాటి అసలు పరీక్ష మొదలైంది. అందుకే ప్రజల నిశ్శబ్దాన్ని చిన్నచూపు చూసిన ప్రతి అధికారం ఒకరోజు తన సొంత నిశ్శబ్దానికి సమాధానం చెప్పాల్సి వస్తుంది.

జర్మనీకి చెందిన పాస్టర్ మార్టిన్ నీల్ మోర్ ఒక గొప్ప హెచ్చరికను ప్రపంచానికి ఇచ్చాడు." First they came for communists, next for the trade unionists, later for the Jews,I remain ed silent until they finally came for me what can I do. ఈ చిన్న వాక్యంలో ఒక పెద్ద సత్యం దాగి ఉంది. అన్యాయం ఒక్కరోజులో సమాజాన్ని చుట్టుముట్టదు. అది ఒక్కో సమస్యగా, ఒక్కో వర్గాన్ని తాకుతూ ముందుకు సాగుతుంది. ప్రతిసారి అది నా సమస్య కాదు అని సమాజం మౌనంగా ఉన్న కొద్దీ అన్యాయం మరింత ధైర్యం తెచ్చుకుంటుంది. చివరికి విడివిడిగా కనిపించిన అసంతృప్తులన్నీ ఒక ప్రవాహంగా కలుస్తాయి. ఢిల్లీలో చెలరేగిన విద్యార్థుల ఉద్యమాన్ని కూడా కేవలం ప్రశ్నపత్రాల లీకేజ్ గా మాత్రమే అర్థం చేసుకోవడం సరైనది కాదు. దానికి ముందే నిరుద్యోగంపై పెరిగిన ఆందోళన, విద్యా వ్యవస్థపై దెబ్బతిన్న నమ్మకం, ప్రభుత్వ విధానాలపై పేరుకుపోయిన అసంతృప్తి, మూడు పర్యాయాల పాలనలో ఒక్కొక్కటిగా కూడబెట్టుకున్న ప్రశ్నలు, ఇవన్నీ నెమ్మదిగా ఒకచోట చేరాయి. పరీక్షల వివాదం వాటికి నిప్పంటించింది. అందుకే అది కొందరి విద్యార్థుల ఆందోళనగా ఆగిపోలేదు. ఒక తరం తన అసంతృప్తిని దేశం ముందుంచిన రాజకీయ ఘట్టంగా మారింది. అందుకే కాక్రోచ్ జనతా పార్టీ అనే పేరు కొద్ది రోజుల్లోనే ఒక ప్రతీకంగా మారింది. అది రాజకీయ పార్టీ పేరు కాదు. అవమానాన్ని నిరసనగా మార్చుకున్న యువత ఆత్మగౌరవానికి పెట్టుకున్న పేరు. ఒక ఇన్స్టాగ్రామ్ పోస్ట్ తో మొదలైన పిలుపు దేశవ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులను ఒకే వేదికపై తీసుకువచ్చి "మమ్మల్ని చిన్నచూపు చూస్తే మేము మౌనంగా ఉండం"అనే ఒక తరం ప్రకటనగా మారింది. లాఠీ చార్జీలు ఉద్యమాన్ని ఆపలేదు, గాయాలు దాని స్వభావాన్ని తగ్గించలేదు. ప్రముఖుల సంఘీభావం దానికి మరింత నైతిక బలం ఇచ్చింది. చివరికి ప్రభుత్వం స్పందించి అర్ధరాత్రి మోడీ నుండి ఒక ప్రకటన వెలువడింది. అయితే అది పరిపాలన నిర్ణయం మాత్రమే కాదు అధికారానికి నిద్రలేని రాత్రుల ప్రారంభాన్ని ప్రకటించిన రాజకీయ మలుపు. ఒక మంత్రి రాజీనామా చేయడం పరిపాలన పరిణామం కావచ్చు కానీ దాని వెనుక వినిపించింది యువత గొంతే.

ఈ ఉద్యమాన్ని మరింత అర్థం చేసుకోవాలంటే తరాల మనస్తత్వాన్ని కూడా అర్థం చేసుకోవాలి. జెన్‌ఎ వ్యవస్థను మార్చడానికి ఓపికను నమ్మింది. జెన్ అవకాశాలను నమ్మింది. అభివృద్ధి, ఉద్యోగం, ఆర్థిక పురోగతి, దాని రాజకీయ ఆలోచనలను ప్రభావితం చేశాయి. కానీ జెన్ $_{z}$ పూర్తిగా భిన్నం. ఈ తరం నాయకుడిని చూసి చప్పట్లు కొట్టదు. నిర్ణయాన్ని చూసి ప్రశ్నిస్తుంది. ప్రచారాన్ని కాదు పారదర్శకతను కోరుతుంది. హామీలను కాదు, జవాబుదారితనాన్ని డిమాండ్ చేస్తుంది. సోషల్ మీడియా దీని ఆయుధం మాత్రమే కాదు; సమాచా రాన్ని తనిఖీ చేసే సాధనం కూడా. అందుకే ఈ తరాన్ని పాత రాజకీయ సూత్రాలతో కొలవడం సాధ్యం కాదు.

గత 10 ఏళ్లలో నరేంద్ర మోడీ చుట్టూ ఒక శక్తివంతమైన రాజకీయ ప్రతిమ నిర్మితమైంది. వరస ఎన్నికల విజయాలు, కరిష్మా, కేంద్రీకృత నాయకత్వం, అపారమైన ప్రచార యంత్రాంగం ఇవన్నీ కలిపి ఆయనను అపరాజయ (విశ్వగురు) నాయకుడిగా నిలబెట్టాయి. క్రమంగా ఆ ప్రతిమ చుట్టూ ఒక రాజకీయ "ఆరా" ఏర్పడింది. ప్రత్యర్థులు కూడా ఆయనను ఓడించడం అసాధ్యం అనే భావనలోకి వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయి. కానీ ప్రజాస్వామ్యంలో ఏ "ఆరా" అయినా ప్రజల అంగీకారంతోనే నిలుస్తుంది. అదే అంగీకారం ప్రశ్నగా మారడం ప్రారంభించినప్పుడు ముందుగా కదిలేది అధికారం కాదు. ఆ అధికారం చుట్టూ నిర్మించుకున్న అపరాజేయత భావన. ఆ భావన బీటలు వారినప్పుడు కనిపించేది ఒక వ్యక్తి నిర్ణయం కాదు. అధికార స్వభావములో వచ్చిన మార్పు. అయితే ఇక్కడ ప్రశ్న ఒక మంత్రి రాజీనామా చేశాడా లేదా అన్నది కాదు దిగిపోయింది అధికారమా? అహంకారమా? ఎందుకంటే ఈసారి అధికారాన్ని ఎదుర్కొన్నది ప్రతిపక్ష రాజకీయాలు కాదు. నైతిక మనస్సాక్షి. (Moral conscience) అందుకే ప్రభుత్వం ఒక ఉద్యమాన్ని మాత్రమే ఎదుర్కోలేదు. ప్రజల విశ్వాసాన్ని తిరిగి సంపాదించాల్సిన సవాలును ఎదుర్కొంది.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోవడం ఏ ప్రభుత్వానికైనా అతిపెద్ద రాజకీయ సవాలు. ఎందుకంటే ఎన్నికలు అధికారాన్ని ఇస్తాయి. కానీ ప్రజల విశ్వాసమే ఆ అధికారానికి స్థిరత్వాన్ని ఇస్తుంది

చరిత్రలో ప్రభుత్వాలు ఒక్కరోజులో బలహీన పడలేదు. ప్రజలు వాటిని చూసే దృష్టి మారినప్పుడు బలహీనపడ్డాయి. అధికారానికి అత్యంత ప్రమాదకరమైనది ప్రతిపక్షం కాదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రారంభించిన సమాజం. ఎందుకంటే ఆ ప్రశ్నలను ఎంతకాలం విస్మరించిన అవి చివరికి రాజకీయ తీర్పు గానే తిరిగి వస్తాయి. ఇలాంటి సందర్భాల్లో రాజకీయాల్లో మొదట మారేది ప్రభుత్వాలు కాదు. ప్రజల రాజకీయ దృష్టి. నిన్నటి వరకు వ్యక్తుల చుట్టూ తిరిగిన చర్చ నెమ్మదిగా వ్యవస్థ వైపు మల్లుతుంది. రాజకీయాల్లో ప్రశ్నల స్వభావం మారినప్పుడు సమాధానాల స్వభావం కూడా మార్గ తప్పదు. అదే ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన మలుపు. ఎందుకంటే ఆ తర్వాత ప్రజలు నాయకులను కాదు. వారి పరిపాలనను కొలవడం ప్రారంభిస్తారు.

ఈ ఉద్యమం రేపు ఎటువైపు వెళుతుందో కాలమే చెబుతుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. భారత రాజకీయాల్లో కొత్త ఓటర్ తన ఉనికిని గట్టిగా తెలియజేస్తున్నాడు. అతడు కులంతో మాత్రమే ఓటు వేయడం లేదు. మతంతో మాత్రమే స్పందించడం లేదు. ఉద్యోగం, విద్య అవకాశాలు, పారదర్శకత, జవాబుదారితనం వంటి అంశాలు ఇప్పుడు అతని రాజకీయ నిర్ణయాల్లో కీలకంగా మారుతున్నాయి. ఈ మార్పును గుర్తించిన వారే రేపటి రాజకీయా లను అర్థం చేసుకోగలరు. గుర్తించలేని వారు గత విజయాల జ్ఞాపకాలతోనే మిగిలిపోతారు. రాజకీయాల్లో ప్రతి సంఘటనకు ఒక తక్షణ ప్రభావం ఉంటుంది. కానీ కొన్ని సంఘటనల అసలు అర్థం కాలం గడిచిన తర్వాతే బయటపడుతుంది. అందుకే ఆ అర్ధరాత్రి వెలవడిన ప్రకటనను ఒక పరిపాలన నిర్ణయం గా మాత్రమే చూడడం సరిపోదు. అది ఒక సమస్యకు ఇచ్చిన సమాధానమా? లేక మారుతున్న రాజకీయ వాస్తవానికి ఇచ్చిన తొలి అంగీకారమా? అన్నది రాబోయే పరిణామాలే చెబుతాయి. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం. ప్రజాస్వామ్యంలో ప్రతి నిర్ణయం అధికారం తో ప్రకటించబడుతుంది. కానీ కొన్ని నిర్ణయాలను రాయించేది ప్రజలే.



**ఆయిరబోయిన బిక్షపతి**
(అగల్ జోయా).
7993248717

# 'రాజీనామా'తోనే సరికాదు..విద్యా వ్యవస్థ ప్రక్షాళన




భారతదేశంలో విద్య అనేది కేవలం ఉద్యోగ సాధనకు మార్గం మాత్రమే కాదు; అది సమాజంలో సమాన అవకాశాలకు, సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్య విలువలకు పునాది. అలాంటి విద్యా వ్యవస్థలో ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల అవకతవకలు చోటు చేసుకోవడం దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అంశం. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా ఒక వ్యక్తిగత రాజకీయ పరిణామం కాదు; దేశ విద్యా పరిపాలనపై ప్రజల్లో పెరిగిన ఆగ్రహానికి, యువతలో ఉద్భవించిన అసంతృప్తికి ప్రతీకగా నిలిచింది.

పరీక్షల్లో పారదర్శకత, నిష్పక్షపాతత, సమాన అవకాశాలు ప్రజా స్వామ్య వ్యవస్థకు అత్యంత అవసరం. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతారు. అయితే ప్రశ్నాపత్రాల లీకులు, అవినీతి, నిర్వహణలో వైఫల్యాలు వారి శ్రమను వృథా చేస్తాయి. ముఖ్యంగా చీజుజు వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో జరిగిన అవకతవకలు విద్యార్థుల భవిష్యత్తును మాత్రమే కాదు, మొత్తం పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశాయి.

ఈ పరిణామాలపై దేశవ్యాప్తంగా యువత స్వచ్ఛందంగా ఉద్యమించడం ప్రజాస్వామ్య చైతన్యానికి నిదర్శనం. రాజకీయాలకు అతీతంగా విద్యార్థులు, యువజనులు న్యాయం కోసం గళమెత్తడం ప్రజాస్వామ్యంలో ఆరోగ్యకరమైన పరిణామం. ప్రభుత్వ యంత్రాంగం ఉద్యమాలను అణచివేయడానికి ప్రయత్నించడం, నిరసనలను ఇతర కోణాల్లో చూపించే ప్రయత్నాలు చేయడం సమస్యకు పరిష్కారం కాదని ఈ సంఘటనలు స్పష్టం చేశాయి.

మంత్రి రాజీనామా జరిగినప్పటికీ, దానితో బాధ్యత ముగిసిపోయినట్లు భావించడం సరైంది కాదు. అసలు ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి. ప్రశ్నాపత్రాలు ఎలా లీకయ్యాయి? బాధ్యులెవరు? పరీక్షల నిర్వహణలో ఉన్న లోపాలను ఎలా సరిదిద్దాలి? భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి సంస్కరణలు చేపడతారు? అనే అంశాలపై సమగ్ర సమాధానం అవసరం. కేవలం వ్యక్తుల మార్పుతో వ్యవస్థలో మార్పు రాదు; వ్యవస్థాగత సంస్కరణలే శాశ్వత పరిష్కారం.

ప్రభుత్వం విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పాలంటే పారదర్శకమైన పరీక్షా నిర్వహణ, కఠిన భద్రతా చర్యలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, స్వతంత్ర దర్యాప్తు వ్యవస్థ, తప్పు చేసిన వారిపై నిర్దాక్షిణ్యమైన చర్యలు తీసుకోవాలి. అలాగే విద్యార్థుల ఆందోళనలను శత్రుత్వంగా కాకుండా ప్రజాస్వామ్య హక్కులుగా గౌరవించడం కూడా అవసరం.

ప్రజాస్వామ్యంలో అధికారాలు ప్రజల విశ్వాసంపై నిలుస్తాయి. ఆ విశ్వాసం దెబ్బతిన్నప్పుడు బాధ్యత వహించడం పాలకుల కర్తవ్యం. రాజీనామా ఒక రాజకీయ చర్య మాత్రమే; నిజమైన జవాబుదారీతనం వ్యవస్థను సరిదిద్దడంలో ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తు, దేశ విద్యా ప్రమాణాలు, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలంటే పరీక్షా వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చడం కాలానుగుణమైన అవసరం వెంటనే విద్యా వ్యవస్థ ను ప్రక్షాళన చేయాలి. అప్పుడే యువతలో నమ్మకం పెరుగుతుంది; అప్పుడే దేశ భవిష్యత్తు బలపడుతుంది.

**భూపతి వెంకటేశ్వర్లు**
తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం
రాష్ట్ర అధ్యక్షుడు 9490098343

# చరిత్రను మలుపు తిప్పిన జంతర్ మంతర్ విద్యార్థి ఉద్యమం

### *పేపర్ లీకేజీలపై పోరాటం నుంచి ప్రజాస్వామ్య చైతన్యానికి కొత్త దిశ*

ప్రజాస్వామ్య చరిత్రలో కొన్ని ఉద్యమాలు కేవలం ఒక సమస్యకు వ్యతిరేకంగా ప్రారంభమై, కాలక్రమంలో సమాజంలోని విస్తృత అసంతృప్తికి ప్రతీకలుగా మారుతాయి. ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా జాతీయ స్థాయి పరీక్షల పేపర్ లీకేజీలు, పరీక్షా వ్యవస్థలో లోపాలు, యువత భవిష్యత్తుతో జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి ఉద్యమం అలాంటి చారిత్రక పరిణామంగా నిలిచింది. ఈ ఉద్యమం ఒక పరీక్ష రద్దు చేయాలని, ఒక అధికారిని తొలగించాలని చేసిన సాధారణ నిరసన కాదు. దేశంలోని లక్షలాది యువతలో పేరుకుపోయిన నిరాశ, నిరుద్యోగ ఆందోళన, వ్యవస్థపై తగ్గుతున్న నమ్మకానికి ఇది ఒక బహిరంగ ప్రకటన. ఎన్నో సంవత్సరాల పాటు చదివి, కోచింగ్ కేంద్రాలకు లక్షల రూపాయలు ఖర్చు చేసి, కుటుంబాల ఆశలను మోస్తూ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడితే ఎంతటి సామాజిక ప్రతిస్పందన వస్తుందో ఈ ఉద్యమం చూపించింది.

జాతీయ పరీక్షల నిర్వహణలో వచ్చిన అవకతవకలు, పేపర్ లీకేజీలు, ఫలితాలపై అనుమానాలు విద్యార్థుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఢిల్లీ విశ్వవిద్యాలయం, జేఎన్‌యూ వంటి ఉన్నత విద్యాసంస్థల విద్యార్థులు, ఉత్తర భారతదేశంలోని కోచింగ్ కేంద్రాల నుంచి వచ్చిన యువత పెద్ద సంఖ్యలో ఉద్యమంలో పాల్గొన్నారు. సామాజిక కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు, వివిధ రాజకీయ వర్గాలకు చెందిన వ్యక్తులు సంఘీభావం తెలిపారు. సోనం వాంగ్‌చుక్ వంటి ప్రముఖులు చేపట్టిన నిరసనలు ఉద్యమంపై దేశవ్యాప్తంగా చర్చను పెంచాయి.

ఈ ఉద్యమం ప్రత్యేకత ఏమిటంటే ఇది ఒకే పార్టీ లేదా ఒకే సిద్ధాంతం ఆధారంగా సాగలేదు. కులం, మతం, ప్రాంతం అనే పరిమితులను దాటి యువత తమ భవిష్యత్తు కోసం ఒకే వేదికపైకి వచ్చింది. అదే ఈ ఉద్యమానికి నైతిక బలాన్ని ఇచ్చింది.

పేపర్ లీకేజీ ఎందుకు యువతలో ఇంతటి ఆగ్రహాన్ని రగిలించింది? ఉత్తర భారతదేశంలోని బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా వంటి రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడే యువత సంఖ్య అధికంగా ఉంటుంది. స్థానిక పారిశ్రామిక అవకాశాలు పరిమితంగా ఉండటం వల్ల సివిల్ సర్వీసులు, రైల్వేలు, వైద్య, ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలు లక్షలాది కుటుంబాలకు జీవిత మార్పుకు మార్గాలుగా కనిపిస్తాయి. అటువంటి పరిస్థితిలో ఒక పరీక్ష పేపర్ లీక్ కావడం కేవలం ఒక విద్యా వ్యవస్థ లోపం కాదు. అది ఒక విద్యార్థి జీవితంలో సంవత్సరాల శ్రమను, కుటుంబాల ఆర్థిక త్యాగాలను, భవిష్యత్తు ఆశలను దెబ్బతీసే ఘటన. అందుకే ఈ సమస్యపై వచ్చిన స్పందన సాధారణ నిరసన స్థాయిని దాటి ప్రజా ఉద్యమంగా మారింది.




ఉత్తరాది-దక్షిణాది స్పందనలో కనిపించిన తేడా

జంతర్ మంతర్ ఉద్యమంలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొనగా, దక్షిణాది నుంచి అదే స్థాయి ప్రత్యక్ష భాగస్వామ్యం కనిపించలేదు. అయితే దీనిని దక్షిణాది ప్రజల నిర్లక్ష్యంగా చూడటం సరైన విశ్లేషణ కాదు.

భారతదేశం భౌగోళికంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎంతో వైవిధ్యమైన దేశం. ఒక ప్రాంతంలో తీవ్రమైన సమస్యగా కనిపించే అంశం మరో ప్రాంతంలో భిన్నమైన ప్రభావాన్ని కలిగి ఉండవచ్చు. మొదటిది భౌగోళిక దూరం. ఢిల్లీకి దక్షిణాది రాష్ట్రాల నుంచి వేల కిలోమీటర్ల దూరం ఉంది. విద్యార్థులు లేదా రైతులు నెలల తరబడి ఢిల్లీలో ఉండి ఉద్యమం కొనసాగించడం ఆర్థికంగా, సామాజికంగా కష్టమైన విషయం.

రెండవది ఉపాధి అవకాశాల స్వభావం. దక్షిణాది రాష్ట్రాల్లో ఐటీ, సేవా రంగాలు, ప్రైవేట్ పరిశ్రమలు, స్టార్టప్ రంగాలు విస్తరించాయి. యువతలో కొంత భాగం ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా ప్రైవేట్ రంగ అవకాశాలను కూడా ఆశ్రయిస్తోంది.

మూడవది విద్యా విధానాల తేడా. తమిళనాడు వంటి రాష్ట్రాలు చాలా కాలంగా కేంద్రీకృత పరీక్షా విధానాలపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నాయి. జాతీయ స్థాయి పరీక్షలపై వ్యతిరేకతను వారు తరచుగా రాష్ట్ర రాజకీయ వేదికలపై, శాసనసభల్లో వ్యక్తం చేస్తున్నారు. అయితే దక్షిణాది ప్రజలు జాతీయ సమస్యలపై స్పందించరనే భావన తప్పు. అనేక రాష్ట్రాల్లో స్థానిక స్థాయిలో నిరసనలు, చర్చలు, తీర్మానాలు జరిగాయి. కానీ ఢిల్లీ కేంద్రంగా పనిచేసే జాతీయ మీడియా వాటికి తగిన స్థానం ఇవ్వకపోవడం వల్ల ఈ వ్యత్యాసం మరింత స్పష్టంగా కనిపించింది.

### రైతు ఉద్యమం ఇచ్చిన మరో పాఠం

కేంద్ర వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పంజాబ్, హర్యానా రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో నిర్వహించిన సుదీర్ఘ ఉద్యమం కూడా ఇదే అంశాన్ని గుర్తు చేసింది. పంజాబ్, హర్యానాల్లో వ్యవసాయం ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ, మండీలు, కనీస మద్దతు ధరలతో బలంగా అనుసంధానమై ఉంది. అందువల్ల వ్యవసాయ చట్టాల ప్రభావం అక్కడి రైతులకు ప్రత్యక్ష సమస్యగా మారింది.


దక్షిణాది రాష్ట్రాల్లో వ్యవసాయ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఇక్కడ చిన్న, సన్నకారు రైతుల సంఖ్య ఎక్కువ. పంటల వైవిధ్యం, వేర్వేరు మార్కెటింగ్ పద్ధతులు ఉన్నాయి. నెలల తరబడి ఢిల్లీకి వెళ్లి ఉద్యమంలో పాల్గొనే ఆర్థిక సామర్థ్యం చాలా మంది రైతులకు ఉండదు. అందువల్ల ఒక ప్రాంతంలో కనిపించే ఉద్యమ రూపం మరో ప్రాంతంలో కనిపించకపోవడం అంటే ప్రజల్లో చైతన్యం లేదని కాదు. సమస్యల స్వభావం, పోరాట పద్ధతులు మారవచ్చు.

### కొత్త రాజకీయ చైతన్యానికి సంకేతం

జంతర్ మంతర్ విద్యార్థి ఉద్యమం భారత రాజకీయాలకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చింది. ప్రజల అసలు సమస్యలు ముందుకు వస్తే భావోద్వేగ అంశాల కంటే జీవన సమస్యలు ఎక్కువ ప్రభావం చూపగలవని ఇది నిరూపించింది. విద్య, ఉపాధి, పారదర్శకత, అవినీతి నిర్మూలన వంటి అంశాలు భవిష్యత్తు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యత పొందే అవకాశాన్ని ఈ ఉద్యమం సూచించింది. విద్యార్థుల ఆత్మహత్యలు, కుటుంబాల బాధ, భవిష్యత్తుపై ఏర్పడిన భయం పరీక్షా వ్యవస్థలో సమూల మార్పుల అవసరాన్ని తెలియజేస్తున్నాయి. పరీక్షలు కేవలం మార్కుల పోటీ కాదు. అవి కోట్లాది యువత జీవితాలకు సంబంధించిన అంశాలు.

### ప్రజాస్వామ్యానికి ఒక హెచ్చరిక

జంతర్ మంతర్ ఉద్యమం పాలకులకు ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వ్యవస్థలు ఎంత బలమైనవైనా ప్రశ్నించబడతాయి. పరీక్షా వ్యవస్థ నుంచి ఎన్నికల వ్యవస్థ వరకు ప్రతి రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం అవసరం. ప్రజాస్వామ్యం కేవలం ఓటు వేయడంలో లేదు. ప్రజల సమస్యలను వినడంలో, పరిష్కరించడంలో ఉంది. జంతర్ మంతర్ విద్యార్థి ఉద్యమం ఒక తరం యువతలో కొత్త ఆలోచనకు నాంది పలికింది. సమస్యల ఆధారంగా ప్రజలు ఏకం కావచ్చని ఇది చూపించింది. భవిష్యత్తులో మరిన్ని ప్రజా ఉద్యమాలకు ఇది స్ఫూర్తిగా నిలిచే అవకాశం ఉంది. చరిత్రలో కొన్ని ఉద్యమాలు వెంటనే ఫలితాలు ఇవ్వకపోయినా, సమాజ ఆలోచనా విధానాన్ని మార్చుతాయి. జంతర్ మంతర్ విద్యార్థి ఉద్యమం అలాంటి చారిత్రక మలుపుగా నిలిచిపోతుంది.



**- బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# గోదీ మీడియా

## ఉన్నది వాస్తవిక వార్తలకా? వక్రీకరణల వివాదాలకా?

భారత ప్రజాస్వామ్యంలో శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలతో పాటు మీడియాను నాలుగో స్థంభంగా అభివర్ణిస్తారు. ప్రజల తరఫున అధికారాన్ని ప్రశ్నించడం, వాస్తవాలను వెలికితీయడం, అధికార-ప్రతిపక్షాలకు సమాన అవకాశాన్ని కల్పించడం, ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించడం మీడియా ప్రాథమిక బాధ్యత. అయితే గత దశాబ్ద కాలంగా భారత రాజకీయాల్లో "గోదీ మీడియా" అనే పదం విస్తృతంగా వినిపిస్తోంది. ఇది అధికార పక్షానికి అత్యంత అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఎదుర్కొనే కొన్ని మీడియా సంస్థలను సూచించడానికి విమర్శకులు ఉపయోగించే రాజకీయ పదం. సంబంధిత సంస్థలు మాత్రం ఈ ఆరోపణలను సాధారణంగా ఖండిస్తూ, తాము జాతీయ ప్రయోజనాల దృష్టితో వార్తలు అందిస్తున్నామని చెబుతుంటాయి.

విమర్శకులు తరచుగా ప్రస్తావించే జాతీయ మీడియా సంస్థల్లో రిపబ్లిక్ టీవీ (యాంకర్, వ్యవస్థాపకుడు: అర్నబ్ గోస్వామి), టైమ్స్ నౌ (బెన్నెట్, కోల్మన్ అండ్ కంపెనీ), జీ న్యూస్ (ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర; ప్రస్తుతం జీ మీడియా కార్పొరేషన్), ఆజ్ తక్ (ఇండియా టుడే గ్రూప్; యాంకర్లలో సుధీర్ చౌదరి గతంలో ఇక్కడ, తరువాత ఇతర వేదికల్లో పనిచేశారు), న్యూస్18 ఇండియా (నెట్‌వర్క్18, రిలయన్స్ గ్రూప్ ఆధీనంలో) వంటి సంస్థలు తరచూ చర్చకు వస్తుంటాయి. అలాగే కొన్ని ప్రాంతీయ ఛానళ్లపై కూడా అధికార పక్షానికి అనుకూల ధోరణి ఉందనే విమర్శలు వినిపిస్తుంటాయి. ఈ విమర్శలు రాజకీయ వాదోపవాదాల్లో భాగంగా వస్తుంటాయి; వాటిని సంబంధిత సంస్థలు చాలాసార్లు తిరస్కరించాయి.

గత పన్నెండు సంవత్సరాల్లో ప్రభుత్వ విధానాలు, ఎన్నికలు, రైతు ఉద్యమం, పౌరసత్వ సవరణ చట్టం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, మణిపూర్ హింస, పరీక్షల లీకేజీలు, అలాగే ఇటీవల జరిగిన జెన్-జీ లేదా "కాక్రోచ్ జనతా పార్టీ"గా సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందిన యువజన ఉద్యమం వంటి అనేక అంశాల కవరేజీలో ఈ మీడియా సంస్థల పాత్రపై తీవ్రమైన చర్చ జరిగింది. ఉద్యమం ప్రారంభమైన వెంటనే విద్యార్థులు ఎందుకు వీధుల్లోకి వచ్చారు? వారి ప్రధాన డిమాండ్లు ఏమిటి? పరీక్షల నిర్వహణలో ఎక్కడ లోపాలు జరిగాయి? అనే ప్రశ్నల కంటే, ఈ ఉద్యమం వెనుక ఎవరు ఉన్నారు? ఎవరు నిధులు ఇస్తున్నారు? ప్రతిపక్షాల పాత్ర ఏమిటి? అనే చర్చలకే ఎక్కువ ప్రాధాన్యం లభించిందని విమర్శకులు పేర్కొన్నారు.



కొన్ని టెలివిజన్ చర్చల్లో ఉద్యమాన్ని సమర్థించిన విద్యార్థులు, అధ్యాపకులు, సామాజిక కార్యకర్తలు, ప్రతిపక్ష నాయకులపై "రాజకీయ కుట్ర", "దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం", "విదేశీ ప్రేరణ", "అర్బన్ నక్సల్స్", "టుక్డే-టుక్డే గ్యాంగ్" వంటి తీవ్ర పదజాలం వినిపించింది. అయితే ఈ తరహా ఆరోపణలు ప్రతి సందర్భంలోనూ ఆధారాలతో నిరూపించబడ్డాయా అనే ప్రశ్నలు కూడా వచ్చాయి. ఒక ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని విమర్శించడం మాత్రమే దేశ వ్యతిరేక చర్యగా పరిగణించలేమని అనేక మాజీ న్యాయమూర్తులు, పాత్రికేయులు, మీడియా విశ్లేషకులు గతంలోనే వ్యాఖ్యానించారు.

జెన్-జీ ఉద్యమం సమయంలో కూడా ఇదే ధోరణి కనిపించిందని విమర్శకులు అభిప్రాయపడ్డారు. నిరుద్యోగ యువత ఆవేదన, పరీక్షల పారదర్శకత, నియామక వ్యవస్థలో సంస్కరణల వంటి అంశాల కంటే, ఉద్యమానికి మద్దతు తెలిపిన వ్యక్తుల రాజకీయ నేపథ్యాలపై చర్చలు ఎక్కువయ్యాయి. ఫలితంగా అసలు సమస్య కొంతవరకు పక్కకు వెళ్లిపోయిందనే విమర్శలు వచ్చాయి. తరువాత ఉద్యమం మరింత బలపడటం, ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడం, చివరకు కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం వంటి పరిణామాల తర్వాత కూడా కొన్ని వేదికలు ఉద్యమ విజయాన్ని అంగీకరించకుండా, దానిని పూర్తిగా రాజకీయ ఒత్తిడికి మాత్రమే పరిమితం చేయడానికి ప్రయత్నించాయని విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఇది కేవలం ఒక ఉద్యమానికి మాత్రమే పరిమితమైన ప్రశ్న కాదు. మీడియా ఒక రాజకీయ పక్షం తరఫున వాదించే వేదికగా మారితే, ప్రజలు నిష్పాక్షిక సమాచారాన్ని ఎక్కడి నుంచి పొందాలి అనే ప్రశ్న ముందుకు వస్తుంది. ప్రజాస్వామ్యంలో మీడియా ప్రభుత్వాన్ని ప్రశ్నించినంత సహజంగా ప్రతిపక్షాన్నీ ప్రశ్నించాలి. కానీ ఒకవైపు ప్రశ్నలు మాత్రమే ఉండి, మరోవైపు నిరంతర సమర్థనలు కనిపిస్తే మీడియాపై ప్రజల విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

అదే సమయంలో, ఏదైనా మీడియా సంస్థను లేదా పాత్రికేయుడిని కేవలం రాజకీయ భిన్నాభిప్రాయం కారణంగా ముద్ర వేయడం కూడా సరైన పద్ధతి కాదు. ఒక సంస్థ లేదా యాంకర్‌పై విమర్శలు ఉంటే, అవి వారి ప్రసారాలు, వార్తల ఎంపిక, వాస్తవ నిర్ధారణ, సంపాదకీయ ధోరణి వంటి పరిశీలించదగిన ఆధారాలపై ఉండాలి. వ్యక్తిగత దూషణలు లేదా ఆధారంలేని ఆరోపణలు ప్రజాస్వామ్య చర్చను బలహీనపరుస్తాయి.

సమాజంలో మీడియాపై విశ్వాసం నిలవాలంటే వార్తలకు, అభిప్రాయాలకు మధ్య స్పష్టమైన గీత ఉండాలి. ఒక వార్తా కథనం వాస్తవాలను అందించాలి; సంపాదకీయంలో అభిప్రాయం ఉండవచ్చు. కానీ రెండూ కలిసిపోయినప్పుడు ప్రేక్షకుడు వార్తను కాకుండా ఒక రాజకీయ కథనాన్ని మాత్రమే వినే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది ఏ రాజకీయ పక్షం అధికారంలో ఉన్నా ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. జెన్-జీ ఉద్యమం మరోసారి ఒక స్పష్టమైన పాఠాన్ని నేర్పింది. యువతను వినకుండా, వారి ప్రశ్నలను రాజకీయ కుట్రలుగా మాత్రమే చిత్రీకరిస్తే సమస్యలు పరిష్కారం కావు. అలాగే మీడియా అధికారాన్ని ప్రశ్నించే తన రాజ్యాంగబద్ధమైన నైతిక బాధ్యతను పక్కనబెట్టి ఒకే రాజకీయ దృక్కోణాన్ని ప్రసారం చేస్తే, చివరికి నష్టపోయేది ఏ ప్రభుత్వం కాదు; ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకమే. అందుకే మీడియా స్వేచ్ఛ ఎంత అవసరమో, మీడియా బాధ్యత కూడా అంతే అవసరం. వాస్తవాలను వక్రీకరించకుండా, అన్ని వర్గాల గొంతుకలకు సమాన స్థానం కల్పిస్తూ, అధికారాన్ని ప్రశ్నించడంలోనూ, ప్రతిపక్షాన్ని పరిశీలించడంలోనూ సమతుల్యత పాటించినప్పుడే మీడియా నిజమైన అర్థంలో ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా నిలుస్తుంది.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

## ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తిచేసి బీఎల్‌వోలకు అందజేయాలి

**రాజేంద్రనగర్, జూలై 28 (జనంసాక్షి) :** ఎన్యూమరేషన్ ఫారాలు పొందిన ఓటర్లు వాటిని పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేసి ఆన్‌లైన్ డిజిటలైజేషన్ ప్రక్రియకు సహకరించాలనిఏఈఆర్‌ఓ నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ఆదేశించారు. మంగళవారం జిహెచ్ఎంసి నార్సింగ్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు 81 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని 1,03,615 మంది ఓటర్లలో 51,358 మంది (50.14 శాతం) ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన 52,257 మంది ఓటర్ల డిజిటలైజేషన్ కోసం జూలై 29 నుంచి ఆగస్టు 3 వరకు పోలింగ్ ఏజెంట్లు, బీఎల్‌వోలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రత్యేక కేంద్రాల్లో సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. ఎన్యూమరేషన్ ఫారాలు పొందిన ఓటర్లు వాటిని పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేసి ఆన్‌లైన్ డిజిటలైజేషన్ ప్రక్రియకు సహకరించాలని, చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ కోరారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ కోరారు.



# గన్ లైసెన్స్ హోల్డర్లు ఆయుధాలను చట్టబద్ధంగా వినియోగించాలి

- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

**వనపర్తి బ్యూరో, జూలై 28 (జనంసాక్షి) :** జిల్లాలో గన్ లైసెన్స్ కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఆయుధాలను చట్టబద్ధమైన అవసరాలకు మాత్రమే వినియోగిస్తూ సమాజ భద్రత పట్ల అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి,అన్నారు.ఆయుధాన్ని కలిగి ఉండటం ఒక హక్కు మాత్రమే కాకుండా ప్రజల ప్రాణ, ఆస్తుల భద్రతను పరిరక్షించే బాధ్యత కూడా అని ఆమె పేర్కొన్నారు.మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ గన్ లైసెన్స్ హోల్డర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని గన్ లైసెన్స్ హోల్డర్లతో ప్రత్యక్షంగా సమావేశమై ప్రతి లైసెన్స్‌ను స్వయంగా పరిశీలించారు. ఆయుధాల భద్రత, లైసెన్స్ నిబంధనలు, రెన్యువల్, వారసత్వ బదిలీ, చట్టపరమైన బాధ్యతలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రభుత్వం గన్ లైసెన్స్ మంజూరు చేయడం అంటే కేవలం ఆయుధాన్ని కలిగి ఉండేందుకు అనుమతి ఇవ్వడం మాత్రమే కాదని, చట్టాన్ని గౌరవిస్తూ సమాజ భద్రతను పరిరక్షించే బాధ్యతను కూడా అప్పగించినట్లేనని అన్నారు. ప్రతి లైసెన్స్ హోల్డర్ చట్టాన్ని అక్షరాలా పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.వ్యక్తిగత కక్షలు, భూవివాదాలు, రాజకీయ విభేదాలు, సామాజిక కార్యక్రమాలు లేదా ప్రజల్లో భయాందోళనలు సృష్టించే విధంగా ఆయుధాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించరాదని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా ఆయుధాలను ప్రదర్శించడం, బెదిరింపులకు ఉపయోగించడం లేదా నిర్లక్ష్యంగా నిర్వహించడం వంటి చర్యలను పోలీసు శాఖ సహించదని,అలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గన్ లైసెన్స్ గడువును ఎప్పటికప్పుడు పరిశీలించి గడువు ముగియకముందే తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని, గడువు ముగిసిన లైసెన్స్‌తో ఆయుధాన్ని కలిగి ఉండటం కూడా చట్టరీత్యా నేరమని తెలిపారు.ఆయుధాలను ఎల్లప్పుడూ భద్రమైన ప్రదేశంలో ఉంచి, అనుమతి లేని వ్యక్తుల చేతికి చేరకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.లైసెన్స్ హోల్డర్ మరణించిన వెంటనే కుటుంబ సభ్యులు లేదా వారసులు సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా జిల్లా పోలీసు కార్యాలయానికి సమాచారం అందించి ఆయుధాన్ని వెంటనే పోలీసుల వద్ద డిపాజిట్ చేయాలని, అనంతరం చట్టబద్ధమైన విధానంలో గన్ లైసెన్స్ రద్దు లేదా వారసత్వ బదిలీ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇలాంటి కేసులను గుర్తించి లైసెన్స్ రద్దు ప్రక్రియను



వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.చట్టాన్ని గౌరవించే ప్రతి గన్ లైసెన్స్ హోల్డర్ పోలీసు శాఖకు బాధ్యతాయుత భాగస్వామిగా ఉంటూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలని, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్, వనపర్తి సీఐ సుగంధ రత్నం, కొత్తకోట సీఐ రాంబాబు, ఆత్మకూర్ సీఐ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, డీసీఆర్‌బీ ఎస్సై తిరుపతిరెడ్డి, జిల్లాలోని ఎస్సైలు, గన్ లైసెన్స్ హోల్డర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిరంతరం విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం


- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు, జూలై 28 (జనంసాక్షి) :** ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా, నిర్వహణ, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.గ్రామాల్లో, పట్టణాల్లో విద్యుత్ అంతరాయాలు తగ్గించే చర్యలు చేపట్టడంతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.వ్యవసాయ అవసరాల కోసం రైతులకు నిర్ణీత సమయాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం ప్రజలకు



మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందని, అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలి.గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలకు ప్రమాదకరంగా మారిన లూజు విద్యుత్ వైర్లను గుర్తించి పకడ్బందీగా సరిచేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని సబ్‌స్టేషన్లను అవసరమైన మరమ్మతులు చేపట్టి, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న విద్యుత్ కనెక్షన్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రైతులు రూ.9,100 ప్రభుత్వానికి చెల్లిస్తే ఒక కిలోమీటరు వరకు విద్యుత్ వైరు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ఈ పథకాన్ని అర్హులైన రైతులు వినియోగించుకోవాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, విద్యుత్ అంతరాయాలు మరియు అత్యవసర సమస్యలపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు.అదేవిధంగా, విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 132 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమీక్ష సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్.ఈ రవి ప్రసాద్ , డిఈ సూర్య నాయక్ , ఎడి శంకర్ నాయక్, అన్ని మండలాల ఎఈలు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, కౌన్సిలర్ లు, నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పత్రాలను వెంటనే అందించాలి



**సికింద్రాబాద్, జూలై 28 (జనంసాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించిన ఫారమ్‌లను త్వరగా పూర్తి చేసి వెంటనే తిరిగి అందజేయాలని బిజెపి మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి, కంటెస్టెంట్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, డివిజన్ పర్యవేక్షకుడు నెమలి నందు విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని మెట్టుగూడ డివిజన్ పరిది సారంగపాణి మంగళవారం పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల నమోదు, మార్పుల ప్రక్రియకు సంబంధించిన గడువు త్వరలోనే ముగుస్తున్నందున ప్రజలు ఆలస్యం చేయకుండా దరఖాస్తు పత్రాలను అందజేయాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. జాబితా నుంచి దొంగ ఓట్లను, మరణించిన వారి పేర్లను తక్షణమే తొలగించాలని, బదిలీ అయిన ఓటర్ల వివరాలను పక్కాగా సరిచూసుకోవాలని ఆయన అధికారులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్ కుమార్ ముదిరాజ్, సీనియర్ నాయకుడు ఆర్కోట్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



**తాండూరు, జూలై 28 (జనంసాక్షి) :** రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాండూరు మండలం అంతారం రైతువేదికలో రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో రైతులను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడారు.మంత్రి తో ఎమ్మెల్యే మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గంలోని వ్యవసాయ పరిస్థితులు, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు, రైతుల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి వినియోగాన్ని తగ్గించే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.తక్కువ నీటితో అధిక దిగుబడులు అందించే పంటలను సాగు చేయడం ద్వారా సాగు ఖర్చులు తగ్గి, రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని రైతులకు మంత్రి, ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆదర్శ రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మీ వెంకటయ్య , ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి , మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి , డిఎఓ కవిత , ఎడిఎ అరుణ , ఎఓ కొమరయ్య, మండల పార్టీ అధ్యక్షుడు రాజ్ కుమార్ , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ,ఎఈఓ సుమ, రైతులు పాల్గొన్నారు.

## హెల్త్ కార్డులు, ఆసుపత్రుల జాబితా విడుదల చేయాలి

- ఆరోగ్య పథకం అమలులో జాప్యంపై తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ ఆగ్రహం
- ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన హెచ్చరిక
- ఆగస్టు 7న పెన్షనర్ల జేఏసీ మహాధర్నాకు నిర్ణయం




**ముషీరాబాద్, జూలై 28 (జనం సాక్షి) :** ఆరోగ్య పథకం (జుఎజు) అమలులో తీవ్ర జాప్యం, హెల్త్ కార్డుల జారీ ఆలస్యం, ఆసుపత్రుల జాబితా, మార్గదర్శకాల విడుదలలో నిర్లక్ష్యంపై తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వం ఆగస్టు 6లోగా సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 7న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద రాష్ట్రవ్యాప్తంగా మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ జేఏసీ చైర్మన్ కె. లక్ష్మయ్య అధ్యక్షతన ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సెక్రటరీ జనరల్ తులసి సత్యనారాయణ వార్షిక నివేదికను, కృష్ణప్రసాద్ ఆర్థిక నివేదికను సమర్పించారు. సమావేశంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రభుత్వం జుఎజు పథకం అమలుకు అగ్రిమెంట్లు జరిగాయని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఒక్క ఆసుపత్రిలో కూడా పెన్షనర్లకు వైద్యసేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ కార్డులు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం వెబ్‌సైట్‌ను నిలిపివేసి కాలయాపన చేస్తోందని, ట్రస్టు బోర్డు సభ్యులు కూడా స్పందించడం లేదని విమర్శించారు. దీంతో వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చర్చలో కోర్ కమిటీ సభ్యులు భరత్‌రెడ్డి, రాజేంద్రబాబు, పుల్లయ్య, జనార్దన్ భట్, డా. పిచ్చయ్య, దేవేందర్, నరసింహస్వామి, ఓం ప్రకాశ్, అనిల్, పెద్ది రమేష్, డా. విరేశం, మనోహర్ రెడ్డి, మానయ్య, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. హెల్త్ కార్డుల జారీ, వైద్యసేవల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కొందరు పెన్షనర్ల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి




**అల్లాదుర్గం, జూలై 28 (జనంసాక్షి) :** రోడ్డు భద్రతా నియమాలు పాటించాలనీ ఏసిపి శంకర్ రాజు అన్నారు. అల్లాదుర్గ్ మండల పరిధిలోని ముస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "అరైవ్ అలైవ్" ట్రాఫిక్ అవగాహన కార్యక్రమానికి మల్కాజిగిరి కమిషనరేట్ తిరుమలగిరి ట్రాఫిక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి శంకర్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. విద్యార్థులు ఫుట్‌పాత్‌లపై నడవడం, జీబ్రా క్రాసింగ్‌ల ద్వారా మాత్రమే రోడ్లు దాటడం, ట్రాఫిక్ సంకేతాలను పాటించడం, రోడ్లపై అప్రమత్తంగా ఉండలన్నారు. చట్టబద్ధమైన వయస్సు రాకముందు వాహనాలు నడపకూడదని సూచించారు. అదేవిధంగా తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించేలా, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్ట్ వినియోగించేలా, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకుండా, మద్యం సేవించి వాహనాలు నడపకుండా అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ సేఫ్టీ అంబాసిడర్ గా మారి కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు సమాజంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం ఐక్య పోరాటమే లక్ష్యం

**తెలకపల్లి, జూలై 28 (జనం సాక్షి) :** జర్నలిస్టులకు రావాల్సిన హక్కులు, సంక్షేమ పథకాల సాధన కోసం అలుపెరగని పోరాటం చేయాలని, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి జి. మధు గౌడ్ మంగళవారం పిలుపునిచ్చారు. యూనియన్ ఏ రాజకీయ పార్టీకి అనుకూలం గానీ, ప్రతికూలం గానీ కాదని, జర్నలిస్టుల ప్రయోజనాల పరిరక్షణే సంఘం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శివగంగ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నాగర్‌కర్నూల్ జిల్లా ఐజేయూ ఐదవ కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు పి. విజయకుమార్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి జి. మధు గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కే. నాగరాజ్ గౌడ్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు మాధవరావు సిందే, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు సుదర్శన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఆర్. సురేష్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జి. మధు గౌడ్ మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లాలో యూనియన్ బలోపేతం కావడంతో కొందరు విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి కుట్రలను సభ్యులు అప్రమత్తంగా తిప్పికొట్టాలని సూచించారు. జిల్లాలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్‌పాస్‌లు,




హెల్త్ కార్డులు, అక్రిడేషన్ సమస్యల పరిష్కారం కోసం యూనియన్ దశలవారీగా ఉద్యమాలు చేపడుతుందని తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో అక్రిడేషన్ కమిటీల ఏర్పాటు పూర్తయ్యే అవకాశం ఉందని, ఆగస్టు 15 లేదా 20 నాటికి హెల్త్ కార్డులపై ప్రభుత్వం ప్రకటన చేసే అవకాశముందని చెప్పారు. ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు వన్ బై థర్డ్ బస్‌పాస్‌ల ప్రక్రియ కూడా తుది దశలో ఉందన్నారు. యూనియన్, ప్రెస్ అకాడమీ, ప్రభుత్వం వేర్వేరు వ్యవస్థలని, వాటిని ఒకేలా చూపించి అపోహలు సృష్టించే ప్రయత్నాలను సభ్యులు ఖండించాలని పిలుపునిచ్చారు. యూనియన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కార్యవర్గం తీర్మానం చేసింది. జిల్లా అధ్యక్షుడు పి. విజయకుమార్ మాట్లాడుతూ, గత ఏడాదిలో జర్నలిస్టుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు జిల్లా కమిటీ కృషి చేసిందన్నారు. జిల్లా కార్యదర్శి ఆర్. సురేష్ కుమార్ గత సమావేశ నిర్ణయాల అమలుపై నివేదిక సమర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ముబిన్ ఖాన్ అక్రిడేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకురాగా, ప్రతి అర్హత కలిగిన జర్నలిస్టుకు అక్రిడేషన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్యదర్శి హామీ ఇచ్చారు. ఈ అంశంపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయాలని, మూడో అక్రిడేషన్ కమిటీ సమావేశాన్ని త్వరగా నిర్వహించాలని సూచించారు. విశిష్ట అతిథులు కే. నాగరాజ్ గౌడ్, మాధవరావు సిందే మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా జర్నలిస్టుల హక్కుల సాధన కోసం చేపడుతున్న ఉద్యమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులంతా ఐక్యంగా, సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కేసులు తప్పవు

- రౌడీ షీటర్లకు డిఎస్పి కౌన్సిలింగ్, హెచ్చరిక



**న్యాల్‌కల్, జూలై 28 (జనం సాక్షి) :** శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ఉపేక్షించేది లేదని, ఎట్టి పరిస్థితుల్లో కేసులు తప్పవని జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్ రౌడీ షీటర్లకు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశం మేరకు న్యాల్ కల్ మండలం, హద్నూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పలువురు రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరించారు. జహీరాబాద్ రూరల్ పరిధిలోని హద్నూర్, రాయి కోడ్, ఝరాసంగం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలువురు రౌడీ షీటర్లకు.. న్యాల్ కల్ మండలంలోని హద్నూర్ స్టేషన్ లో డిఎస్పి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇతర మతస్తులకు కించపరచడం, మత విద్వేషాలు, అసాంఘిక కార్యక్రమాలు, భూతగాదాలు, చోరీలు, మద్యం మత్తులో ఇష్టారీతిగా వ్యవహరించడం, తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, కేసులు తప్పవని డిఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక సీఐ జక్కుల హనుమంతు, ఎస్సై సుజిత్, తదితరులు హాజరయ్యారు.

జనంసాక్షి www.janamsakshi.org | బుధవారం 29 జూలై 2026

# నల్లమల్ల నిర్వాసితులకు అన్ని వసతులతో పునరావాసం కల్పించాలి

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జూలై 28 (జనంసాక్షి) :** అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని నల్లమల్ల రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో నివసిస్తున్న నిర్వాసిత కుటుంబాలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పునరావాస కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తొలి విడతలో నల్లమల్ల అటవీ ప్రాంతం నుంచి తరలించనున్న ఐదు గ్రామాలకు చెందిన 257 కుటుంబాల కోసం పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామ సమీపంలో ఏర్పాటు చేయనున్న రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్ (ఆర్ అండ్ ఆర్) కాలనీ అభివృద్ధి పనులపై సోమవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ (డీఎంసీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పునరావాసానికి సంబంధించిన అన్ని శాఖల అధికారులు పాల్గొని ఇప్పటివరకు అభివృద్ధి పనులకు అంచనాల ప్రతిపాదనలు , పనుల నిర్వహణ, భవిష్యత్ కార్యాచరణపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సవివరంగా చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నల్లమల్ల అటవీ ప్రాంతం నుంచి పునరావాసం పొందుతున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అన్ని మౌలిక వసతులతో కూడిన గృహాన్ని అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. ఇందుకోసం బాచారం వద్ద గుర్తించిన స్థలంలో నిర్మించనున్న 257 గృహాల పనులను ఎలాంటి జాప్యం లేకుండా ప్రారంభించాలని స్పష్టం చేశారు. టెండర్ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేసి అర్హత కలిగిన నిర్మాణ సంస్థను ఎంపిక చేయాలని, నిర్ణీత గడువులో నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా అన్ని ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. నిర్వాసిత కుటుంబాల



జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ భూముల కేటాయింపును కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. లింగాల, పెద్దకొత్తపల్లి మండలాల పరిధిలో అటవీ శాఖ నుంచి రెవెన్యూ శాఖకు బదిలీ చేసిన భూములను వెంటనే రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసేలా సి సి ఎల్ ఏ కు ప్రతిపాదనలు పంపి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఐదు ఎకరాల వ్యవసాయ భూమితో పాటు 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించి, ఇంటి నంబర్లు, సర్వే నంబర్లతో కూడిన పూర్తి పత్రాలను ఈ ఏడాది ఆగస్టు 10వ తేదీలోగా అందించేలా రెవెన్యూ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూముల కేటాయింపు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. బాచారం వద్ద ఏర్పాటు చేస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీలో నివసించనున్న కుటుంబాలకు అవసరమైన మౌలిక వసతులను సమగ్రంగా కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాలనీకి విద్యుత్ సరఫరా కల్పించేందుకు అవసరమైన అనుమతులు ఇప్పటికే మంజూరైనట్లు సమావేశంలో అధికారులకు వివరించగా, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి, ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ మూత్రశాలల నిర్మాణానికి జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో పరిపాలనా అనుమతులు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. బాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలో రహదారులు, తాగునీటి సరఫరా, విద్యుత్ పంపిణీ, పారిశుద్ధ్య సదుపాయాలు, డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రోడ్లు, వీధి దీపాలు, కమ్యూనిటీ అవసరాలకు సంబంధించిన మౌలిక వసతుల కోసం కృషి కల్పనపై ఆయా శాఖల వారీగా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. నిర్వాసిత కుటుంబాలు కొత్త ప్రాంతానికి వెళ్లిన తర్వాత ఎలాంటి అసౌకర్యం ఎదురుకాకుండా అన్ని సదుపాయాలు ముందుగానే సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పునరావాస కార్యక్రమం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య అంశమని జిల్లా కలెక్టర్ చెప్పారు. ప్రతి శాఖ తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. పనుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించి ప్రాజెక్టు అమలులో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ఈ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో కన్వీనర్ జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, రెవెన్యూ అదనపు కలెక్టర్ బి. చిన్నయ్య, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జూరాల ఎడమ కాలువ ద్వారా రైతులకు సాగునీటిని విడుదల చేయాలి

- బిఆర్ఎస్ మాజీ జెడ్పిటిసి రాజేంద్ర సింగ్



**అమరచింత, జూలై 28 (జనం సాక్షి) :** మండలంలోని జూరాల ప్రాజెక్టు లోకి భారీ వరద రావడంతో రైతుల కు ఎడమ కాలువ నుండి నీటిని విడుదల చేయాలని మంగళవారం నాడు బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ జెడ్పిటిసి రాజేందర్ సింగ్ మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి నర్వ అమరచింత ఆత్మకూర్ రైతుల ప్రయోజనాల కంటే కొడంగల్ ప్రయోజనాలే ముఖ్యమా జూరాల ప్రాజెక్టుకు 54.200 క్యూసెక్కుల ఇన్ఫ్లో నమోదవుతున్న మోటార్లను ఎందుకు ప్రారంభించలేదు. ప్రభుత్వం సమాధానం చెప్పాలి. తక్షణమే బీమా– 1 లోని భూత్పూర్ 1. 3 టిఎంసి సంగం బండ 3.3 టిఎంసి రిజర్వాయర్లను నింపేందుకు వెంటనే మోటార్లను ప్రారంభించాలని అలాగే జూరాల ఎడమ కాలువ ద్వారా సాగునీరు రైతులకు అందించాలని కోరుతూ టిఆర్ఎస్ పార్టీ పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి మేము డిమాండ్ చేస్తున్నాం. లేదంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర సింగ్. నరసింహులు గౌడ్. చిన్న బాలరాజు. జయసింహారెడ్డి. నాగభూషణం గౌడ్. షాన్వాజ్ ఖాన్. గోపాల్ నాయక్.బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి శుద్ధికరణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి



**నాగర్‌కర్నూల్, జూలై 28 (జనంసాక్షి) :** ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వాటర్ ప్లాంట్ల యజమానులు తాగునీటి శుద్ధీకరణ ప్రక్రియలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం నాడు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలో ఉన్న వాటర్ ప్లాంట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వాటర్ ప్లాంట్ల యజమానులు తాగునీటి శుద్ధీకరణ ప్రక్రియలో అన్ని నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నీటి ఫిల్టరేషన్ యంత్రాలు సక్రమంగా పనిచేసేలా నిరంతరం నిర్వహణ చేపట్టడంతో పాటు, ఫిల్టర్లు నిర్ణీత వ్యవధిలో మార్చడం, నీటి నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించడం మరియు పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయాలని అన్నారు. ప్రజలకు నాణ్యత లేని లేదా కలుషితమైన తాగునీటిని సరఫరా చేయడం ఏ పరిస్థితుల్లోనూ సహించబడదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి నాణ్యత లేని నీటిని సరఫరా చేసినట్లు గుర్తించినట్లయితే, సంబంధిత వాటర్ ప్లాంట్ యజమానులపై చట్టప్రకారం తగిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. నెల రోజుల లోపల మరోసారి నీటి నాణ్యత పరిక్షలు జరిపి ప్రమాణాలు పాటించని వారిపై తగు చర్యలు తీసుకోనబడునని తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**కోడేర్/నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జూలై 28 (జనంసాక్షి) :** ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు సమర్థవంతంగా, నాణ్యతతో అందేలా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. మంగళవారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని కోడేరు మండల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలు, మందుల లభ్యత, ప్రసూతి సేవలు, ల్యాబ్ సేవలు, పరిశుభ్రత, సిబ్బంది పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, ఔషధాల కొరత కారణంగా ఎవరూ ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా అంచనా వేసి అవసరమైతే ఉన్నత వైద్య కేంద్రాలకు సకాలంలో రిఫర్ చేయాలని సూచించారు. ప్రసూతి సేవలపై ప్రత్యేకంగా ఆరా తీసిన కలెక్టర్‌కు, ఆసుపత్రిలో రెగ్యులర్ స్టాఫ్ నర్స్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యాధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, డీఎంహెచ్‌వోతో చర్చించి రెగ్యులర్ స్టాఫ్ నర్స్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఫార్మసీ, ల్యాబొరేటరీ, వార్డులు, ఔషధ నిల్వ గదులు, ఆసుపత్రి ఆవరణను పరిశీలించి పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా సేవాభావంతో పనిచేయాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్**

ఆసుపత్రి తనిఖీకి ముందు కోడేరు మండలంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎలికంటి లక్ష్మి (భర్త: మహేష్) నిర్మించుకుంటున్న ఇంటిని



సందర్శించి పనుల స్థితిని తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్దేశిత గడువులోగా గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్, ఎంపీడీవో విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రాజు, సంబంధిత శాఖల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన యూనిఫామ్‌లు గడువులోగా అందించాలి

- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**కోడేర్ / నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జూలై 28 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీ), మోడల్ స్కూల్‌లు, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన యూనిఫామ్‌లు సరైన కొలతలతో, నిర్దేశిత గడువులో అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కోడేరు మండల కేంద్రంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిఫామ్ స్టిచ్చింగ్ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, క్లాత్ కటింగ్, కుట్టు నాణ్యత, పనుల పురోగతి, కొలతల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత కొలతలకు అనుగుణంగా యూనిఫామ్‌లు కుట్టాలని, వేగంతో పాటు నాణ్యతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని టైలర్లకు సూచించారు. కోడేరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల విద్యాలయాల్లోని విద్యార్థులకు 15 మంది మహిళా సంఘాల టైలర్లు యూనిఫామ్‌లు కుట్టుతున్నారని అధికారులు వివరించారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. మూడు గురుకుల విద్యాలయాల విద్యార్థులకు వచ్చే వారం రోజుల్లో రెండు జతల యూనిఫామ్‌లు అందించాలని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆగస్టు 15లోపు ఒక జత, ఆగస్టు నెలాఖరులోగా రెండో జత యూనిఫామ్‌లు పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. ఇప్పటికే కేజీబీవీ విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్‌లు పంపిణీ చేసిన మహిళా సంఘాల సభ్యులు, టైలర్లను అభినందించారు. కలెక్టర్ వెంట అదనపు డీఆర్‌డీఏ అధికారి రాజేశ్వరి, డీపీఎం కృష్ణ, ఏపీఎం సంతోష్, గౌస్, మండల స్థాయి అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, టైలర్లు పాల్గొన్నారు.

# గజరం దొడ్డి బ్రిడ్జి కమ్ బారేజ్ పనుల్లో వేగం పెంచాలి

- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



**మక్తల్, జూలై 28 (జనంసాక్షి) :** గజరం దొడ్డి రోడ్డు కమ్ బ్రిడ్జి కమ్ బారేజ్ నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. మంగళవారం మక్తల్ మండలంలోని చిట్యాల గ్రామం వద్ద వాగుపై రూ.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న చిట్యాల--గజరం దొడ్డి బ్రిడ్జి కమ్ బారేజ్ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులను అడిగి పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసి వంతెనను వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లు, ఇంజినీర్లకు సూచించారు. దశాబ్దాలుగా గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా చిట్యాల నుంచి గజరం దొడ్డి, మందిపల్లి, కొల్పూరు, ముడుమాల్ తదితర గ్రామాలకు వెళ్లే ప్రజలు వాగు కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి తెలిపారు. వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవని, రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లలేక ఇబ్బందులు పడాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా ప్రభుత్వం చిట్యాల – గజరం దొడ్డి రోడ్డు కమ్ బారేజ్ నిర్మాణానికి రూ.20 కోట్లు కేటాయించిందని తెలిపారు. పనుల్లో మరింత వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే రైతులతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు చిట్యాల, గజరం దొడ్డి మీదుగా కర్ణాటకలోని రాయచూరుకు సులభంగా వెళ్లే అవకాశం కలుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిట్యాల గ్రామ సర్పంచ్ రహమత్ పాషా, నాయకులు ఆనంద్ గౌడ్, శివరాం రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# షెడ్యూల్ కులాల వసతి గృహాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

- బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు సిరిసాల సాయినాథ్



**ఖిల్లా ఘనపురం, జూలై 28 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ షెడ్యూల్ కులాల వసతి గృహాన్ని మంగళవారం బిజెవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు బిజెపి మండల నాయకులతో కలిసి సందర్శించి వసతి గదులను పరిశీలించడం జరిగింది విద్యార్థులను వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు అనంతరం విలేకరులతో రాష్ట్ర నాయకులు సిరిసాల సాయినాథ్ మాట్లాడుతూ హరిజన విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకింత చులకన విద్యార్థుల వసతి గృహాలలో విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ ఉంటున్నారని వారు ఉంటున్న గదుల పై కప్పు పెచ్చులు విద్యార్థులపై పడుతున్నాయి పూర్తి శిథిలావస్థకు చేరిన ఈ వసతి భవనాన్ని వెంటనే కూల్చి వేసి నూతన భవనాన్ని బ్రభుత్వం నిర్మించాలి నీ డిమాండ్ చేశారు , ఎస్సీ కుల వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నామని చెప్పడం కేవలం మాటలకే తప్ప చేతలలో వారికి చేస్తున్నది శూన్యమని ఎప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఈ షెడ్యూల్ కులాల వసతి గృహ మును వెంటనే పరిశీలించాలి ఆశ్రమ పాఠశాల విద్యార్థుల వారి భవిష్యత్తుకు బరోసా కల్పించాలని లేదంటే మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలతో రోడ్డు పైకి రావాల్సి వస్తుందని అన్నారు. అనంతరం వసతి గృహ వంటశాలను పరిశీలించి విద్యార్థులకు భోజనం వడ్డించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. సాయినాథ్ వెంట పార్టీ మండల అధ్యక్షులు బుచ్చి బాబు గౌడ్,కార్యదర్శి గోపాల్,దళిత మార్చ నాయకులు శివ శంకర్,గోపాల్,షాపూర్ బలంజనేయులు గౌడ్, ఓబీసీ మార్చ మండల అధ్యక్షుడు రామచంద్రీ,సత్యనారాయణ,నడిమింటి శ్రీనివాసులు,వెంకటేష్, వినోద్,అనిల్,బెస్త నరసింహ, వార్డెన్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- పాఠశాలల్లో 100 శాతం హాజరు సాధించేలా చర్యలు చేపట్టాలి
- ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి 100 శాతం డిజిటైజేషన్ పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, జూలై 28 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. మంగళవారం గద్వాల మండలంలోని చెనుగొనిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల ఆవరణ, తరగతి గదులు,పారిశుద్ధ్య పనులు,మౌలిక సదుపాయాలను అయన పరిశీలించారు. అనంతరం పాఠశాల సిబ్బందితో మాట్లాడి విద్యార్థుల హాజరు, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాలుగో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించారు. అలాగే విద్యార్థులతో మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, ఇతర మౌలిక సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యాబోధన అందించి అభ్యాసన సామర్థ్యాలను మరింత మెరుగుపరచాలన్నారు. ప్రతి విద్యార్థి



ప్రతిరోజూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వంద శాతం ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రతిరోజూ నిర్ణీత సమయానికి నాణ్యమైన,పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం అందించాలని,ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందించే యూనిఫాంలు,ఇతర సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని సూచించారు. పాఠశాల ఆవరణ,తరగతి గదులు,మరుగుదొడ్లు, తాగు నీటి ప్రాంతాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, పరిశుభ్రత,చదువుపై ఆసక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులతో నిరంతరం సమన్వయం కొనసాగించి విద్యార్థుల హాజరు,విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఓటరు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను వేగవంతం చేసి,నిర్ణీత గడువులోగా వంద శాతం డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన ఎస్ఐఆర్ పనులను పరిశీలించి,బీఎల్ఓలు, సంబంధిత అధికారులతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, డిజిటైజేషన్, ఇంటింటి సర్వే పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా ప్రతి అర్హుడి వివరాలను నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి ఎలాంటి లోపాలు, నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీఎల్ఓలు పూర్తి బాధ్యతతో వారి నుంచి సరైన సమాచారాన్ని సేకరించి ఫారాలను పూర్తిగా నింపి వెంటనే డిజిటైజేషన్ కోసం అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సానుకూల సహకారం అందించాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా మిస్ కాకుండా బీఎల్ఓలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికృష్ణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు,బిఎల్ఓలు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి ఏరియాకు ఉజ్వల భవిష్యత్తు

- భద్రతే విజయానికి మూలం..
- సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి ఏరియాకు తాడిచెర్ల బ్లాక్-2, పీవీఎన్ఆర్ ప్రాజెక్టులతో మరింత ఉజ్వల భవిష్యత్తు ఉందని ఏరియా జనరల్ మేనేజర్ ఏ. రాజేశ్వర్ రెడ్డి అన్నారు. భద్రతే విజయానికి మూలమని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి మరిన్ని అవార్డులు సాధించాలని ఉద్యోగులను కోరారు. మంగళవారం సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 ఇన్‌క్లైన్‌ను మొదటి షిఫ్ట్ ప్రారంభానికి ముందు ఆయన సందర్శించారు. ఇటీవల నిర్వహించిన 56వ వార్షిక భద్రతా పక్షోత్సవం-2025లో గ్రూప్-2 గనుల విభాగంలో కేటీకే-5 ఇన్‌క్లైన్ ఓవరాల్ ఫస్ట్ ప్రైజ్ సాధించడం పట్ల అధికారులను, ఉద్యోగులను, సిబ్బందిని జీఎం అభినందించారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు వెనుక ప్రతి ఉద్యోగి చూపిన అప్రమత్తత, భద్రతా నిబంధనల పట్ల అంకితభావం, సమిష్టి కృషి ఉందని పేర్కొన్నారు. గనుల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వడం వల్లే ఇటువంటి విజయాలు సాధ్యమవుతున్నాయని చెప్పారు. ఇదే క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరు, జట్టు స్ఫూర్తితో భవిష్యత్తులోనూ మరిన్ని భద్రతా అవార్డులు సాధించి కేటీకే-5 ఇన్‌క్లైన్‌తో పాటు భూపాలపల్లి ఏరియాకు, సింగరేణి సంస్థకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఉద్యోగులను ప్రోత్సహించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాల సహకారంతో తాడిచెర్ల బ్లాక్-2 సింగరేణికి కేటాయించడం సంస్థ అభివృద్ధికి కీలకమైన ముందడుగని తెలిపారు. అలాగే పీవీఎన్ఆర్ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అనుమతులు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. ఈ రెండు ప్రాజెక్టులు కార్యరూపం దాల్చిన తర్వాత భూపాలపల్లి ఏరియాలో బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరిగి సంస్థ ఉత్పాదకత బలోపేతం అవుతుందని చెప్పారు. భవిష్యత్తులో భూపాలపల్లి ఏరియా మరింత అభివృద్ధి చెంది సింగరేణిలో కీలక ఉత్పత్తి కేంద్రంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలని, ప్రమాదరహిత గనుల నిర్వహణే సంస్థ అభివృద్ధికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ మాచర్ల రమేష్, సేఫ్టీ ఆఫీసర్ పి. అభిషేక్, పిట్ ఇంజనీర్ శ్రీకాంత్, వెంటిలేషన్ ఆఫీసర్ రమేష్, వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు రాజేందర్, గట్టురాజు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

## డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల ప్రవేశాలు ప్రారంభం



**హనుమకొండ ప్రతినిధి, జూలై 28 (జనం సాక్షి) :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026-27 విద్యా సంవత్సరానికి బిఏ, బికాం, బిఎస్సి డిగ్రీ కోర్సుల ప్రవేశాలు ప్రారంభమైనట్లు వరంగల్ ప్రాంతీయ సంచాలకులు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్మీడియట్, 10౦2 అర్హత కలిగిన విద్యార్థులతో పాటు రెండేళ్ల పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ప్రవేశాల కోసం ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో సమీప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రవేశాలకు ఆగస్టు 7 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. అభ్యర్థులు www.braouonline.in వెబ్‌సైట్‌లో ప్రవేశ నమోదు పూర్తి చేసి, తాము ఎంపిక చేసుకున్న అధ్యయన కేంద్రంలో సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800-599-0101, ఫోన్ నంబర్లు 040-23680333, 040-23680444, 040-23680555లను సంప్రదించాలని ప్రొఫెసర్ సుంకరి జ్యోతి కోరారు.

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ, ఎమ్మెల్యే వినతి



**హనుమకొండ ప్రతినిధి జూలై 28 (జనం సాక్షి) :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కీలక రహదారి అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడంతో పాటు జాతీయ రహదారిపై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరుతూ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి మంగళవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాలోని కరుణాపురం నుండి పెద్ద పెండ్యాల, నర్సింగరావుపల్లి, ఎలుకుర్తి, ధర్మసాగర్ మండల హెడ్‌క్వార్టర్, దేవునూర్, సోమ దేవరపల్లి, దామెర, ఎల్కతుర్తి మండల హెడ్‌క్వార్టర్ వరకు ఉన్న రోడ్డును విస్తరించి బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఈ రోడ్డు హైదరాబాద్ నుండి కరీంనగర్, సిద్ధిపేటకు వెళ్లే వాహనాలు వరంగల్ వెళ్లే అవసరం లేకుండా 163, 563 జాతీయ రహదారులను అనుసంధానించే కీలక మార్గమని, వేలాది మంది ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపార వర్గాలు నిత్యం వినియోగిస్తున్నారని వివరించారు. నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, ఘన్‌పూర్ స్టేషన్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు ఉన్నప్పటికీ వాటి మధ్య అనుసంధానం లేకపోవడంతో స్థానిక ప్రజలు ప్రధాన రహదారినే వినియోగించాల్సి వస్తోందని తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల దీర్ఘకాలిక అవసరాలకు సంబంధించిన ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన ఆమోదం తెలపాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. వినతులను సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

## భూగర్భ జల నీటిమట్టాన్ని పెంపొందించే చర్యలు చేపట్టండి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 28(జనంసాక్షి):** జిల్లాలో ఎల్ నినో ప్రభావం కారణంగా లోటు వర్షపాతం ఉందని, భూగర్భ జలానికి మట్టాన్ని పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం వంజరి రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు తో కలిసి హాజరై సెర్ప్ ఎ పి ఎం లు, సి సి లు, వి ఓ లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ నీటి మట్టాన్ని పెంపొందించేందుకు సామాజిక ఇంకుడు గుంతలు, ఫారం పాండ్, నీటి కుంటలు, పంట కుంటలు, ఊట కుంటల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన జలసిరి క్రింద వి బి జి రామ్ జి పథకం ద్వారా భూగర్భ జల నీటిమట్టాన్ని పెంపొందించే విధంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలో ఇంకించాలని, ఆ దిశగా స్వయం సహాయక సంఘాల సభ్యులు భాగస్వామ్యులు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కరువు పరిస్థితులను ఎదుర్కోవాలంటే భూమి నీటిమట్టాన్ని పెంచడమే మార్గమని, వి బి జి రామ్ జి పథకం ద్వారా అర్హులైన కూలీలకు 125 రోజుల పని దినాలు కల్పించాలని తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు 2 జతల ఏకరూప దుస్తులు ఆగస్టు 15వ తేదీలోగా అందించే విధంగా కార్యాచరణ రూపొందించాలని, కుట్టు మిషన్ల సంఖ్య పెంచాలని, ఏకరూప దుస్తులు కుట్టే పనిని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు. ప్రతి వి. ఓ. క్రింద 15 స్వయం సహాయక సంఘాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, నూతన సంఘాలు ఏర్పాటుచేసి సంఘాలలో నమోదు కాని వారిని గుర్తించి సభ్యులుగా చేర్పించాలని తెలిపారు. అంతకుముందు రైతు వేదిక ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, డి.పి.ఎం.లు, ఎ.పి.ఎం.లు, సి.సి.లు, వి.ఓ.ఎ.లు పాల్గొన్నారు.

# ప్రకృతి బీభత్సం..



- నేలకూలిన వందలాది భారీ వృక్షాలు!
- అస్తవ్యస్తమైన రవాణా వ్యవస్థ
- నిలిచిపోయిన రాకపోకలు

**మంగపేట జూలై 28(జనంసాక్షి) :** ములుగు జిల్లాను ప్రకృతి మరోసారి విలయతాండవం సృష్టించింది. ములుగు జిల్లా మంగపేట మండలం నుండి కోమటిపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారి ప్రాంతంలో మంగళవారం సాయంత్రం ఊహించని తీరుతో ప్రకృతి విలయం సంభవించింది. క్షణాల వ్యవధిలో చెలరేగిన రాకాసి గాలులు భయానక వాతావరణాన్ని సృష్టించాయి. కొమటపల్లి మార్గం వైపు వెళ్లే రహదారిలో టోర్నడో తరహాలో ఎగసిపడిన ఈ సుడిగాలుల తీవ్రతకు ఏకంగా 2నుండి 3 కిలోమీటర్ల పరిధిలోని వందలాది భారీ వృక్షాలు పేకమేడల మాదిరిగా నేలకొరిగాయి. ఒక్కసారిగా బలంగా వీచిన రాక్షస గాలులతో చెట్లు గాలిలో లేచిపడ్డాయి. ఆ శబ్దం వింటేనే గుండె ఆగిపోయినంత పనైంది అంటూ స్థానికులు ఆ భయానక క్షణాలను కంటతడి పెట్టుకుంటూ గుర్తుచేసు కుంటున్నారు. ఈ ప్రళయ సృష్టికి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వందలాది ఏళ్ల నాటి భారీ చెట్లు వేర్లతో సహా రోడ్డుపై అడ్డంగా పడిపోయాయి. దీంతో ఏజెన్సీ ప్రాంతంలోని ముఖ్య మార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అటుగా వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే అధికార యంత్రాంగం, స్థానిక పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. జెసిబీల సాయంతో రోడ్డుపై పడిన చెట్లను తొలగిస్తూ రాకపోకలను పునరుద్ధరించే ప్రయత్నం చేశారు. గత మేడారం నాటి జ్ఞాపకాలు మళ్లీ కళ్ల ముందు కదిలిన పరిస్థితి నెలకొన్నట్టు స్థానిక ప్రజలు తెలిపారు. ఈ ఘోర ప్రమాదాన్ని చూసిన స్థానికులు సరిగ్గా 2024లో మేడారం అటవీ ప్రాంతంలో సంభవించిన విలయాలను గుర్తుచేసుకుంటున్నారు. అప్పట్లో మేడారం చుట్టుపక్కల అడవుల్లో ఇదే తరహాలో వీచిన భీకర గాలులకు వేలాది చెట్లు నేలకూలిన సంగతి తెలిసిందే. సరిగ్గా అదే సీన్ ఇప్పుడు మంగపేట మండలంలో రిపీట్ కావడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వరుసగా ఇలాంటి వింత వాతావరణ మార్పులు, టోర్నడోలను తలపించే సుడిగాలులు ఏజెన్సీ ప్రాంతాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అదృష్టవశాత్తూ ఈ భారీ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం అందడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ప్రకృతి చూపుతున్న ఈ వికృత రూపం మాత్రం ప్రజలను తీవ్ర భయాందోళనలోకి నెట్టింది.



## కలెక్టరేట్ చివరి దశ సుందరీకరణ పనులను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జులై 28(జనంసాక్షి) :** నూతన కలెక్టరేట్ భవన సముదాయంలో కొనసాగుతున్న చివరి దశ సుందరీకరణ పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతన సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భవన సముదాయంలో చేపడుతున్న ల్యాండ్‌స్కేపింగ్, అంతర్గత రహదారులు, పచ్చదనం, విద్యుత్ దీపాల ఏర్పాటు, పార్కింగ్, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, ఉద్యానవన అభివృద్ధి తదితర పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు అన్ని శాఖల సేవలు ఒకే చోట మెరుగైన వాతావరణంలో అందించే విధంగా నూతన కలెక్టరేట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అన్నారు. మిగిలిన పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి, భవన సముదాయం పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, ఆర్ అండ్ బి ఈఈ శ్యామ్ సింగ్, మునిసిపాలిటీ కమిషనర్ సంపత్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించాలి

- రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని రైతులకు సూచన
- నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని పిలుపు
- తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించండి



**దేవరుప్పుల, జూలై 28 (జనం సాక్షి) :** దేవరుప్పుల రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వ్యవసాయ పరిస్థితులు, వర్షాభావం నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, ప్రభుత్వ సూచనలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల సాగులో మార్పులు చేసుకోవాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వరి పంటను విస్తృతంగా సాగు చేయకుండా, తక్కువ నీటితో మంచి దిగుబడి ఇచ్చే పెసర, కంది, మినుములు, జొన్న, వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. వచ్చే నెలలో సాధారణం కంటే మెరుగైన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోందని తెలిపారు. అయినప్పటికీ రైతులు పూర్తిగా వర్షాలపై ఆధారపడకుండా, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు అందిస్తూ, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోడీఏఓ అంబికా సోని ఏడీఏ అపర్ణ ఎంఏఓ మనోహిత్ విక్రమ్ రావు సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి ఉపసర్పంచ్ నర్రా కోమలత సోమ సుందర్ హెచ్ఓ రవికాంత్, ఏఈఓలు సాయిరాజ్ భాస్కర్ సాయికిరణ్ ఫర్టిలైజర్ షాప్ యజమానులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గణపురం రిజర్వాయర్ కాల్వల అభివృద్ధికి 31 కోట్లు మంజూరు

- 12 నెలల్లో పనులు పూర్తి చేస్తాం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గణపురం రిజర్వాయర్ పంట కాల్వల అభివృద్ధికి నాలుగు ప్రధాన కాల్వల కోసం రూ.31 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం గణపురం రైతు వేదికలో రైతు నేస్తం 100 ఎపిసోడ్స్ పూర్తయిన సందర్భంగా హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గణపురం రైతు వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంజూరైన నిధులతో పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యాక 12 నెలల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వల్ల వర్షపాతం అనిశ్చితంగా ఉందని, నీటి లభ్యతపై స్పష్టత లేని పరిస్థితిలో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నీటి ఆధారిత పంటలకు బదులు తక్కువ నీటితో పండే పెసర్లు, కందులు, కూరగాయలు సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు ప్రభావం చూపుతున్నాయని, ఈ పరిస్థితుల్లో రైతులే అనుభవంతో సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించి నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సామూహికంగా పంటలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. గతంలో మొక్కజొన్న పంటకు ప్రభుత్వం మంచి ధర కల్పించి రైతులకు లాభాలు చేకూర్చిందని, ఎకరాకు రూ.1 లక్షకు పైగా ఆదాయం వచ్చిందని తెలిపారు. బ్రోకర్ల దోపిడీని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేశామన్నారు. ఎస్ఆర్ఎస్పి ప్రాజెక్టు నీటిని దేవాదుల ద్వారా 44,000 ఎకరాలకు చేరేలా చర్యలు చేపట్టామని, గణపురం చెరువు అభివృద్ధికి కూడా ప్రత్యేక నిధులు మంజూరు చేయించామని వివరిం చారు. రెండు జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని తాగునీరు, సాగునీరు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాలు అడుగంటుతున్నందున తక్కువ నీటితో పండే పంటలు చేపట్టాలన్నారు. ఉద్యానవన పంటల్లో అంతర పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. వాతావరణ శాఖ సూచనలు పాటించాలని, పంటల ఎంపికను పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. అనంతరం రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి బాబురావు, ఏడిఏ రమేష్, తహసిల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీవో భాస్కర్, తెలంగాణ రైతు విజ్ఞాన వేదిక శాస్త్రవేత్త డా. విశ్వతేజ, సర్పంచ్, సింగిల్ విండో చైర్మన్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.



## అండర్ పాస్ కోసం శాంతినగర్‌లో రాస్తారోకో

**ఎల్కతుర్తి (జనం సాక్షి) :** ఎల్కతుర్తి మండలంలోని శాంతినగర్ ఎన్ హెచ్ 563 జాతీయ రహదారి విస్తరణ పనులలో భాగంగా శాంతినగర్ గ్రామస్తులు మంగళవారం రోజున ధర్నాకు దిగారు రోడ్డుపై బయటయించి అండర్ పాస్ వేయించి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెలంగిని మేరీ రాయప్ప మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామస్థులకు రాకపోకలకు అంతరాయం కలుగుతుందని గ్రామానికి చేరుకోవాలంటే కోతులనడుమ లేదా పెంచికల్ పెట్ కుచేరుకొని రావలసి ఉంటుందని అన్నారు అలాగే విద్యార్థులు వ్యవసాయ దారులు పంటపొలాలకు వెళ్ళే రైతులకు నానా ఇబ్బందులు పడుచూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవడం జరుగుతుందని అన్నారు ఈ ధర్నా గంట పాటు చెయ్యగా ఎక్కడి వాహనాలు అక్కడే రోడ్లపై ఆగాయి విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు తక్షణమే ధర్నాను విరమిశప చేయించినట్లు వారు తెలిపారు.

## దుంప నరసయ్యకు అంతర్జాతీయ అవార్డు..

- మహాత్మ జ్యోతిరావు పూలే పురస్కారం ప్రదానం..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గణపురం మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన దుంప నరసయ్యకు బహుజన సాహిత్య అకాడమీ అంతర్జాతీయ అవార్డు దక్కింది. బాల్యం నుండి గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 26న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన భవన్‌లో జరిగిన వెస్ట్ ఇండియా కాన్ఫరెన్స్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే ఇంటర్నేషనల్ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దుంప నరసయ్యను సభికులు అభినందించారు.

బహుజన సాహిత్య అకాడమీ చైర్మన్ నల్ల రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి వి. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ముఖ్యఅతిథులుగా తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, ఉమెన్ రైట్స్ కమిషన్ సభ్యుడు భూపతి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం. గౌతమ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల విజయకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికంటే ఐలయ్య, వివిధ రాష్ట్రాల అధ్యక్షులు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, గోవా, తెలంగాణ రాష్ట్రాల డెలిగేట్స్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
29 జూలై 2026

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

- సీసీ కెమెరాలతో నేరాలపై నిఘా పెంచాలి
- ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలి
- పెండింగ్ కేసుల పరిష్కారం వేగవంతం చేయాలి
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



**కౌడిపల్లి, జూలై 28 (జనంసాక్షి) :** ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేసి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది విధి నిర్వహణ, స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ వాటి పరిష్కార ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని కౌడిపల్లి ఎస్ఐ అమర్‌కు సూచించారు. కేసుల దర్యాప్తు, పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా సమయపాలనతో విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించిన ఎస్పీ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ప్రతిరోజూ నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా 765ఙ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ.. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఎస్పీ ప్రధాన కూడళ్లు, వ్యాపార ప్రాంతాలు, ఇతర కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి ఫిర్యాదులను వెంటనే స్వీకరించి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఆయన విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో ఎస్పీ వెంట ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సందీప్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ రంగా కృష్ణ, ఎస్ఐ అమర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కేసులు తప్పవు

- రౌడీషీటర్లకు డిఎస్పి కౌన్సిలింగ్, హెచ్చరిక



**న్యాల్‌కల్, జూలై 28 (జనం సాక్షి) :** శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ఉపేక్షించేది లేదని, ఎట్టి పరిస్థితుల్లో కేసులు తప్పవని జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్ రౌడీ షీటర్లకు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశం మేరకు న్యాల్ కల్ మండలం, హద్నూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పలువురు రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరించారు. జహీరాబాద్ రూరల్ పరిధిలోని హద్నూర్, రాయి కోడ్, ఝరాసంగం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలువురు రౌడీ షీటర్లకు.. న్యాల్ కల్ మండలంలోని హద్నూర్ స్టేషన్ లో డిఎస్పి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇతర మతస్తులకు కించపరచడం, మత విద్వేషాలు, అసాంఘిక కార్యక్రమాలు, భూతగాదాలు, చోరీలు, మద్యం మత్తులో ఇష్టారీతిగా వ్యవహరించడం, తదితర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, కేసులు తప్పవని డిఎస్పి హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక సీఐ జక్కుల హనుమంతు, ఎస్సై సుజిత్, తదితరులు హాజరయ్యారు.

## సామాజిక న్యాయమే టిఆర్ఎస్ ధ్యేయం



**కాప్రా, జూలై 28 (జనం సాక్షి) :** రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించడమే తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ ప్రధాన ధ్యేయమని టిఆర్ఎస్ మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన వేముల భవాని అన్నారు. తనపై విశ్వాసంతో టిఆర్ఎస్ మల్కాజ్గిరి పార్లమెంటు ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం కాప్రా ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ స్థాపించిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందన్నారు. సామాజిక న్యాయంలో భాగంగా ఉచిత విద్య... ఉచిత వైద్యం..రైతును రాజుగా చూడడం.. యువతకు ఉద్యోగ అవకాశాలు... అన్ని వర్గాలకు సమన్యాయం అనే అజెండాతో తెలంగాణ రక్షణ సేన పాంచజన్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. పార్టీ పదవుల్లో కూడా సామాజిక న్యాయంతో నియామకాలు చేసిన కవితమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. టిఆర్ఎస్ అధినేత్రి కవిత పాంచజన్య సూత్రాలే రానున్న రోజుల్లో ఆమెను ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని చేస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ ఉప్పల్ ఇంచార్జ్ శ్రమన్ దేవ్, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు వల్లపు శివకుమార్, టిఆర్ఎస్ నాయకులు దికొండ కవిత చీర మహేష్,పద్మ రమాదేవి, జ్యోత్స్న, పద్మజ బాలకృష్ణ విజయలక్ష్మి,వంశీ, కృష్ణ, లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో వివాదాస్పద భూముల పరిశీలన

- క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు
- అధికారులు ముందు వాస్తవాలు వివరించిన స్థానిక రైతులు
- కలెక్టర్‌కు సమగ్ర నివేదిక ఇస్తామన్న తహసీల్దార్ (డిప్యూటీ కలెక్టర్)



**దమ్మపేట, జూలై 28 (జనం సాక్షి) :** దమ్మపేట మండల కేంద్రం పరిధిలోని సర్వే నంబర్ 273/1లో ఉన్న వివాదాస్పద భూములను మంగళవారం దమ్మపేట తహసీల్దార్ (అండర్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్) రెవెన్యూ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ భూములపై యాజమాన్య హక్కులకు సంబంధించి ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందిన దరఖాస్తుల నేపథ్యంలో,ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఈ క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు.వివాదాస్పద భూమిని పరిశీలించేందుకు అధికారులు వస్తున్నారన్న సమాచారంతో దమ్మపేట మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు విచారణ ప్రదేశానికి చేరుకున్నారు. దశాబ్దాలుగా ఈ భూములను గట్ల సర్వేశ్వరరావు, మల్లా కమల,జంగాల వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్ట్ గోళ్ళ వెంకటేశ్వర్లు,గోళ్ళ సీతారావమ్మ, బొగ్గం శివ,బొగ్గం గ్రేసుమని తదితరులు సాగు చేసుకుంటున్నారని,వారే అసలైన హక్కుదారులని విచారణ అధికారుల ముందు స్థానిక రైతులు సాక్ష్యాలు చెప్పారు. ఈ సందర్భంగా సాగులో ఉన్న రైతులు సైతం తమ వద్ద ఉన్న న్యాయపరమైన ఆధారాలు, రికార్డులను అధికారులకు సమర్పించారు. క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి, రైతుల వద్ద ఉన్న పత్రాలను తీసుకున్న అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. ఈ భూమికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను,వివరాలను నమోదు చేసుకున్నామని ఆయన తెలిపారు. రైతులు అందజేసిన పత్రాలతో పాటు,ఇరువర్గాల రికార్డులను పారదర్శకంగా విచారించి జిల్లా కలెక్టర్‌కు వాస్తవాలతో కూడిన సమగ్ర నివేదికను అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల గిర్దావర్,సర్వేయర్,గ్రామ పరిపాలనా అధికారి (వీఆర్ఓ) తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తిచేసి బీఎల్‌వోలకు అందజేయాలి

- నార్సింగ్ సర్కిల్ డీసీ లక్ష్మారెడ్డి



**రాజేంద్రనగర్, జూలై 28 (జనంసాక్షి) :** ఎన్యూమరేషన్ ఫారాలు పొందిన ఓటర్లు వాటిని పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేసి ఆన్‌లైన్ డిజిటలైజేషన్ ప్రక్రియకు సహకరించాలని ఏఈఆర్ఓ నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ఆదేశించారు. మంగళవారం జిహెచ్ఎంసి నార్సింగ్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు 81 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని 1,03,615 మంది ఓటర్లలో 51,358 మంది (50.14 శాతం) ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన 52,257 మంది ఓటర్ల డిజిటలైజేషన్ కోసం జూలై 29 నుంచి ఆగస్టు 3 వరకు పోలింగ్ ఏజెంట్లు, బీఎల్‌వోలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రత్యేక కేంద్రాల్లో సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. ఎన్యూమరేషన్ ఫారాలు పొందిన ఓటర్లు వాటిని పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌వోలకు అందజేసి ఆన్‌లైన్ డిజిటలైజేషన్ ప్రక్రియకు సహకరించాలని, చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏఈఆర్ఓ, డిప్యూటీ కమిషనర్ కోరారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏఈఆర్ఓ, డిప్యూటీ కమిషనర్ కోరారు.

## కాంగ్రెస్ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ గుర్తింపు



**మల్కాజిగిరి, జూలై 28 (జనంసాక్షి) :** పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తగిన గుర్తింపు ఉంటుందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాలాజీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బిఎల్ఎ లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో పాటు పార్టీ నాయకులు, నియోజకవర్గ అబ్జర్వర్ సమీర్ కౌశల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఇప్పటికే 100 శాతం ఎస్‌ఆర్ఐ నమోదు పూర్తి చేసిన బిఎల్ఎలకు మైనంపల్లి చేతుల మీదుగా బహుమతులు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. పార్టీ కోసం శ్రమించే ప్రతి ఒక్కరినీ కాపాడుకుంటామని, వారికీ నిరంతరం ప్రోత్సాహం అందిస్తామని స్పష్టం చేశారు. ఎస్ ఆర్ ఐ నమోదులో కాస్త వెనుకబడిన బిఎల్ఎలు కూడా ఇకపై వేగంగా పనిచేసి లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. అబ్జర్వర్ సమీర్ కౌశల్ మాట్లాడుతూ. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా మల్కాజిగిరిలో మైనంపల్లి హనుమంతరావు బిఎల్ఎలకు ప్రత్యేక ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని కొనియాడారు. కష్టపడే ప్రతి ఒక్కరినీ గుండెల్లో పెట్టుకుని చూసుకునే తత్వం ఆయనదని, పార్టీలో ఎవరికీ ఎక్కువ, తక్కువ భేదాలు ఉండవని పేర్కొన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా అందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, జితేంద్ర నాథ్, మల్కాజిగిరి ఇన్‌చార్జి లక్ష్మీ కాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్ర శేఖర్, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నాయకులు బి.కె. శ్రీనివాస్, జి.ఎన్.వి. సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్ కుమార్, వినోద్ యాదవ్, సత్యమూర్తి, యూసుఫ్ భాయ్, పిట్టల నాగరాజు, శ్రీకాంత్, లక్ష్మి, రాందాస్, సంతోష్ ముదిరాజ్, రామచందర్, వెంకన్న, శ్రీరామ్ యాదవ్, సురేష్ సింగ్, అశోక్ రెడ్డి, ఆశా, సుమలత యాదవ్, పుష్పలత, ఇందిర ప్రియదర్శిని, శారద, రోజా రమణి, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్స్‌తో మహిళ మృతి

- దర్గా వద్ద ప్రార్థనలకు వెళ్లి విషాదం

**గోపాల్‌పేట, జూలై 28 (జనం సాక్షి) :** గోపాల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన చాకలి రేణుక (41) మూర్ఛ వ్యాధి (ఫిట్స్)తో బాధపడుతూ దురదృష్టవశాత్తు మృతి చెందారు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత ఆరు సంవత్సరాలుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్న రేణుక ఈ నెల 27న మధ్యాహ్నం నరసింగాపల్లి గ్రామంలోని మస్తాన్ బాబా దర్గాకు ప్రార్థనల కోసం వెళ్లారు. అదే రోజు సాయంత్రం దర్గా వైపు నడుచుకుంటూ వెళ్తుండగా అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందారు. తాడిపర్తి గ్రామానికి చెందిన బంధువు చాకలి రాములు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో, కుమారుడు చాకలి బాలాజీ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తమ తల్లి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని ఫిర్యాదుదారుడు పోలీసులకు తెలిపారు.

## నాణ్యతా ప్రమాణాలతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలి



**కోదాడ, జూలై 28 (జనం సాక్షి) :** ప్రజా సంక్షేమలో భాగంగా ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఇందులో భాగంగానే కోదాడ 100 పడకల అసుపత్రిని నిర్మిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. మంగళవారం కోదాడ ఏరియా అసుపత్రిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోదాడ 100 పడకల ఆసుపత్రిని నాణ్యతతో నిర్మించాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలలో రాజీ పడొద్దని నాణ్యతలో ఏమైనా తేడాలు ఉంటే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగులకు ఇబ్బంది కలగకుండా మెట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాల న్నారు. ఆస్పత్రికి సరిపడా పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా అన్నారు. ఆసుపత్రుల్లో గర్భిణిలకు సాధారణ ప్రసవం జరిగేలా చుడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సూర్యనారాయణ, ఆస్పత్రి సూపర్డెంట్ దశరథ నాయక్, తహసిల్దార్ సంతోష్ కిరణ్ , డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



కొడంగల్, జూలై 28 (జనం సాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం కొడంగల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే వైద్య అధికారులు అంకితభావంతో పని చేయాలని తెలిపారు. తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి దేవాలయం లాంటిదని, చిన్న చిన్న సమస్యలను అధిగమించి అభివృద్ధి చేసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే డెలివరి లలో ముందంజలో ఉన్న పేరును కాపాడుకోవాలని అన్నారు. కొడంగల్ మున్సిపల్ చైర్మెన్ ప్రశాంత్ మాట్లాడుతూ కొడంగల్ ఆసుపత్రిని సెప్టెంబర్ చివరిలోగా పూర్తి చేసి ప్రారంభించాలని అన్నారు ఆస్పత్రి కావాల్సిన సామాగ్రిని సమకూర్చాలని వైద్యులను సైతం పూర్తిస్థాయిలో నియమించాలని కోరారు. సమావేశములో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజు, జిజిహెచ్ సూపరిండెంట్ డాక్టర్ మాలతి, తదితరులు ఉన్నారు.

## శాంతిభద్రతలపై అప్రమత్తంగా ఉండాలి

- సీపీ బడుగుల సుమతి



**హయత్‌నగర్, జూలై 28 (జనం సాక్షి) :** వార్షిక తనిఖీల్లో భాగంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బడుగుల సుమతి, ఐపీఎస్ మంగళవారం వనస్థలిపురం ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదవుతున్న కేసులు, శాంతిభద్రతల నిర్వహణ, సిబ్బంది పనితీరు, నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని కమిషనర్ సూచించారు. సైబర్ నేరాలు, లా అండ్ ఆర్డర్ సమస్యలు, గంజాయి, డ్రగ్స్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన నిఘా ఉంచాలని, నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే "మీ సురక్ష" "సహచరి" కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం ఏసీపీ కార్యాలయ ఆవరణలో కమిషనర్ బడుగుల సుమతి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ అనురాధ, అదనపు డీసీపీ రామేశ్వర్‌రావు, వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశిరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, అశోక్‌రెడ్డి, చింత శంకరయ్య, రాజేష్, సంతోష్‌కుమార్, డీఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి



**శేరిలింగంపల్లి, జూలై 28 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును తప్పకుండా కల్పించాలని ఆ దిశగా ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ళవీరేందర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం, గచ్చిబౌలి డివిజన్ పరిధి రాయదుర్గంలోని 1 నుండి 10 వరకు గల పోలింగ్ బూత్ లు, వెస్టర్న్ ప్లాజా అపార్ట్‌మెంట్స్ ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు మరియు జాబితా పరిశీలన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని మంగళవారం బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి తూళ్ళ వీరేందర్ గౌడ్ ప్రత్యక్షంగా పర్యవేక్షించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అధికారులు, భారతీయ జనతాపార్టీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు అక్రమ బంగ్లాదేశ్ చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటూ భారతీయ పౌరుల హక్కులను నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చట్టబద్ధమైన విధానంలో ప్రతి అక్రమ ఓటును గుర్తించి తొలగించడం, పారదర్శకమైన మరియు విశ్వసనీయమైన ఓటరు జాబితాల నమోదు తో కూడిన రూపకల్పన అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మూల అనిల్ గౌడ్, శేరిలింగంపల్లి బిఎల్‌ఏ-1 మాణిక్ రావు, బిఎల్‌ఓ సూపర్వైజర్ సత్యనారాయణ రెడ్డి, బిఎల్‌ఓలు భాస్కర్, డి. నీరజ, పద్మ, ఉదయ్, సల్మా, బిజెపి బిఎల్‌ఏలు మరియు నాయకులు ఎన్. నరేందర్ ముదిరాజ్, శ్యామ్ లేట్ నందు, డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేందర్ ముదిరాజ్, అంబటి అశోక్, గోరెంకా శ్రీకాంత్, కంచ నవీన్, శ్యామలెట్ సంజీవ్, గానుగు దయాకర్ ముదిరాజ్, నీరుడు సురేష్ ముదిరాజ్, సతీష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి నరసింహారాజు తోపాటు ముఖ్య కార్యకర్తలు సాయి ముదిరాజ్, చిత్తారి, దుర్గారామ్, కె. సంతోష్, నక్క శివకుమార్, రంగని విష్ణు, అనంతుల శివ శంకర్ గౌడ్, రావు కోలా ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY






# 'ఫ్రీడమ్' తేదీలు వచ్చేశాయ్

**న్యూఢిల్లీ:**ప్రముఖ ఇ-కామర్స్ సంస్థలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ మరో సేల్‌కు సిద్ధమయ్యాయి. జులై 4న అమెజాన్.. ప్రైమ్ మెంబర్ల కోసం ప్రత్యేకంగా ప్రైమ్ డే సేల్‌ను తీసుకురాగా.. ఇప్పుడు గ్రేట్ ఫ్రీడమ్ సేల్‌ను ఆగస్టు 7వ తేదీ నుంచి అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈసారి అందరూ పాల్గొనేలా ఈ సేల్ ప్రకటించింది. అలాగే, ఫ్లిప్‌కార్ట్ కూడా ఫ్రీడమ్ సేల్‌ను ఆగస్టు 8వ తేదీ నుంచి తీసుకొస్తోంది. ఈ సందర్భంగా ఐఫోన్17, శాంసంగ్ గెలాక్సీ ఎస్25పై భారీ డిస్కౌంట్లు ఉంటాయని పేర్కొంది. మరి ఆ వివరాలు పరిశీలిస్తే..ఆగస్టు 7 నుంచి అమెజాన్.. గ్రేట్ ఫ్రీడమ్ సేల్ నిర్వహించనుంది. హెచ్‌డీఎఫ్‌సీ కార్డుతో చేసే కొనుగోళ్లపై 10 శాతం తక్షణ రాయితీ లభిస్తుంది. అమెజాన్ ఐసీఐసీఐ బ్యాంక్ కార్డు ఉన్నవారు 5 శాతం క్యాష్‌బ్యాక్ ప్రకటించింది. అలాగే రూ.2వేల వరకూ క్యాష్‌బ్యాక్ రివార్డులు, గిఫ్ట్‌కార్డులు, గిఫ్ట్ వోచర్స్ దక్కించుకోవచ్చు. మొబైల్ రీఛార్జ్‌లపై రూ.50 వరకు, ఇన్సూరెన్స్ ప్రీమియంలపై రూ.999 వరకు ఆదా చేసుకోవచ్చు.స్మార్ట్‌ఫోన్స్, యాక్సెసరీలు, ల్యాప్‌టాప్‌లు, గృహోపకరణాలు, అమెజాన్ డివైజులపై డిస్కౌంట్లు అందించనుంది. కొన్ని వస్తువులపై లిమిటెడ్ టైమ్ ఆఫర్లు, ట్రెండింగ్ డీల్స్, 8 పీఎం డీల్స్, బ్లాక్‌బస్టర్ డీల్స్ కూడా ఉండబోతున్నాయి. సేల్‌కు సంబంధించి ఇప్పటికే అమెజాన్ తన





వెబ్‌సైట్/ యాప్‌లో మైక్రోసైట్ అందుబాటులో ఉంచింది. త్వరలోనే ఆఫర్ల వివరా లను ప్రకటించనుంది

**ఫ్లిప్‌కార్ట్ ఫ్రీడమ్ సేల్ వివరాలివే..**

అమెజాన్‌కు పోటీగా ఫ్లిప్‌కార్ట్ కూడా తన కస్టమర్ల కోసం ఫ్రీడం సేల్ తీసుకు వస్తోంది ఇది ఆగస్టు 8న ప్రారంభం కానుంది. ప్లస్, బ్లాక్ సబ్‌స్క్రైబర్లకు 24 గంటల ముందే సేల్స్ అందుబాటులోకి రానున్నాయి.ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుతో చేసే కొనుగోళ్లపై 10 శాతం తక్షణ రాయితీ అందించనుంది. ఎంపిక చేసిన వస్తువులపై వడ్డీ రహిత ఈఎంఐ సదుపాయం కూడా ఉంది. కొన్ని వస్తువులపై టాప్ డీల్స్, మేడ్ ఇన్ ఇండియా, టిక్ టాక్ వంటి ఆఫర్లు ఉండబోతున్నాయి. ఐఫోన్ 17, శాంసంగ్ గెలాక్సీ ఎస్25, మోటొరోలా ఎడ్జ్ ఫ్యూజన్ మొబైల్స్‌పై డిస్కౌంట్లు ఉండనున్నాయి. వీటితో పాటు ల్యాప్‌టాప్స్, ట్యాబ్లెట్స్, టీవీలు, హోమ్ అప్లికేషన్స్‌పై ఆఫర్లు ఉండబోతున్నాయి.

## ఇన్‌స్టా మార్ట్ సీఈఓ రాజీనామా..

**న్యూఢిల్లీ:**ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీకి చెందిన క్విక్‌కామర్స్ విభాగం ఇన్‌స్టా మార్ట్ షేర్లు మంగళవారం అమాంతం పెరిగాయి. కంపెనీ ప్రస్తుత సీఈఓ అమితేశ్ కుమార్ ఝా రాజీనామానే ఇందుకు కారణం. తక్షణమే ఇది అమల్లోకి రానుంది. ఆగస్టు 3 నుంచి తదుపరి సీఈఓగా నందిత సిన్హా కొనసాగనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది.సీఈఓ రాజీనామాతో స్విగ్గీ షేరు 0.03శాతం ఫ్లాట్‌గా రూ.257.90 వద్ద ప్రారంభమవ్వగా.. ఇంట్రాడేలో రూ.273 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ట్రేడింగ్‌లో 5శాతం మేర షేర్లు లాభపడ్డాయి. 2.05 గంటల సమయంలో బీఎస్‌ఈలో షేరు ధర రూ.268.27 వద్ద కొనసాగుతోంది. "ఇన్ స్టామార్ట్ వృద్ధికి అమితేశ్ విలువైన నాయకత్వం అందించారు. జులై 28న ఆయన కంపెనీ సీనియర్ మేనేజ్‌మెంట్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తక్షణమే ఇది అమల్లోకి వస్తుంది. కంపెనీ బలోపేతానికి కృషి చేస్తాం. కాంట్రిబ్యూషన్ మార్జిన్ క్రమంగా మెరుగుపరుస్తాం" అని కంపెనీ ప్రకటించింది. కాగా, తదుపరి సీఈఓ నందిత సిన్హా గతంలో ఇ-కామర్స్ సంస్థలైన ఫ్లిప్‌కార్ట్, ఎఫ్ఎంసీజీ వంటి సంస్థలకు తన నాయకత్వాన్ని అందించారు.





## రూ.52వేల కోట్లు చెల్లించేందుకు జాన్సన్ అండ్ జాన్సన్ అంగీకారం

**న్యూఢిల్లీ:**జాన్సన్ అండ్ జాన్సన్ బేబీ పౌడర్ ఇతర టాల్కం పౌడర్లు అండాశయ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయంటూ గతంలో దాఖలైన దావా పరిష్కారానికి సంస్థ ముందుకు వచ్చింది. దశాబ్దానికి పైగా సాగిన ఈ కేసులో పిటిషనర్లకు రూ.52వేల కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. అమెరికా వ్యాప్తంగా ఉన్న కోర్టులలో దీనిపై 76,000 పిటిషన్‌లు దాఖలయ్యాయి. వారిలో 95శాతం పిటిషనర్లు ఈ డీల్‌కు అంగీకరిస్తే.. ఈ ఆఫర్‌ను అమల్లోకి తెచ్చే అవకాశం ఉంది. లేదంటే మరిన్ని వ్యాజ్యాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.తమ టాల్కం ఆధారిత ఉత్పత్తులు సురక్షితమైనవని.. వాటిలో హానికరమైన ఆస్బెస్టాస్ అనే పదార్థం లేదని ఇంత కాలం జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ వాదిస్తూ వస్తోంది. అవి అండాశయ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయనే ఆరోపణలను ఖండించింది. అయితే ఈ విషయంలో కొన్నేళ్లుగా తరచూ ఎదుర్కొంటున్న కోర్టు విచారణలు, వాటిపై అవుతున్న భారీ ఖర్చుకు స్వస్తి చెప్పాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ కేసులో తాము గెలుపొందుతామని నమ్మకం ఉన్నప్పటికీ.. దానిపై ఎక్కువ సమయం కేటాయిస్తుండడం వల్ల కంపెనీ ఇతర లక్ష్యాలపై దృష్టి పెట్టలేకపోతున్నామని పేర్కొంది. అందుకే రూ.52 వేల కోట్లు చెల్లించేందుకు అంగీకరించామంది. మొదట 2027లో 3 బిలియన్ డాలర్లు చెల్లిస్తామని.. మిగిలినవి 2028లో ఇస్తామని న్యాయస్థానానికి తెలిపింది.

**ఏమిటీ ఆరోపణలు..?**

జాన్సన్ అండ్ జాన్సన్ బేబీ పౌడర్ సహా ఆ సంస్థ తయారు చేసే ఇతర ఉత్పత్తులను ఏళ్లతరబడి ఉపయోగించడం వల్ల మహిళలు అండాశయ క్యాన్సర్ బారిన పడుతున్నట్లు కొన్నేళ్ల క్రితం పలువురు అమెరికా కోర్టులలో పిటిషన్ వేశారు. ఆ పౌడర్‌లలో క్యాన్సర్‌కు కారణమయ్యే ఆస్బెస్టాస్ అనే పదార్థాన్ని కలుపుతున్నట్లు ఆరోపించారు. ఈ వార్తలను జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ ఖండించింది. అయితే 2020లో అమెరికాలో టాల్క్ ఆధారిత జాన్సన్స్ బేబీ పౌడర్ అమ్మకాలను నిలిపివేసి.. దాని స్థానంలో మొక్కజొన్న పిండితో తయారయ్యే పౌడర్‌ను తీసుకువచ్చింది.




## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి అంతర్జాతీయ మిశ్రమ సంకేతాలు, మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడం మార్కెట్ సూచీలపై ప్రభావం చూపింది. ఎఫ్ఎంసీజీ, బ్యాంక్ స్టాక్స్ ఒత్తిళ్లకు లోనయ్యాయి. దీంతో దేశీయ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 69.86 పాయింట్లు కోల్పోయి 76,765.92 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10.60 పాయింట్లు నష్టపోయి 23,985.35 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ 95.84 వద్ద ఉంది.సెన్సెక్స్ 30లో టీసీఎస్, ఎటర్నల్, టెక్ మహీంద్రా, టైటాన్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి.హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్, బీఈఎల్, ఎన్‌టీపీసీ, ఐసీఐసీఐ, పవర్‌గ్రిడ్, రిలయన్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 86.18 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,021.89 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## బోయింగ్ విమానాల సీట్లలో సమస్యలు.. వెంటనే మరమ్మతులు చేపట్టండి: ఎఫ్ఏఏ



**వాషింగ్టన్:**ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా వినియోగంలో ఉన్న బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 453 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల్లో ప్రయాణికుల సీట్ల ఫిట్టింగ్‌లో లోపాలు ఉన్నాయని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో వాటిని వెంటనే తనిఖీ చేసి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ప్రతిపాదించింది. ఈ ఆదేశాలు బోయింగ్ 737 మ్యాక్స్ 8, మ్యాక్స్ 9, మ్యాక్స్ 8200 మోడళ్లకు వర్తిస్తాయని తెలిపింది. 2025 డిసెంబర్ 10న విడుదలైన బోయింగ్ ప్రత్యేక సాంకేతిక నివేదికను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. దీనిపై సెప్టెంబర్ 10 వరకు అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపింది. దీనిపై బోయింగ్ సంస్థ ప్రతినిధులు స్పందించారు. సీట్ల అమరికలో లోపాలను గుర్తించి గతేడాదే సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం అమెరికా విమానయాన నియంత్రణ సంస్థ తప్పనిసరి చట్టబద్ధమైన ఆదేశంగా మార్చడాన్ని పూర్తిగా సమర్థిస్తున్నామన్నారు. ఎఫ్ఏఏ ప్రకారం... "సీటు వెనుక భాగాన్ని ట్రాక్‌కు సరిగా ఫిట్ చేయకపోవడంతో తీవ్రమైన కుదుపులు జరుగుతాయి. అత్యవసర ల్యాండింగ్ సమయంలో సీట్లు ట్రాక్‌ల నుంచి విడిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రయాణికులు, సిబ్బంది గాయపడతారు. అత్యవసర పరిస్థితుల్లో విమానం నుంచి బయటకు వెళ్లే మార్గం కూడా మూసుకుపోయే ప్రమాదం ఉంటుంది' అని తెలిపింది.








# దహిస్తున్న కార్చిచ్చు..!

## ఐరోపాను నవంబర్ వరకు

పారిస్:ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చు విధ్వంసం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు ఫ్రాన్స్‌లో 420 చదరపు కిలోమీటర్లకు పైగా .. స్పెయిన్‌లో 1,25,000 ఎకరాలకు పైగా అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది. గిరాండ్ ప్రాంతంలో కోట్ల విలువ చేసే 240కి పైగా విలాసవంతమైన ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ఫ్రాన్స్‌లో ఈ భారీ కార్చిచ్చు నవంబర్ మొదటి వారం వరకూ కొనసాగవచ్చని యూరోపియన్ యూనియన్ అధికారులు హెచ్చరించారు. ఐరోపాలో అగ్నికీలల వల్ల ఈ ఏడాది అత్యంత ఘోరమైన సంవత్సరాలలో ఒకటిగా నిలిచిపోతుందన్నారు. ఈ వారం ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతుండడంతో ఫ్రాన్స్, స్పెయిన్, గ్రీస్‌లలో కార్చిచ్చుల ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.శుక్రవారం సాయంత్రం ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లో ప్రారంభమైన ఈ అగ్నికీలలు పలు నగరాలకు వేగంగా వ్యాపిస్తున్నాయి. దీంతో ఫ్రాన్స్‌పై భారీ పొగ మేఘాలు కమ్ముకున్నాయి. దీంతో వీటిని ఆర్పడం సవాలుగా మారింది.

రోడ్లపైకి జంతువులు..

మంటలు వేగంగా వ్యాపిస్తుండడంతో ఫ్రాన్స్‌లో సుమారు 2 లక్షల మంది, స్పెయిన్‌లో లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అడవుల్లోని జంతువులు మంటల వేడిని తాళలేక రోడ్లపైకి పరుగులు తీస్తున్న దృ శ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పెం పుడు జంతువులను కూడా ప్రజలు బయటకు వదిలేస్తున్నారు.

మరింత కఠినంగా పరిస్థితులు..

రాబోయే రెండు వారాల్లో పరిస్థితులు మరింత కఠినంగా ఉంటాయని.. వీటిని కలిసికట్టుగా ఎదుర్కోవాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. అగ్నికీలలు ఆర్పడానికి వేలమంది సిబ్బంది పని చేస్తున్నారని.. వందల సంఖ్యలో హెలికాప్టర్‌లతో నీళ్లు వెదజల్లుతున్నారని తెలిపారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు గాలి కాలుష్యం సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.






## జపాన్‌లో భారీ భూకంపం..

### సునామీ హెచ్చరికలు జారీ

**టోక్యో:** జపాన్ ఉత్తర తీరంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 7.1గా నమోదైంది. దీంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంతంలో 10 అడుగుల మేర అలలు ఎగసి పడొచ్చని జపాన్ వాతావరణ ఏజెన్సీ వెల్లడించింది. దక్షిణ క్యూషు ద్వీపంలోని కుమామోటో, నాగసాకి, కగోషిమా, ఫుకుయోకా, సాగా, ఓయిటా ప్రాంతాలకు అత్యవసర భూకంప హెచ్చరికలు జారీ చేసింది. సముద్రమట్టం నుంచి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు సముద్ర తీరాలకు దూరంగా.. ఎత్తైన ప్రదేశాల్లో ఉండాలని అధికారులు పౌరులకు సూచించారు. ఆస్తి, ప్రాణ నష్టాలకు సంబంధించిన సమాచారం తెలియాల్సి ఉంది.చైనాలోనూ 5.8 తీవ్రతతో భూకంపం సంభవించింది. యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ప్రకారం.. మంగళవారం ఉదయం కేవలం 18 నిమిషాల వ్యవధిలో రెండు భూకంపాలు సంభవించాయి. వీటి తీవ్రతలు 5.7.. 5.8గా నమోదయ్యాయి. భూకంప కేంద్రం ఉపరితలం నుంచి ఇవి 10 కిలోమీటర్ల లోతులో ఉంది. భూమి కంపించడంతో కొండల నుంచి భారీగా దుమ్ము ఎగసిపడుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇదీ చదవండి: ఐరోపాను నవంబర్ వరకు దహించనున్న కార్చిచ్చు..!





## రూ.10, 20 ప్లాస్టిక్ నోట్లొస్తున్నాయ్

### 200 కోట్ల నోట్ల ముద్రణకు ప్రభుత్వ అనుమతి

**న్యూఢిల్లీ:**దేశంలో సామాన్యులు రోజువారీగా అత్యధికంగా వినియోగించేది రూ.10, రూ.20 నోట్లే. వాడకం అధికంగా ఉండటంతో త్వరగా పాడవుతున్నవీ ఈ నోట్లే. అందుకే రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ (ప్లాస్టిక్) నోట్లను ప్రయోగాత్మకంగా వినియోగంలోకి తెచ్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధ్రీ వెల్లడించారు. 1934 ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 25 ప్రకారం.. ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు సిఫారసుల మేరకే, ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో పాలిమర్ నోట్లను పరీక్షించేందుకు చిన్నమొత్తాలతో ప్రారంభించాలని నిర్ణయించారు. తొలిసారిగా రూ.10 పాలిమర్ నోట్లు 100 కోట్ల మేర, రూ.20 పాలిమర్ నోట్లు మరో 100 కోట్ల మేర మార్కెట్‌లోకి విడుదల చేయనున్నారు. పాలిమర్ నోట్లు మార్కెట్‌లోకి వచ్చినా, ప్రస్తుతం ఉన్న కాగితపు కరెన్సీ నోట్లు రద్దు కావని, రెండూ సమాంతరంగా చలామణిలో ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది.కరెన్సీ నోట్లు పాడవుతుండటంతో, కొత్తగా ముద్రించేందుకు ఏటా పెద్దమొత్తంలో నిధులు వెచ్చించాల్సి వస్తోంది. 2023-24లో కొత్త నోట్ల ముద్రణ వ్యయం రూ.5,101.4 కోట్లు కాగా, 2024-25లో రూ.6372.8 కోట్లకు చేరింది. ఒకపక్క డిజిటల్ చెల్లింపులు సంఖ్యాపరంగా - విలువపరంగా వృద్ధి చెందుతున్నా, కరెన్సీ నోట్ల ముద్రణకు అధికంగా వెచ్చించాల్సి వస్తున్నందునే, పాలిమర్‌నోట్లు తెస్తున్నారు.

## సైబర్ నేరాలకు మరణశిక్ష..

### మయన్మార్ కీలక నిర్ణయం

**యాంగూన్:** ఆన్‌లైన్ మోసాలను అరికట్టడానికి మయన్మార్ కీలక నిర్ణయం తీసుకుంది. సైబర్ నేరాల కేసుల్లో దోషులుగా తేలిన వారికి మరణశిక్ష విధించేలా రూపొందించిన ఆన్‌లైన్ మోసాల నిరోధక బిల్లును ఆ దేశ చట్టసభ ఆమోదించింది. ఆన్‌లైన్ మోసాల కేంద్రాలలో పనిచేయమని బాధితులను నిర్బంధించినా.. హింసించినా కొత్త చట్టం కింద వారిపై చర్యలు తీసుకోనున్నట్లు పార్లమెంట్ స్పీకర్ ఆంగ్ లిన్ ద్వే వెల్లడించారు. నిందితులకు జీవిత ఖైదు విధిస్తామని.. సైబర్‌నేరాల వల్ల ఇతరుల మరణానికి కారణమైన వారికి మరణ శిక్ష విధిస్తామన్నారు. కొందరు సైబర్ నేరగాళ్లు ఉద్యోగాల పేరుతో విదేశాలలోని విద్యార్థులను మయన్మార్‌కు రప్పిస్తున్నారని..అనంతరం వారిని బెదిరించి సైబర్ నేరగాళ్లుగా మారుస్తున్నారని అనేక ఫిర్యాదులు అందాయని తెలిపింది. సోషల్ మీడియా ప్రకటనలు చూసి.. సింగపూర్‌లో ఐటీ ఉద్యోగాల కోసం వెళ్లిన తెలుగు రాష్ట్రాల యువత అక్కడి సైబర్ ముఠాల వలలో చిక్కుకుపోయిన ఘటన ఇటీవల వెలుగులోకి వచ్చింది. సింగపూర్‌కు తీసుకువెళ్తామని చెప్పి దాదాపు 100మంది తెలుగు విద్యార్థులను సైబర్ నేరగాళ్లు మయన్మార్‌కు తరలించారు. అనంతరం వారి పాస్‌పోర్ట్‌లు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్న సైబర్ ముఠా వారిని నిర్బంధించింది. సైబర్ నేరాలు చేయాలని బలవంతపెట్టింది. ఈ విషయాన్ని బాధితులు ఫోన్‌లో తమ కుటుంబసభ్యులకు తెలియజేయడంతో.. వారు జులై 17న కేంద్ర విదేశాంగ శాఖకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు.

## డేటా గోప్యతపై వివరణ ఇవ్వండి

"ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సప్, గూగుల్, స్నాప్‌చాట్, ఎక్స్ (ట్విట్టర్) సంస్థలకు కేంద్రం సమన్లు జారీ చేసింది. వినియోగదారుల వ్యక్తిగత భద్రతకు, డేటా ప్రైవసీకి అమలు చేస్తున్న నిబంధనలపై ఆ సంస్థల ప్రతినిధులు వివరణ ఇవ్వాలి. మహిళలు, చిన్నారులు, రైతులు, కార్మికులు ఇలా ప్రజా భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియజేయాలి. ఆగస్టు 3న సాయంత్రం 4 గంటలకు సోషల్ మీడియా ప్రతినిధులతో సమావేశం ఉంటుంది" అని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, భాజపా ఎంపీ నిశికాంత్ దూబే తెలిపారు. కాగా, నీట్ యూజీ పేపర్ లీక్ అంశంపై విద్యార్థుల నిరసనను ప్రచారం చేయడానికి కాక్రోచ్ జనతా పార్టీ విస్తృతంగా సామాజిక మాధ్యమాలను వినియోగించింది. ఈ క్రమంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్ట్

నమోదు అయింది. ఈ కేసు దర్యాప్తును ఉమెన్స్ సేఫ్టీ వింగ్‌కు నగర పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ బదిలీ చేశారు. అకాడమిలో తనపై వేధింపులకు పాల్పడ్డాడని మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో ఉదయ్ కృష్ణారెడ్డిపై ఈ నెల 18న అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. లైంగికంగా వేధించడంతో పాటు.. వ్యక్తిగత వీడియోలను తన భర్తకు పంపించి ఇబ్బందులకు గురి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. విచారణలో భాగంగా నిందితుడు పేర్కొన్న రెండు చిరునామాల్లోనూ నోటీసులు ఇచ్చేందుకు వెళ్లగా పోలీసులకు అతడి ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు తాజాగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. కేసును పారదర్శకంగా దర్యాప్తు చేస్తున్నట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
29 జూలై 2026



- కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద మౌలిక వసతుల కొరత
- చిరు వ్యాపారులపై ఫీజుల భారం.. వినియోగదారులపై ప్రభావం
- వసూళ్లకే పరిమితమైన అటవీ శాఖ.. భోజన వసతి లేని పర్యాటక కేంద్రం
- ప్రాజెక్టు దగ్గర దొంగల భయం, భద్రత, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్

## అనంతుడి సాక్షిగా...
# పర్యాటకుల నిలువు దోపిడి

### గుడిసెకు 1500 గ్యాస్ పొయ్యికి, 3000 పైబడి వసూలు

తాత్కాలిక గుడారాలకే భారీ అద్దాలు.. పర్యాటకులకు అధిక ధరల భారం






వికారాబాద్

**జిల్లా బ్యూరో, జూలై 28 (జనం సాక్షి):**
తెలంగాణలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందుతున్న అనంతగిరి–కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రాంతంలో పర్యాటకులపై ధరల భారం రోజురోజుకూ పెరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పటికీ, సందర్శకులకు అవసరమైన మౌలిక వసతులు, నియంత్రిత ధరలు, భద్రత వంటి అంశాలు మాత్రం నిర్లక్ష్యానికి గురవుతున్నాయని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు చిరు వ్యాపారులు కూడా తమపై పడుతున్న ఫీజుల భారం కారణంగా వస్తువులను అధిక ధరలకు విక్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు.

శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయం, అనంతగిరి రిజర్వ్ ఫారెస్ట్, కోట్‌పల్లి ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు ప్రతి వారం వేలాది మంది పర్యాటకులు తరలివస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి భారీ నిధులు కేటాయించినప్పటికీ, పర్యాటకులకు అవసరమైన భోజన వసతి, విశ్రాంతి కేంద్రాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు వంటి కనీస వసతులు అందుబాటులో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.
ప్రాజెక్టు పరిసరాల్లో చిన్నచిన్న గుడారాలు వేసుకుని వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులు తమకు కేటాయించిన స్థలాలకే నెలకు ₹2,000 నుంచి ₹5,000 వరకు ఫీజులు చెల్లించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. గుడిసె ఏర్పాటు చేసుకోవడానికి సుమారు ₹1,500, గ్యాస్ పొయ్యి వినియోగానికి ₹3,000 నుంచి అంత కంటే ఎక్కువ మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోందని వారు చెబుతున్నా రు. ఈ భారం కారణంగా తాగునీరు, శీతల పానీయాలు, ఫాస్ట్ ఫుడ్, ఇతర వస్తువులను అధిక ధరలకు విక్రయించక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
పర్యాటకుల నుంచి కూడా ఇదే తరహా ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. బయట మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే వస్తువులు ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ధరల నియంత్రణకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని వారు అంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో వినియోగదారులపై అదనపు భారం పడుతోందని అభిప్రాయపడుతున్నారు.
మరోవైపు వ్యాపారులు కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. తాత్కాలిక గుడారాలు మాత్రమే ఉండటంతో ఎండ, వర్షం, గాలులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, శాశ్వత షెడ్లు లేక వ్యాపారం నష్టాల్లో సాగుతోందని పేర్కొంటున్నారు. రాత్రివేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు గుడారాలను ధ్వంసం చేయడం, సామగ్రి చోరీ చేయడం, కోతుల బెడద కారణంగా ఆహార పదార్థాలు నష్టపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు.
పర్యాటక కేంద్రంలో నాణ్యమైన భోజనశాలలు లేకపోవడం కూడా సందర్శకులను ఇబ్బందులకు గురిచేస్తోంది. శీతల పానీయాలు, చిరుతిండ్లు మాత్రమే అందుబాటులో ఉండగా, కుటుంబాలతో వచ్చే వారికి సరైన భోజన వసతి లేక నిరాశ చెందాల్సి వస్తోందని పలువురు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా అటవీ శాఖ తక్షణమే స్పందించి వ్యాపారులకు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి పారదర్శక విధానంలో అద్దెకు ఇవ్వాలని, అనధికార వసూళ్లపై సమీక్ష చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అదే సమయంలో పర్యాటకుల కోసం ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, భద్రత, పరిశుభ్రత, తాగునీరు, భోజన వసతి వంటి సౌకర్యాలను మెరుగుపరిస్తే అనంతగిరి–కోట్‌పల్లి ప్రాంతం నిజమైన పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడుతున్నారు.

## క్యాన్సర్‌కు ప్రధాన కారణం నిర్లక్ష్యమే

### యశోద హాస్పిటల్ డాక్టర్ స్రవంతి



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జులై 28 (జనంసాక్షి):** విదేశాలతో పోలిస్తే భారతదేశంలో క్యాన్సర్ మరణాలకు ప్రధాన కారణం నిర్లక్ష్యం అని హైదరాబాద్ యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ మన దేశంలో చాలా మంది రోగులు వ్యాధి ముదిరిన తర్వాత, అంటే స్టేజ్ 3 లేదా స్టేజ్ 4కి (స్టేజ్ 3, స్టేజ్ 4) చేరుకున్న తర్వాతే ఆసుపత్రులకు వస్తున్నారని, అప్పటికే క్యాన్సర్ శరీరమంతా వ్యాపించి ఉండటం వల్ల చికిత్స సంక్లిష్టంగా మారుతోందని తెలిపారు. ప్రాథమిక దశలో లక్షణాలను గుర్తించకపోవడం, అవగాహన లేమి, భయమే దీనికి కారణమన్నారు.

**నివారణకు ఉన్న ఒకే ఒక్క మార్గం స్క్రీనింగ్:**
క్యాన్సర్‌ను జయించాలంటే మన ముందున్న ఏకైక మరియు అత్యుత్తమ మార్గం రెగ్యులర్ స్క్రీనింగ్ మాత్రమేనని డాక్టర్ స్రవంతి స్పష్టం చేశారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ (ముఖ్యంగా మహిళలు మామోగ్రామ్, పురుషులు లంగ్/ప్రోస్టేట్ స్క్రీనింగ్) విధిగా ఏటా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ స్రవంతి అన్నారు.కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు.వ్యాయామం, సరైన పోషకాహారం, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం ద్వారా క్యాన్సర్ మహమ్మారికి చెక్ పెట్టవచ్చని అన్నారు.ఆధునిక వైద్యం అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో క్యాన్సర్ ఒక మరణశాసనం కాదని, సరైన సమయంలో గుర్తిస్తే హైపర్‌సైట్ లాంటి విప్లవాత్మక సాంకేతికతలతో సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం గడపవచ్చని డాక్టర్ స్రవంతి భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో యశోద హాస్పిటల్ డాక్టర్లు రాజు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్‌లో 43 మంది బాల కార్మికుల రక్షణ

- మంగళవారం 8 మంది చిన్నారుల గుర్తింపు
- యజమానులపై కేసులు నమోదు.. కఠిన చర్యల హెచ్చరిక
- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజల సహకారం కోరిన అధికారులు



**గద్వాల నడిగడ్డ, జూలై 28 (జనంసాక్షి):**రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్–12లో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లాలో ఇప్పటివరకు 43 మంది బాల కార్మికులను గుర్తించి రక్షించినట్లు జిల్లా సహాయ కార్మిక కమిషనర్ బి. వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మరో 8 మంది బాల కార్మికులను గుర్తించి రక్షించగా, వారిని పనిలో పెట్టుకున్న యజమానులపై సంబంధిత పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. కార్మిక, పోలీసు, మహిళా–శిశు సంక్షేమ, రెవెన్యూ శాఖలతో పాటు గ్రామీణాభివృద్ధి సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో జిల్లాలో సంయుక్త తనిఖీలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. బాల కార్మిక (నిషేధం, నియంత్రణ) చట్టం–1986 ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలను ఏ పనిలోనూ నియమించడం నేరమని, 14 నుంచి 18 ఏళ్లలోపు కిశోరులను ప్రమాదకర పరిశ్రమల్లో పనిచేయించడం కూడా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన యజమానులకు ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలుశిక్ష లేదా ₹20,000 నుంచి ₹50,000 వరకు జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని, అదే నేరాన్ని పునరావృతం చేస్తే ఒకటి నుంచి మూడు సంవత్సరాల వరకు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. జిల్లాలో ముఖ్యంగా గొర్రెల కాపరి పనులకు చిన్నారులను పంపిస్తున్న ఘటనలు ఎక్కువగా వెలుగుచూస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన వేణుగోపాల్, పిల్లలను పనులకు కాకుండా పాఠశాలలకు పంపించి వారి విద్యా హక్కును పరిరక్షించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. బాల కార్మికులు ఎక్కడైనా పనిచేస్తున్నట్లు గుర్తిస్తే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా సమీప కార్మిక శాఖ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా ఆపరేషన్ ముస్కాన్–12 కింద సంయుక్త తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సహాయ కార్మిక కమిషనర్ స్పష్టం చేశారు.

## మంథనిలో చురుకుగా సాగుతున్న రోడ్డు వెడల్పు పనులు

### అభివృద్ధిలో ప్రజల సహకారానికి కృతజ్ఞతలు : మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్



**మంథని, జూలై 29, ( జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. నేపథ్యంలో సోమవారం రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా కూల్చివేత కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ , పాలకవర్గ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మంథని పట్టణాన్ని ఆదర్శ (మోడల్) పట్టణంగా తీర్చిదిద్దేందుకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బ్రిడ్జి సమీపం నుంచి బస్ డిపో వరకు, అలాగే బస్ డిపో నుంచి పోచమ్మవాడ లింక్ రోడ్డు వరకు ప్రజల రాకపోకలకు అనుకూలంగా 90 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ పనుల విజయవంతమైన అమలుకు స్థానిక ప్రజలు, వ్యాపారవేత్తలు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలందరూ ఇదే విధంగా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పెంటరి రాజు, ప్రజాప్రతినిధులు జంబోజు సమ్మయ్య, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్‌లో ఉబర్ బైక్ సేవలు ప్రారంభం

### హెల్మెట్ల పంపిణీతో రహదారి భద్రతకు ప్రాధాన్యం
### ప్రయాణికులకు వేగవంతమైన సేవలు.. డ్రైవర్లకు ఉపాధి అవకాశాలు




**వరంగల్, జూలై 27 (జనంసాక్షి):** వరంగల్ నగరంలో ఉబర్ బైక్ సేవలను ప్రారంభించినట్లు ప్రముఖ రైడ్–హెయిలింగ్ సంస్థ ఉబర్ ప్రకటించింది. నగరంలో వేగవంతమైన, సరసమైన, సౌకర్యవంతమైన ప్రయాణ సేవలను అందించడమే లక్ష్యంగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సంస్థ వెల్లడించింది. ఉద్యోగాలు, విద్యాసంస్థలు, రోజువారీ అవసరాలు, కుటుంబ సభ్యులను కలుసుకునే ప్రయాణాల కోసం ఉబర్ యాప్ ద్వారా కేవలం కొన్ని క్లిక్‌లతో బైక్ రైడ్‌ను బుక్ చేసుకోవచ్చని తెలిపింది. సేవల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లో కొత్తగా ఉబర్ బైక్‌ను వినియోగించే ప్రయాణికులకు పరిమిత కాలం పాటు తొలి రైడ్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ కలిసి ఉబర్ బైక్ డ్రైవర్లకు ఐఎస్ఐ ప్రమాణాల హెల్మెట్లను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ, నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అందుబాటులో ఉండే, విశ్వసనీయమైన రవాణా సేవల అవసరం పెరిగిందన్నారు. ఉబర్ బైక్ సేవలతో నగరవాసులకు ప్రయాణం సులభతరం కావడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. రహదారి భద్రతకు ఉబర్ ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ మాట్లాడుతూ, ఈ సేవలతో నగరంలో తొలి, చివరి మైలు ప్రయాణ అనుసంధానం మెరుగుపడుతుందని, స్థానిక రైడర్లకు ఆదాయ వనరులు పెరుగుతాయని తెలిపారు. ఉబర్ ఇండియా, దక్షిణాసియా కన్స్యూమర్ అండ్ గ్రోత్ విభాగం డైరెక్టర్ రిషాంత్ ఘోష్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాలకు బైక్ ట్యాక్సీలకు మంచి ఆదరణ లభిస్తోందన్నారు. వరంగల్‌లో కూడా ప్రయాణికులకు నమ్మకమైన సేవలతో పాటు స్థానిక డ్రైవర్లకు అనువైన ఆదాయ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు.
ప్రతి ఉబర్ బైక్ రైడ్‌లో డ్రైవర్ రియల్‌టైమ్ ఐడీ చెక్, ఎస్ఓఎస్ బటన్, 24 గంటల సేఫ్టీ లైన్, ట్రిప్ షేరింగ్ వంటి భద్రతా ఫీచర్లు అందుబాటులో ఉంటాయని సంస్థ వెల్లడించింది. ప్రయాణికులు ఉబర్ యాప్‌లో పికప్, డ్రాప్ వివరాలు నమోదు చేసి 'ఉబర్ బైక్' ఎంపిక ద్వారా సులభంగా సేవలను వినియోగించుకోవచ్చని తెలిపింది.

### కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో
## ఘనంగా ప్రారంభమైన 'వన మహోత్సవం'

### నగరాన్ని 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ'గా తీర్చిదిద్దడమే లక్ష్యం : నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, జూలై 28 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంతో చేపట్టిన 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని 53వ డివిజన్ సాయి నగర్‌లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘనంగా ప్రారంభించారు. నగరాన్ని కేవలం 'క్లీన్ సిటీ' గానే కాకుండా క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నగర మేయర్ తెలిపారు. వన మహోత్సవం ప్రారంభోత్సవంలో భాగంగా సాయి నగర్‌లో ఒకే రోజు సుమారు 500 మొక్కలను నాటారు. నగరవ్యాప్తంగా ప్రతి ఇంటికి రెండు చొప్పున పూల లేదా పండ్ల మొక్కలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని గృహాలకు 3 లక్షల మొక్కలను పంపిణీ చేయడంతో పాటు, వివిధ డివిజన్లలో సుమారు లక్ష మొక్కలను నాటే లక్ష్యాన్ని నగరపాలక సంస్థ నిర్దేశించుకుంది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, భవిష్యత్తులో పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న అనుకూల సమయంలో మొక్కలు నాటితే అవి సులభంగా పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. నగర ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ, కరీంనగర్‌ను 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీ' గా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థకు సహకరించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొంపెల్లి శ్వేత రమన్, వంగల పవన్ కుమార్, కాలనీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మహిళలు , స్థానికులు, డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

*హయత్ నగర్ : ప్రముఖ సీనియర్ సినీనటి పావలా శ్యామల (75) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచారు.పావలా శ్యామల మృతిపట్ల సినీ పరిశ్రమ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నటి కరాటే కల్యాణి, 'మా' జనరల్ సెక్రటరీ రఘుబాబు తదితరులు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు.*

## జీడీకే.1,3 గనుల్లో విద్యుత్ భద్రతా వ్యవస్థలపై డీడీఎంఎస్ తనిఖీ




**గోదావరిఖని, జనంసాక్షి:** సింగరేణి రామగుండం ఏరియా–1 పరిధిలోని జీడీకే. 1 అండ్ 3 గనులను హైదరాబాద్ (ఎస్ సి జెడ్) డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) కోమల్ చౌదరి మంగళవారం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గనిలో విద్యుత్ భద్రత, పరికరాల నిర్వహణ, నాణ్యత ప్రమాణాలు, గని కార్యకలాపాలకు సంబంధించిన విద్యుత్ వ్యవస్థలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఫ్యాన్ హౌస్, ఇండోర్ స్విచ్ స్టేషన్, అవుట్‌డోర్ సబ్‌స్టేషన్లను సందర్శించి, విద్యుత్ పరికరాల నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, రక్షణ వ్యవస్థలు, నివారణ చర్యలు, నిర్వహణ రికార్డులు, అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన విధానాలను సమీక్షించారు. గనులలో విద్యుత్ సంబంధిత ప్రమాదాలు నివారించేందుకు ప్రతి పరికరాన్ని నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాలని, భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థల పనితీరు, సిబ్బంది భద్రత, నివారణ చర్యలు, రెగ్యులర్ ఇన్‌స్పెక్షన్లు, నిర్వహణ పనులను నిరంతరం కొనసాగించాలని తెలిపారు.
ఈ తనిఖీలో జీడీకే–1 ఏజెంట్ ఎల్. రమేష్, డీజీఎం (సేఫ్టీ) ఈ అండ్ ఎం పి. రమేష్, మైన్ మేనేజర్ సుధీర్ జక్కుల్వార్, సేఫ్టీ ఆఫీసర్ జి. మహేష్, పిట్ ఇంజనీర్ పి. శేఖర్, ఏఈ (ఈ అండ్ ఎం) ఎం. క్రాంతి, సర్వే ఆఫీసర్ ఐ. శ్రీనివాసు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ (ఎలక్ట్రికల్) ఈ.సంపత్ పాల్గొని గనిలో అమలులో ఉన్న విద్యుత్ భద్రతా చర్యలు, నిర్వహణ విధానాలను డీడీఎంఎస్‌కు వివరించారు.

## తొలి దశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల కీలకపాత్ర

- ఉద్యమకారులకు న్యాయం చేయాలని తొలి దశ పోరాట యోధుల డిమాండ్
- 1969 ఉద్యమకారుల జిల్లా సమావేశంలో పిలుపు
- పరీక్షలు బహిష్కరించిన విద్యార్థులనూ ఉద్యమకారులుగా గుర్తించాలని విజ్ఞప్తి



**గద్వాల నడిగడ్డ, జూలై 28 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన 1969 తొలి దశ ఉద్యమంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాలు అత్యంత కీలక పాత్ర పోషించాయని, ఆ ఉద్యమ చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తొలి దశ తెలంగాణ ఉద్యమకారుల సంఘం జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు కె. మోహన్‌రావు అన్నారు. మంగళవారం గద్వాల టూరిజం హోటల్‌లో నిర్వహించిన 1969 ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన తెలంగాణ తొలి దశ ఉద్యమం 370 మందికి పైగా అమరవీరుల త్యాగాలతో రక్తసిక్త చరిత్రను సృష్టించిందని ఆయన పేర్కొన్నారు. ఆ ఉద్యమమే తర్వాతి దశ తెలంగాణ ఉద్యమానికి పునాదిగా నిలిచిందని చెప్పారు. చరిత్రను మరచిపోతే భవిష్యత్ తరాలకు స్ఫూర్తి దొరకదని, ఉద్యమ స్ఫూర్తిని సజీవంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. 1969లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ప్రారంభమైన తెలంగాణ ఉద్యమ జ్వాల గద్వాల వరకు వ్యాపించిందని, అప్పట్లో మహబూబ్‌నగర్ జిల్లాలో గద్వాల డిగ్రీ కళాశాల, హైస్కూల్ విద్యార్థులు ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం సాధించే వరకు విద్యార్థి సంఘాలు పాఠశాలలు, కళాశాలల ను నిరవధికంగా బహిష్కరించి, పరీక్షలు కూడా రాయకుండా ఉద్యమంలో భాగస్వాములయ్యాయని వివరించారు.
1969 ఏప్రిల్ 7న చేనుగోనిపల్లి గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి పాఠం సర్వారెడ్డి పోలీసు కాల్పుల్లో అమరుడయ్యారని, అనంతరం ఏప్రిల్ 9న గద్వాలలో జరిగిన శవయాత్ర సందర్భంగా కొట్టం వేణుగోపాల్ కూడా పోలీసు తూటాలకు బలైన ఘటనను మోహన్‌రావు గుర్తు చేశారు. ఈ ఘటనలతో గద్వాల ప్రాంతమంతా ఉద్యమ ఉధృతికి కేంద్రంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కేశవరావు అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి ద్వారా పరీక్షలు బహిష్కరించిన విద్యార్థుల అంశాన్ని కమిటీ పరిశీలనలోకి తీసుకురావాలని ఇప్పటికే విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. త్వరలో జిల్లాస్థాయి విస్తృత సమావేశం నిర్వహించి, 1969 ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులను ఒకే వేదికపైకి తీసుకురానున్నట్లు మోహన్‌రావు వెల్లడించారు. ఉద్యమ చరిత్రను పరిరక్షిస్తూ, అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అబ్దుల్ మొమిన్, శంకర ప్రసాద్, నాగన్ గౌడ్, మారెన్న, సూర్యనారాయణ, సర్వారెడ్డి, షాలిమియా, ఉద్యమకారుల కుటుంబ సభ్యులు రవి, అక్బర్ బాషా పాల్గొన్నారు.

## జాతీయ సదస్సును యూనివర్సిటీలోనే నిర్వహించాలి

- యూనివర్సిటీలో పోరు ఉధృతం
- విద్యార్థులు నిరసన దీక్ష
- పట్టణంలో రౌండ్ టేబుల్ సమావేశం



**మహబూబ్ నగర్ ప్రతినిధి జూలై 28 (జనం సాక్షి) :**
విజన్ ఇండియా –2047 సెమినార్ ఖచ్చితంగా పాలమూరు యూనివర్సిటీ పరిధిలోనే నిర్వహించాలి. అనే డిమాండ్‌తో పాలమూరు యూనివర్సిటీ మరో పక్క పాలమూరు పట్టణం దీక్షలతో రౌండ్ టేబుల్ సమావేశాలతో అట్టుడుకుతోంది. విద్యార్థులు నిరసన దీక్షతో ఒక్కసారిగా యూనివర్సిటీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాలమూరు యూనివర్సిటీలోనే సెమినార్ నిర్వహించాలని డిమాండ్ చేసారు. మరో ప్రక్క మేధావులు విద్యావేత్తలు రౌండ్ టేబుల్ సమావేశంలో సీనియర్ సిటిజన్లో ముక్తకంఠంతో ఏకగ్రీవ తీర్మానము చేసారు. ప్రతిష్టాత్మకంగా పాలమూరుకు కేటాయించబడ్డ విజన్ ఇండియా 2047 సదస్సును పాలమూరులో కాకుండా, ఎక్కడో 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక ప్రైవేటు రిసార్టు లాంటి కన్హా శాంతివనంలో నిర్వహించడం, ఇక్కడ పాలమూరు ప్రజలను అవమానించడమేనని పాలమూరు యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థుల మనోభావాలకు విరుద్ధంగా వారి ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఎలా కన్హా శాంతివనంలో నిర్వహిస్తారని మేధావులు పేర్కొన్నారు. పాలమూరు పునర్ నిర్మాణం ఫోరం అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సీనియర్ సిటిజన్లు, అడ్వకేట్లు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు వివిధ విభాగాల్లో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగులు వ్యాపారవేత్తలు పలువురు పాల్గొని విసి చర్యను తీవ్రంగా పరిగణిస్తున్నామని, మా నిరసనను ఈ రౌండ్ టేబుల్ ద్వారా గౌరవ ముఖ్యమంత్రి ఏకగ్రీవ తీర్మానంతో పంపిస్తున్నామని, జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా పాలమూరు పరువు పోతుంటే చూసుకుంటూ ఉండరాదని పాలమూరు విద్యార్థుల కోసం మేమెంతటికైనా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని వక్తలు మాట్లాడడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి,అడ్వకేట్ వీర బ్రహ్మచారి, జయప్రకాశ్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాల అధినేత కె ఎస్ రవికుమార్, రిటైర్డ్ డైట్ లెక్చరర్ జగపతిరావు, రిటైర్డ్ ఏం ఆర్ ఓ చెన్నకిష్టప్ప, రిటైర్డ్ ఎం ఈ ఓ పారుక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# నేరెళ్ల బాధితులకు తెరసే అండగా ఉంటుంది

## తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**రాజన్న సిరిసిల్ల బ్యూరో,జూలై 28 (జనం సాక్షి) :** తెలంగాణ రక్షణ సేన అంటే తెలంగాణను రక్షించేందుకు పెట్టిన పార్టీఅని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన నేరెళ్ల బాధితుడు గంధం గోపాల్ కుటుంబ సభ్యులను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా గోపాల్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నేరెళ్ల ఘటనలో బాధితులు ఎదుర్కొన్న కష్టాలు తెలంగాణ సమాజం ఎప్పటికీ మరువదని, గోపాల్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ వస్తే మన జీవితాలు బాగుపడుతాయని అందరం కొట్లాడి స్వరాష్ట్రం సాధించుకున్నామన్నారు. నేరెళ్ల సంఘటన మనందరం సిగ్గుతో తలదించుకున్న సంఘటనని, ఈ ఘటన జరిగినప్పుడు ఉన్న ప్రభుత్వంలోని కుటుంబంలో నేను కూడా సభ్యురాలినే అని గుర్తుచేశారు. అందుకు సిగ్గుతో తలదించుకుంటూ మీ అందరిని క్షమాపణ అడుగుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు, కొందరి ధన దాహం కోసం ఎంతో మంది ప్రాణాలు కోల్పోయేలా చేశారని, ఇసుక లారీల కారణంగా ఒక బిడ్డ ప్రాణం పోతే ఇక్కడ ప్రజలు ఆందోళన చేశారని పేర్కొన్నారు. దానికి వాళ్ళపై పోలీసులు దాష్టికం చేశారని, ఐదు రోజుల పాటు 8 మందిని ఇష్టానుసారంగా కొట్టారన్నారు. ఇప్పటివరకు కూడా ఈ దాష్టికానికి పాల్పడిన ఒక్క పోలీస్ కైనా శిక్ష పడిందా అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ బండి సంజయ్ లకు ఏమైందని అన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ ను తీసుకొచ్చారు కానీ దాని రిపోర్ట్ ఇప్పటికి కూడా రాలేదు ఏమైందో, బండి సంజయ్ చెప్పాలన్నారు. కచ్చితంగా ఎస్సీ కమిషన్ రిపోర్ట్ కోసం పోరాటం చేస్తామని అవసరమైతే నేరెళ్ల బాధితులతో కలిసి ఢిల్లీకి వెళ్తామన్నారు. నేరెళ్ల బాధితులు అందరికీ కచ్చితంగా ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఆమె వెంట తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# హైకోర్టు తీర్పు.. పేదల పోరాటానికి న్యాయం

- హైడ్రా కమిషనర్ వ్యవహారశైలిపై హైకోర్టు వ్యాఖ్యలను స్వాగతించిన బీఆర్ఎస్
- రేవంత్‌రెడ్డి నైతిక బాధ్యత వహించి మున్సిపల్ శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలి
- హైడ్రా చర్యలపై సమగ్ర విచారణ చేపట్టాలని బీఆర్ఎస్ డిమాండ్



**నిజాంపేట్, జూలై 28 (జనం సాక్షి):** హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యవహారశైలిపై తెలంగాణ హైకోర్టు చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ స్వాగతిస్తున్నట్లు బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హైడ్రా పేరుతో ప్రభుత్వం అనుసరించిన విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు హైడ్రా కమిషనర్‌ను తొలగించాలని రావడం పేద ప్రజల విజయమని, అధర్మంపై ధర్మం సాధించిన విజయంగా తాము భావిస్తున్నామని అన్నారు. పేదల పక్షాన బీఆర్ఎస్ చేపట్టిన పోరాటానికి ఈ తీర్పు ప్రతిఫలమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని మున్సిపల్ శాఖ పరిధిలోనే హైడ్రా పనిచేస్తోందని, హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఆయన మున్సిపల్ శాఖ మంత్రిగా కొనసాగేందుకు నైతిక అర్హత కోల్పోయారని ఆరోపించారు. నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలవాల్సిన హైడ్రా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నచ్చిన వారికి ఒక విధానం, నచ్చని వారికి మరో విధానం అమలు చేస్తూ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. న్యాయవ్యవస్థను గౌరవించాలా లేదా వ్యక్తిగత నిర్ణయాలకే ప్రాధాన్యం ఇవ్వాలా అన్నది ప్రభుత్వం తేల్చుకోవాలని అన్నారు. చట్టబద్ధ పాలనకు బదులుగా బుల్డోజర్ పాలన కొనసాగితే ప్రజలు సహించరని హెచ్చరించారు. హైడ్రా వంటి వ్యవస్థ పేద, మధ్యతరగతి ప్రజలకు రక్షణగా ఉండాల్సింది పోయి భయాం దోళనలకు కారణమైందని విమర్శించారు. హైడ్రా చర్యలు, అక్రమాలపై సిట్టింగ్ హైకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ పరిపాలన సాగాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ వ్యవహారశైలిపై ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. హైకోర్టు తాజా తీర్పుతో ప్రభుత్వ వైఖరిపై ప్రజల్లో ఉన్న సందేహాలు మరింత బలపడ్డాయని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




- వారాంతాల్లో భారీగా తరలివస్తున్న విద్యార్థులు, సందర్శకులు
- హెచ్చరిక బోర్డులు లేక ప్రమాదకర ప్రాంతాల్లో ఈతలు.. ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు
- రాంగ్‌రూట్ ప్రవేశాలతో రహదారిపైనా ముప్పు.. భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్

# ప్రమాద ఘంటికలు!

## నీటి మట్టం తగ్గడంతో 'మానేరు మినీ బీచ్'గా మారిన డ్యాం పరిసరాలు





**తిమ్మాపూర్/కరీంనగర్ టౌన్, జూలై 28 (జనంసాక్షి):** ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ప్రధాన నీటి వనరైన దిగువ మానేరు రిజర్వాయర్ (ఎల్ఎండీ) ప్రస్తుతం డెడ్ స్టోరేజీ స్థాయికి చేరుకోవడంతో డ్యాం లోపలి భాగంలో ఇసుక తిన్నెలు, రాతి నిర్మాణాలు బయటపడి ప్రకృతి అందాలను తలపిస్తున్నాయి. ఈ దృశ్యాలను తిలకించేందుకు ప్రతిరోజూ, ముఖ్యంగా వారాంతాల్లో పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివస్తున్నారు. తిమ్మాపూర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇంజినీరింగ్, ప్రొఫెషనల్ కళాశాలల విద్యార్థులు సెల్ఫీలు, విహారం కోసం డ్యాం వద్దకు చేరుతుండటంతో ఈ ప్రాంతం 'మానేరు మినీ బీచ్'గా మారింది.
అయితే ప్రకృతి అందాల వెనుక ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి లోతు, అడుగుభాగంలో ఉన్న గుంటలు, బురద ప్రాంతాలపై అవగాహన లేకుండా యువత ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లి ఈత కొడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం నెలకొంది. ఇప్పటికే నీటి మట్టం అసమానంగా ఉండటంతో ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉందని చెబుతున్నారు.
ఆశ్చర్యకరంగా డ్యాం పరిసరాల్లో ప్రమాదకర ప్రాంతాలను సూచించే హెచ్చరిక బోర్డులు లేకపోవడం, భద్రతా సిబ్బంది లేకపోవడం సందర్శకుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. నీటిలోకి వెళ్లరాదని హెచ్చరించే సూచికలు లేకపోవడంతో సందర్శకులు ఎలాంటి నియంత్రణ లేకుండా లోతట్టు ప్రాంతాల్లోకి వెళ్తున్నారు.
ఇక రాజీవ్ రహదారిపై లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపం నుంచి వాహనదారులు రాంగ్‌రూట్‌లో డ్యాం లోపలికి ప్రవేశించడం మరో ప్రమాదానికి దారితీస్తోంది. అధిక వేగంతో వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారిపై ఈ విధమైన ప్రవేశాలు ఎప్పుడైనా ఘోర ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. అక్కడ ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా సిబ్బంది లేకపోవడం పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మారుస్తోందని పేర్కొంటున్నారు.
ప్రమాదాలు జరగకముందే సాగునీటి శాఖ, పోలీసు శాఖ తక్షణమే స్పందించి ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రాంగ్‌రూట్ ప్రవేశాలను అడ్డుకునేలా బారికేడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే భద్రతా సిబ్బందిని నియమించి సందర్శకులకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు. మరో వైపు పర్యాటకులు కూడా సెల్ఫీలు, ఈత సరదాల కోసం ప్రాణాలను పణంగా పెట్టకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.




# సర్పంచులు ఇంకుడు గుంత నిర్మాణాలను వంద శాతం చేపట్టాలి

### బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు

**బోధన్, జూలై 28 (జనంసాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడనున్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మాణాలలో వంద శాతం పనులు చేపట్టే విధంగా సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించాలని బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి సాలూర మండల ప్రత్యేక అధికారి నాగరాజు స్పష్టం చేశారు. మంగళవారం సాలూర రైతు వేదికలో నిర్వహించిన జలసిరిలో భాగంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్క ఇంటికి ఇంకుడు గుంతను ఏర్పాటు చేయడం ద్వారా నీరు తిరిగి భూమిలోకి చేరి మళ్లీ వాటిని ఉపయోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే పంట కుంట, ఊట కుంటలను నిర్మించడం ద్వారా రైతాంగంకు సరిపడా సేద్యపు నీరు విరివిగా లభిస్తుందని అందువల్ల ప్రజా ప్రతినిధులు చొరవ చూపి పొలాలలో వీటి నిర్మాణాలను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీటి నిర్మాణాలకు ప్రభుత్వం డబ్బులను సైతం అందిస్తుందని అందువల్ల ప్రతి ఒక్కరు ఇంకుడు గుంత నిర్మాణాలతో పాటు పొలాలలో పంటకుంట, ఊట కుంటలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులతో పాటు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సాలూర ఎంపీడీవో నరసయ్య, సాలుర కార్యదర్శి ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించాలి

### డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ



**రామగిరి, జనంసాక్షి:** సింగరేణిలో నిర్దేశిత ఓవర్‌బర్డెన్ (ఓబీ), బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సాధించాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన సింగరేణి రామగుండం-3 ఏరియా, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ఆయనకు స్వాగతం పలికారు.తదనంతరం ఇరు ఏరియాల జనరల్ మేనేజర్లు, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన డైరెక్టర్, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, జీడీకే-10 గని పనుల పురోగతి, ఆర్జీ కోల్ మైన్ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.అనంతరం అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ గనిని సందర్శించి, మూడో ప్యానెల్ సాల్వేజింగ్ పనుల పురోగతి, నాలుగో ప్యానెల్ తయారీ పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎల్.వి. సూర్యనారాయణ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వర్షాకాలంలో ఉపరితల గనుల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలను తప్పనిసరిగా అమలు చేయాలని, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో సాల్వేజింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేసి సురక్షిత ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటూజీఎం బండి సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి. ఫ్యాటింగ్, ప్రాజెక్ట్ ఇంజనీర్ టి. రఘురామ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు..

# ఉప్పల్‌కు మళ్లీ జలకళ

## నేటి నుంచి తాగునీటి సరఫరా పునరుద్ధరణ

- అర్ధరాత్రికల్లా కీలక పనులు పూర్తి.. లైన్ ఫిల్లింగ్‌కు శ్రీకారం
- పనులను పరిశీలించిన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి
- ప్రభావిత ప్రాంతాలకు దశలవారీగా మంచినీటి సరఫరా ప్రారంభం

**ఉప్పల్, జూలై 28 (జనం సాక్షి):** ఉప్పల్ జంక్షన్ వద్ద కృష్ణా మంచినీటి సరఫరా పైప్‌లైన్‌కు సంబంధించిన కీలక మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. కృష్ణా మంచినీటి సరఫరా ప్రాజెక్టు ఫేజ్-2 రింగ్ మెయిన్-2 పరిధిలోని 1600 మిల్లీమీటర్ల ఎంఎస్ గ్రావిటీ మెయిన్ సైఫన్ పైప్‌లైన్‌కు చేపట్టిన మరమ్మతు పనులను జలమండలి అధికారులు వేగంగా పూర్తి చేస్తున్నారు. నిర్ణీత గడువులోపు పనులను పూర్తి చేసి, ప్రభావిత ప్రాంతాలకు తాగునీటి సరఫరాను వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఉప్పల్ జంక్షన్ వద్ద చేపట్టిన ప్రధాన జంక్షన్ పనులను అర్ధరాత్రికల్లా పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.వీటి ఏర్పాటు పూర్తయిన తర్వాత పైప్‌లైన్ నిర్వహణ, నీటి ప్రవాహ నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో ఉప్పల్ స్టేడియం సమీపంలో దెబ్బతిన్న ఎయిర్ వాల్వ్ ఎక్స్‌టెన్షన్ పైప్‌కు సంబంధించిన మరమ్మతులను కూడా చేపట్టారు. ఈ పనులను సైతం అర్ధరాత్రి నాటికి పూర్తి చేసి, మొత్తం పైప్‌లైన్ వ్యవస్థను ఒకేసారి వినియోగానికి సిద్ధం చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మరమ్మతు పనుల పురోగతిని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, ఎలాంటి జాప్యం లేకుండా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో గత కొన్ని రోజులుగా తాగునీటి అంతరాయంతో ఇబ్బందులు ఎదుర్కొన్న ఉప్పల్ పరిధిలోని ప్రజలకు ఉపశమనం లభించనుంది.

## పంచాయతీరాజ్ ఫోరం సర్పంచ్లతో అడిషనల్ కలెక్టర్ సమీక్ష సమావేశం

**కథలాపూర్ జూలై 28 (జనం సాక్షి) :** కథలాపూర్ మండల కేంద్రంలో మంగళవారం రోజున జరిగిన మండల సర్పంచుల సమీక్షా సమస్య సమావేశంలో పాల్గొన్న జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ మరియు జిల్లా పంచాయతీరాజ్ అధికారి మధుసూదన్, ఎంపీడీవో శంకర్ మండల స్థాయి అధికారులు మరియు మండల సర్పంచ్ ల ఫోరం ఆధ్వర్యంలో మీషిన్ భగీరథ నీళ్లు కథలాపూర్ మండలం మిషన్ భగీరథ నీళ్లు రాక బోరు బావులతో నీళ్లు అందించడం వలన కరెంట్ బిల్ ఎక్కువ వస్తుంది కనుక మాకు చేయాలేని గత మూడు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న గ్రామ పంచాయతీ నిధులు విడుదల చేయాలి అని వరద కాలువలో నీళ్లు వదిలి ఆదుకోవాలని సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. మరియు అడిషనల్ కలెక్టర్ రాజా గౌడు పంచాయతీరాజ్ అధికారి మధుసూదన్ కథలాపూర్ మండల సర్పంచ్ లని సత్కరించడం జరిగింది.



# నిర్దేశిత గడువులోపు ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించండి

### మున్సిపల్ కమిషనర్ బి.యాదగిరి

**చేవెళ్ల, జూలై 28 (జనంసాక్షి):** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోందని మున్సిపల్ కమిషనర్ బి.యాదగిరి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 3, 2026 నాటికి ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నందున, పట్టణ ప్రజలు చివరి వరకు వేచి చూడకుండా ఈ శనివారం లోగానే తమ ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) తప్పనిసరిగా అందజేయాలని కోరారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు నిర్దేశిత గడువులోపు ఫారాలు సమర్పించాలని ఆయన సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాన్ని సమర్పించని పక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ప్రజల సౌకర్యార్థం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ సేవలను పట్టణ ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ బి.యాదగిరి విజ్ఞప్తి చేశారు.

# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం కావాలి

- ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి
- జలసిరి పనులు, విత్తనాల పంపిణీ వేగవంతం చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలి
- సీజనల్ వ్యాధులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 28 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు, తెలంగాణ జలసిరి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, సీజనల్ వ్యాధుల నివారణపై వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, హౌసింగ్ శాఖ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలతో మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులతో వర్షపాతం, సాగు విస్తీర్ణం, ప్రస్తుతం సాగులో ఉన్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గే అవకాశముందని, రైతులకు ఈ పరిస్థితులపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. వరికి బదులుగా కందులు, పెసర్లు, మినుములు, మొక్కజొన్న, ఆముదం, నువ్వులు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని, విత్తన మేళాల్లో అవసరమైన అన్ని రకాల విత్తనా లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, పంటకుంటలు, ఊటకుంటలు, బోరు బావుల రీచార్జ్ పనులను అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. ఏపీఎంలు, ఎంపీడీఓలు పక్కా ప్రణాళికతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భ జలాల పెరుగుదలకు దోహదపడుతుందని రైతులు, ప్రజలకు వివరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకొని పనిచేయాలని హౌసింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మొదటి దశలో మంజూరైన ఇళ్ల నిర్మాణాల పురోగతి, వివిధ దశల్లో ఉన్న పనులు, పూర్తయిన ఇళ్ల వివరాలను మండలాల వారీగా సమీక్షించారు. రెండో దశ మంజూరుకు సంబంధించిన ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, నిర్మాణ సామగ్రిపై అవగాహన కల్పిస్తూ అవసరమైన సహకారం అందించాలని, హౌసింగ్ పీడీ, డీఈలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గుడిసెలు, రేకుల షెడ్లలో నివసిస్తున్న అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి ప్రతి ఇంటి నిర్మాణ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.
జిల్లాలో జరుగుతున్న రైతు గ్రామసభలకు మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా హాజరై ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటలు, భూగర్భ జలాల సంరక్షణ, తెలంగాణ జలసిరి, సీజనల్ వ్యాధుల నివారణ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై రైతులు, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పంచాయతీ అధికారి జయశీలతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ అంతరాయంతో ముందుకు సాగని వ్యవసాయం

## 12 గంటలకు గాను మంగళవారం ఒకే గంట.. రైతన్నలు ఆందోళన





**గంభీరావుపేట, జూలై 28 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా వ్యవసాయాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వం ఆలోచన చేసినప్పటికీ వ్యవసాయ రంగం గానికి ఉచితంగా విద్యుత్ అందిస్తున్న సంగతి తెలిసిందే కానీ రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో విద్యుత్ సమస్యలు రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మండల కేంద్రంలో తగినంత విద్యుత్ సిబ్బంది లేకపోవడంతో వ్యవసాయ విద్యుత్ లోపాలను సకాలంలో పరిష్కరించలేకపోతున్నారు. దీంతో బోరు మోటార్లు పనిచేయక పంటలకు అవసరమైన నీరు అందక వ్యవసాయ పనులు నిలిచిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నుండి మంగళవారం వరకు 24 గంటలు కరెంటు అందాల్సింది ఉండగా దాదాపు అందులో 9 గంటల మాత్రమే కరెంటు వచ్చిందని రైతులు తెలిపారు, కరెంటు ఎందుకు రాలేదని లైన్మెన్ ను అడగగా ఫోను లిఫ్ట్ చేయడం లేదని,ఏదో ఒక ట్రాన్స్ఫర్ దగ్గర ప్రాబ్లం ఉన్నదని దాన్ని చూసి బాగు చేస్తామని రోజు ఇదే పరిస్థితి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ సీజన్‌లో విద్యుత్ అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ లోపాలు, ఇతర సాంకేతిక సమస్యలు తరచూ తలెత్తుతున్నప్పటికీ వాటి పరిష్కారంలో ఆలస్యం జరుగుతోందని రైతులు పేర్కొంటున్నారు. ఫలితంగా సాగు పనులు ప్రభావితమవుతున్నాయని అంటున్నారు. మండలానికి అదనపు లైన్‌మెన్లు, విద్యుత్ సిబ్బందిని వెంటనే నియమించి రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రోజుకు పదిసార్లు బ్రేక్ డౌన్ కాకుండా చూడాలని దీనివల్ల మోటార్లు కాలిపోతున్నావని నాణ్యమైన విద్యుత్ అందించాలని రైతు బోయిన గారి రామచంద్రం కోరారు

> వ్యవసాయ విద్యుత్ సమస్యలు నా దృష్టికి ఇప్పుడే వచ్చిందని వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ అందిస్తామని వ్యవసారంగానికి రోజుకు12 గంటల కరెంటు సజావుగా ఇస్తామని అంతారాయం ఉంటే ఎంత కరెంటు అంతరాయం జరిగిందో ఆ కరెంటు మళ్లీ తిరిగి ఇస్తామని తెలిపారు.
>
> **- ఏఈ ఆనంద్ కుమార్**

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
29 జూలై 2026



# సాంకేతిక పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా తెలంగాణ

- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులకు అభినందనలు

**ఢిల్లీ (జనంసాక్షి) :** అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, ముఖ్య నిర్వహణ అధికారి (సీఓఓ) నాగ భరత్ డాకా ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. భారతదేశంలోనే ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్-క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్-1ను విజయవంతంగా ప్రయోగించిన తీరును వారు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. సమావేశంలో తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాల పురోగతి, ఆవిష్కరణలు, అధునాతన తయారీ, పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ), ప్రభుత్వం--ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య సహకార అవకాశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. వారు సాధించిన విజయం భారతదేశాన్ని ప్రపంచ అంతరిక్ష రంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళుతుందని ప్రశంసించారు.

# ఎన్నాళ్లకెన్నాళ్లకెన్నాళ్లకు...

- ఉప్పొంగుతున్న మంజీరా..
- పొంగి ప్రవహిస్తున్న ఘనపూర్ (వనదుర్గా) ప్రాజెక్ట్



**మెదక్ బ్యూరో, జూలై 28 (జనంసాక్షి):** జిల్లాలోని మధ్యతరహా సాగునీటి ప్రాజెక్ట్ అయిన ఘనపూర్ (వన దుర్గా) ప్రాజెక్ట్ పొంగి ప్రవహిస్తుంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంజీరా నది పరవళ్ళు తొక్కుతుంది. ఘనపూర్ ఆనకట్ట పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 0.2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఎగువ నుండి వస్తున్న వరద ఉధృతితో ఆనకట్ట పూర్తిస్థాయిలో నిండింది. అయితే వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున, నది పరీవాహక ప్రాంతాల ప్రజలు మరియు మంజీరా తీర ప్రాంతాల మత్స్యకారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా తగిన ముందస్తు చర్యలు చేపట్టారు. నదిని దాటడం గానీ, చేపల వేటకు వెళ్లడం గానీ చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. గత సంవత్సరం ఈపాటికి వరద ముంచెత్తడంతో ఉధృతంగా ప్రవహించింది. ఎగువ ప్రాంతంలో ఉన్న సింగూర్ ప్రాజెక్ట్ నుంచి భారీ వర్షాలతో మూడు నెలల పాటు పూర్తి సామర్థ్యంతో ప్రవహించింది. కాగా సింగూర్ ప్రాజెక్ట్ కు ముప్పు పొంచి ఉందన్న నిపుణుల సలహాలతో సింగూర్ ప్రాజెక్ట్ మరమ్మతుల పనుల కోసం నీటిని ఖాళీ చేయడంతో గత యాసంగి సీజన్లోనే ఘన్పూర్ ఆనకట్ట లో నీళ్లు అడుగంటాయి. ఈ వానకాలం ప్రారంభమైనప్పటికీ సరైన వర్షాలు కురవకపోవడం.. పైనుంచి వరదలు రాకపోవడం... రెండు నెలలు గడుస్తున్నా వర్షాలు కురవక నీళ్లు లేక గన్ పూర్ ప్రాజెక్ట్ వెల వెలపోయింది. దాంతో జిల్లా రైతాంగం ఆశలు వదులుకున్నారు. గత వారం రోజులుగా ఘన్పూర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో వరద ఉధృతి పెరిగింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఘన్పూర్ (మనదుర్గా) ప్రాజెక్టు పొంగి ప్రవహిస్తుంది. దాంతో రైతాంగం హర్షాతిరేఖాలు వ్యక్తం చేస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

# భారత వాయుసేనలో చేరండి

**గీతం విద్యార్థులకు ఐఏఎఫ్ అధికారి దీపక్ భరద్వాజ్ పిలుపు**



**పటాన్‌చెరు, జులై 28 (జనం సాక్షి) :** భారత వైమానిక దళం (ఐఏఎఫ్)లో అధికారులుగా లేదా అగ్నివీరులుగా చేరి దేశ సేవ చేయాలని గీతం విద్యార్థులను భారత వాయుసేనకు చెందిన మాస్టర్ వారెంట్ ఆఫీసర్ దీపక్ భరద్వాజ్ ప్రోత్సహించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో 'భారత వైమానిక దళ నియామకం: అభివృద్ధి వాహనం- వృత్తి మార్గదర్శనం' అనే అంశంపై మంగళవారం నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఐఏఎఫ్ సహకారంతో, గీతం ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాయుధ దళాలలో వృత్తి అవకాశాల గురించి విద్యార్థులలో అవగాహన కల్పించారు. పలువురు వాయుసేన అధికారుల బృందంతో వచ్చిన దీపక్ భరద్వాజ్, విద్యార్థుల ప్రయోజనం కోసం భారత వైమానిక దళ సామర్థ్యాలను ప్రదర్శించే ఒక మొబైల్ ఎగ్జిబిషన్, సిమ్యులేషన్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి దీపక్ భరద్వాజ్ మాట్లాడుతూ, యూపీఎస్సీ, ఏఎఫ్ క్యాట్, ఎన్.సీ.సీ. స్పెషల్ ఎంట్రీ ద్వారా పర్మనెంట్ కమిషన్ లేదా షార్ట్ సర్వీస్ కమిషన్ తో ఐఏఎఫ్ లో చేరవచ్చన్నారు. ఒకసారి ప్రవేశ స్థాయి అధికారిగా చేరాక, వైమానిక దళాధిపతి (చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్) పదవి వరకు ఎదగొచ్చని చెప్పారు. అలాగే ఫ్లయింగ్, టెక్నికల్, గ్రౌండ్ డ్యూటీ విభాగాలతో పాటు, ప్రతి విభాగానికి కావలసిన అర్హతా ప్రమాణాలు, అవసరమైన అర్హతల గురించి కూడా ఆయన విపులంగా తెలియజేశారు. అంతే కాకుండా, ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డు (ఐఎఫ్ఎస్బీ) ప్రక్రియను కూడా ఆయన వివరించారు. ఇందులో రాత పరీక్షలు, వ్యక్తిత్వ మదింపు, మానసిక పరీక్షలు, గ్రూపు టాస్క్ లు, ఇంటర్వ్యూలు, వైద్య పరీక్షలు, ప్రతిభ ఆధారిత ఎంపిక వంటి అంశాలు కూడా ఉంటాయన్నారు. శాస్త్రీయ, పారదర్శకమైన ఎంపిక విధానాన్ని ప్రస్ఫుటీకరిస్తూ, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, నిబద్ధతతో సిద్ధం కావాలని ఆయన ప్రోత్సహించారు. వైమానిక దళ వృత్తి వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, దీపక్ భరద్వాజ్ ఆకర్షణీయమైన జీతభత్యాలు, సదుపాయాలతో కూడిన వసతి, సమగ్ర వైద్య సంరక్షణ, విద్యావకాశాలు, సెలవు ప్రయోజనాలు, బీమా సౌకర్యం, సాహస కార్యకలాపాలు, వృత్తిపరమైన అభివృద్ధి గురించి మాట్లాడారు. ఈ చర్చ గోష్ఠి కార్యక్రమంలో ఇంకా ప్రొఫెసర్ వేణు కుమార్, డాక్టర్ మహమ్మద్ అక్తర్ ఖాన్, అధ్యాపక బృందం, విద్యార్థులు చురుకుగా పాల్గొని, ఐఏఎఫ్ అధికారులతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# హామీల అమలులో కమిటీలదే కీలక పాత్ర

- హామీలు అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత వారితే
- హామీల అమలు కమిటీల సమావేశంలో స్పీకర్ ప్రసాద్ కుమార్



**హైదరాబాద్, జులై28 (జనంసాక్షి) :** పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ హామీల అమలు కమిటీల పాత్ర చాలా గొప్పదని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శాసనసభ సమావేశాల సందర్భంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విదంగా చూడాల్సిన బాధ్యత హామీల కమిటీదని అన్నారు. ఆవిధంగా పనిచేయాలని సూచిస్తున్నాను. నియామాల కమిటీ శాసనసభ సక్రమమైన, సమర్థవంతమైన ,ప్రజాస్వామ్య బద్ధమైన నిర్వాహణలో అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తుందన్నారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో మంగళవారం శాసనసభ ప్రభుత్వ హామీల అమలు కమిటీల, శాసనసభ నియమాల కమిటీ, శాసనసభ యొక్క నైతిక విలువల కమిటీల ప్రారంభ సమావేశం జరిగింది. శాసన సభాపతిగడ్డం ప్రసాద్ కుమార్ , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శాసనసభ హామీల అమలు కమిటీ చైర్మన్ పటోళ్ల సంజీవరెడ్డి, సభ్యులు జె. అనిరుధ్ రెడ్డి, జారే ఆదినారాయణలు హాజరయ్యారు. రూల్స్ కమిటీ సమావేశానికి కమిటీ సభ్యులు దానం నాగేందర్, తూడి మెఘారెడ్డి, భూక్యా మురళి నాయక్, హాజరయ్యారు. శాసనసభ నైతిక విలువల కమిటీ చైర్మన్ రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి ,కౌన్సిల్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి పాల్గొన్నారు. శాసనసభ చట్టాల ద్వారానే కాకుండా ఆ చట్టాలను రూపొందించే సభ్యుల ప్రవర్తన, నిబద్ధత మరియు వ్యవహార శైలి ద్వారా కూడా అంచనా వేయబడుతుందని స్పీకర్ అన్నారు. ప్రజల విశ్వాసాన్ని పరిరక్షించడం మరియు ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల నమ్మకాన్ని బలోపేతం చేయడం అనే ఉద్యేశ్యంతోనే ప్రపంచ వ్యాప్తంగా పార్లమెంటరీ వ్యవస్థలో నైతిక విలువల కమిటీ అనే వ్యవస్థ అభివృద్ధి చెందింది. రాగద్వేషాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా కమిటీలు పనిచేయాలి. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ శాసనసభలో సభ్యులకు మొదటిగా ఇచ్చేది రూల్స్ బుక్, దానికి అనుగుణంగా స్పీకర్ శాసనసభను నడుపుతారని అన్నారు. గత ప్రభుత్వంలో రూల్స్ బుక్ ను మార్చివేశారు. శాసనసభను సమర్థవంతంగా నడపడానికి కమిటీ అధ్యక్షులు, సభ్యులు కలిసి నూతన నిబంధనలతో రూల్స్ బుక్ ను రూపొందించాలి. శాసనసభ కమిటీలు ఇతర రాష్ట్రాలలో కూడా స్టడీ టూర్ చేసి ఆయా రాష్ట్రాల శాసనసభలలో అమలవుతున్న నిబంధనలను పరిశీలించాలి, వారి సలహాలు తీసుకోవాలని నా సూచన అని అన్నారు. సభలో నియమాలను పాటించే విదంగా చూడడంతో పాటుగా, సభ హుందాతనాన్ని కాపాడడంలో విలువల కమిటీది కీలక పాత్ర అన్నారు. కమిటీ నిర్ణయాలు పారదర్శకంగా ఉంటూ తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ గా ఉండే విదంగా ఎథిక్స్ కమిటీ సూచనలు ఉండాలన్నారు. కమిటీల చైర్మన్లు మాట్లాడుతూ... శాసనసభ మాపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తూ సభ గౌరవాన్ని పెంచుతామని తెలిపారు.

# అత్యాధునిక వసతులతో జగిత్యాలలో కొత్త ఆస్పత్రి నిర్మాణం

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జగిత్యాల గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో అన్నిరకాల స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. అత్యాధునిక వసతులతో కూడిన హాస్పిటల్ భవనం నిర్మిస్తున్నామని, కొత్త హాస్పిటల్‌లో అన్నిరకాల స్పెషాలిటీ వైద్య సేవలను ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. జగిత్యాల్ మెడికల్ కాలేజీలో అన్నిరకాల పీజీ సీట్ల కోసం దరఖాస్తు చేయాలని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు జగిత్యాల్ మెడికల్ కాలేజీ, జీజీహెచ్, ఇతర హాస్పిటళ్ల పనితీరుపై మంత్రి సమీక్ష చేశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్‌లో మంగళవారం జరిగిన ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవీందర్ నాయక్, జగిత్యాల్ జీజీహెచ్ సూపరింటెండెంట్, డాక్టర్ కృష్ణమూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీసీహెచ్ఎస్ డాక్టర్ రామకృష్ణ, ఇతర ఉన్నతాధికారులు, హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, హాస్పిటళ్ల అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, ఇతర అంశాలపై మంత్రి సమీక్షించారు. జగిత్యాల మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్, సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్ల పనితీరుపై ఆరా తీశారు. జగిత్యాల జీజీహెచ్ పనితీరు మెరుగుపడిందని, హాస్పిటల్‌కు ఓపీ, ఐపీ సంఖ్య పెరిగిందని స్థానిక ఎమ్మెల్యే, డాక్టర్ సంజయ్ వివరించారు. హాస్పిటల్ కోసం కొత్త భవనం మంజూరు చేసినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కోరుట్ల ఏరియా హాస్పిటల్‌లో గతంలో సగటున 550 డెలివరీలు జరిగితే, ప్రస్తుతం 950 వరకూ జరుగుతున్నాయని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. అయితే, సిజేరియన్ డెలివరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, నార్మల్ డెలివరీ సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. హాస్పిటళ్లకు వచ్చే పేషెంట్ల సంఖ్య పెరిగినందున.. కోరుట్ల ఏరియా హాస్పిటల్, మెట్‌పల్లి కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో కేడర్ స్ట్రెంత్‌ను పెంచాలని కల్వకుంట్ల సంజయ్ కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. స్పెషాలిటీ వైద్య సేవల కోసం జగిత్యాల్ జీజీహెచ్, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల కోసం కరీంనగర్ జీజీహెచ్ ప్రధాన హాస్పిటళు ్గా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. జగిత్యాల్‌లో ఇటీవలే క్రిటికల్ కేర్ బ్లాక్‌ను నిర్మించామని, అన్నిరకాల ట్రామా కేర్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. జగిత్యాల్‌లో అత్యాధునిక వసతులతో సెంట్రల్ మెడిసినల్ స్టోర్ ఏర్పాటు చేశామని.. జిల్లాలోని అన్ని హాస్పిటల్స్‌కు ఇక్కడి నుంచే మెడిసిన్ సప్లై చేస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. జిల్లాలోని సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలుకుని అన్ని హాస్పిటళ్లలోని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.


# 500 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల ఫలితాలు విడుదల



**హైదరాబాద్ (జనంసాక్షి) :** డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) పరిధిలోని ప్రభుత్వ హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల ఫలితాలు విడుదల అయ్యాయి. జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ విభాగాల్లోని మొత్తం 500 పోస్టులకు సంబంధించిన ఫలితాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) మంగళవారం విడుదల చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరతను అధిగమించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మొత్తం 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో అనస్థీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు సంబంధించిన 692 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఎంపికైన అభ్యర్థులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేయగా, అధికారులు ఇటీవలే వారికి పోస్టింగ్స్ కూడా ఇచ్చారు. తాజాగా జనరల్ సర్జరీ - 174, జనరల్ మెడిసిన్ - 166, ఆర్థోపెడిక్స్ - 89, రేడియాలజీ - 71 చొప్పున మొత్తం 500 పోస్టులకు సంబంధించిన ఫలితాలను ఎంహెచ్ఆర్‌బీ విడుదల చేసింది. ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల అనంతరం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి, తుది ఫలితాలను ప్రకటించింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఎంహెచ్ఎస్ఆర్‌బీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ పోస్టులకు ఎంపికైన డాక్టర్లకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నూతనంగా ఎంపికైన స్పెషలిస్ట్ డాక్టర్లు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత లేకుండా చూడాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా, 24 విభాగాల్లో 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. నేటితో 1192 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులను మంత్రి ఆదేశించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్లతో సిఎస్ టెలీ కాన్ఫరెన్స్



**హైదరాబాద్, జూలై28 (జనంసాక్షి) :** రాబోయే రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని కేంద్ర వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ ప్రత్యామ్నాయ ప్రణాళిక, వనమహోత్సవం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్.పీ లతో మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఐదు, ఆరు జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు కాగా 26 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందన్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రణాళికలో భాగంగా జిల్లాల్లో విత్తన మేళాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల విషయంలో ఏవిధమైన సహాయం కావాలన్నా అందించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని సిఎస్ తెలిపారు. కాగా, రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో విస్తృత స్థాయిలో కురుస్తాయన్న భారత వాతావరణ శాఖ తాజా సూచనల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు.ప్రధానంగా, వివిధ శాఖలతో సమన్వయంతో పని చేయాలన్నారు. భద్రాచలం, ములుగు, నిర్మల్ జిల్లాలలో ఎన్‌డిఆర్‌ఎఫ్ ఈ బృందాలను అందుబాటులో ఉంచామన్నారు. హైదరాబాద్, ఇతర ప్రధాన కేంద్రాల్లో ఉన్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను కూడా అవసరం ఉన్న చోటుకు తరలిస్తామన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, కార్యదర్శులు దాసరి హరిచందన, సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# 'పెద్ది'కి మంత్రి పొంగులేటి పరామర్శ

**నర్సంపేట, జూలై 28 (జనంసాక్షి) :** ఇటీవల గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి కలిసి పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు కలిసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ లక్ష్మి రామనాథం, పంబి వంశీ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా రోడ్డు ప్రమాదంలో రంగారెడ్డివాసి మృతి

**రంగారెడ్డి, జూలై28 (జనంసాక్షి) :** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా వాసి మృతి చెందారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శ్రీపాతి దీపారెడ్డి (44) న్యూజెర్సీలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మాడుగుల మండల కేంద్రానికి చెందిన పట్టాభి శేఖర్ రెడ్డి, శశిరేఖ దంపతుల కుమార్తె అయిన దీపారెడ్డికి 20 ఏళ్ల కిందట ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డితో వివాహమైంది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కావడంతో అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడ్డారు. దీపారెడ్డి కారులో ప్రయాణిస్తూ న్యూజెర్సీలో సిగ్నల్ వద్ద ఆగిన సమయంలో మరో కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరికి ఇద్దరు కూతుళ్లు సంస్కృత, హర్షిత ఉన్నారు.

# సమస్యల పరిష్కారం కోసం పోరుబాట

- జంతర్ మంతర్ వద్ద జర్నలిస్టుల ఆందోళన




**న్యూఢిల్లీ, జూలై28 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన జర్నలిస్టులు ఢిల్లీ జంతర్ మంతర్‌లో ధర్నా నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ ధర్నాలో మాట్లాడారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్‌లను పునరుద్ధరించాలని, పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్రం తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370